
కుమారవిజయము

[పద్యాసుర]





గ్రంథకర్త:

సువర్ణ ఘంటాకంకణ బిరుదాంకిత
సంస్కృతాంధ్ర పండిత

మహాకవి జంధ్ల సుబ్రహ్మణ్యము.

కుమారవిజయము

"కుమారస్వామి యుద్ధ...

సువర్ణ ఘంటాకంకణ బిరుదాంకిత
సంస్కృతాంధ్ర పండిత
మహాకవి బండ్ల సుబ్రహ్మణ్యము

శ్రీ బండ్ల సుబ్రహ్మణ్యముగారు రచించిన "కుమార విజయము" సాంతము చదివితిని. కనులు తెఱచి చదువుచున్నంత సేపు దివ్యకావ్యమై, కనులుమూసి తత్పర్యాలోచన సేయునపుడు దృశ్యకావ్యమై మనసును రంజింపఁజేసినది యీ గ్రంథము.

నాటకము నాట్యోపయోగితాగుణముకలదిగా నుండవలెను. ఈదృష్టిని జూచిన ఈగ్రంథము వన్నెకెక్కును. రంగసంభారములను (ఉదా॥ పుట 23, 29, 31) సూచించిన ఈకవి రంగానుభవము మెండుగాఁగలవాఁడని చెప్పక చెప్పకొనుచున్నాఁడు. సంభాషణలలో సామెతలు అహమహమికతో సందర్భోచితముగా, బహుళముగా దొరలినవి. అచ్చ నుడికారములు జాతిప్రాణమై యొప్పినవి. రసభంజకములుగాని సంస్కృతసమాసఘటన శ్రవోలంకృతిగా మెఱసినది. పద్యాంతములు ప్రాయశః కాకుసంబోధాంతములయి రంగస్థలోపయుక్తముగానున్నవి.

నాటకమంతయు కాళిదాసుని జ్ఞప్తికిఁ దెచ్చును. పద్యరచన ఒక్కొక్కచో పోతనను దలపించును. ("మారుఁడు"... ... ... "బాలుఁడు" పుట 71)

51 పుటలోని "రాహుకళ" 43 పుటలోని "నిప్పుతోఁ జెరలాట" నాటకకళకు మెరుగుపెట్టు వజ్రపుఁ దునకలు.

యుద్ధపరిదర్శనము రంగస్థలమున చేయించిన యీ కవి ఆధునిక లక్షణములను జీర్ణము చేసికొన్నవాఁడని తెల్పును. లక్షణము మారకూడదా ?

సర్వథా పరిదర్శన యోగ్యమైన యీనాటకము చిరకాలము సాహిత్యరంగమున వెలయఁగలదని ఆశించుచున్నాను. ఇట్లే మున్ముందు ఈ కవి సరసనాటకములను రచించి ఆంధ్రభాషా యోషను కైసేయుగాతమని భగవంతునిఁ బ్రార్థింతును.


ద్వాదశ భాషావిశారద
కోట సుందరరామశర్మ
Ministry of Education.

ఢిల్లీ
1-3-'58

శుభాకాంక్షలు

మీ కుమారవిజయమును నాందీప్రారంభముగాఁ జదువ మొదలిడితిని. తథాస్తు. మంగళమ్ మహత్. వఱకు నాఁపలేక పోయితిని. అసలు కవిత్వమనుదానికింత మాధుర్యముగలదా? ఎందఱెట్టికై తరచింపఁగలరను నచ్చెరువు తీరమును త్తరించినది. వెంటనే యెందఱెట్టి కవిశేఖరులు అదృష్టచక్రమున కడుగునఁబడియుండిరో యనువగపు ముంచివేసినది. కానిమ్ము. చక్రమునకు భ్రమణము స్వభావముగదా యని శాంతిగల్గినది. స్ఫురణయందేమి? విషయైక్యమునందేమి? కథైకాగ్రతయందేమి? కథాసంవిధానమునందేమి? వ్యంగ్యస్ఫోరకమునందేమి? గభీరభావతరంగరంగతరసప్రవాహమునందేమి? కవికాలపు సంఘజీవనమునుఁ బ్రతిబింబింపఁజేయుటయందేమి? విశిష్టతవహించి సజీవనాటకమై యుత్తమ సారస్వతమై యున్నది మీ నాటకము. కథతోఁ బ్రేక్షకులఁ దీసికొనిపోవునుత్సుకత- పాత్రోచితభాష- పాత్రచిత్రణము- ప్రతిభను సూచించుచున్నవి. నాటకపరిమాణమును మించిన ప్రశంస వ్రాయఁదగిన దీకబ్బము.

అబ్బూరాజు సూర్యనారాయణ.





పరమ శివభక్తి భావసంభరితుఁడైన
సుగుణి మాతండ్రి వేంకట సుబ్బయార్యు
నకు కుమార విజయము వినమ్రమతిని
అంకితంబిత్తు పితౄణ మపనయింప



గ్రంధకర్త

పాత్రలు

దేవతలు :

1 శంకరుఁడు
2 విష్ణువు
3 బ్రహ్మ
4 కుమారస్వామి
5 నారదుఁడు
6 వీరబాహువు
7 ఇంద్రుఁడు
8 బృహస్పతి
9 మన్మథుఁడు
10 రతి

రాక్షసులు :

1 పద్మాసురుఁడు
2 సింహవక్త్రుఁడు
3 తారకుఁడు
4 శుక్రాచార్యులు (రాక్షసగురువు)
5 ధర్మగోపుఁడు
6 భానుకోపుఁడు
7 వాతాపి
8 ఇల్వలుఁడు

విషయవిభాగము

* వటద్వీపమునకు నారదుని పయనము
* పద్మాసురుని వీరయాగము
* ఇంద్రుని పరాజయము
* తారక విష్ణువుల యుద్ధము
* సత్యలోకము - మన్మథ ప్రతిజ్ఞ
* శివ తపోభంగము
* పద్మాసురుని పానశాల
* జీర్ణంజీర్ణం వాతాపిజీర్ణమ్
* పద్మాసుర పరాభవము
* వీరబాహు రాయబారము
* కుమారస్వామి యుద్ధము

నాంది

శ్రీ రమ్యుండయి తారకాదిహరుఁడై సింహావలగ్నస్థుఁడై
హేరంబప్రముఖ ప్రతోషకరుఁడై హేలావిలాసోల్లస
ద్ధీరుండైన కుమారులీలలకు నెంతే మెచ్చి సానందులౌ
గౌరీశంకరులన్నుతించెద జగత్కల్యాణ సంసిద్ధికై

(నాంద్యంతమున ద్వితీయ సూత్రధార ప్రవేశము)

సూ:- ఆహా! సకాలమున విచ్చేసిన సభాసదులందఱు ఎంత ప్రశాంతముగఁ గూర్చుండిరి. ప్రేయసీ! ఒక్కసారి యిటు రాఁగలవా?

నటి:- (ప్రవేశించుచు) వచ్చుచున్నదాన, ఏమి సెలవు?

సూ:- రంగారురంగాలంకరణములతో రంగురంగులవిద్యుద్దీపములతో వివిధ భాషావిశారదులగు రసజ్ఞులతో మన నాటకశాలయంతయు నెంత కళకళలాడుచున్నదో చూచితివా ? కళవలన ఆనందము పొందఁజాలని మానవుడు కలలోనైనఁ గనఁబడఁడేమో. ఇప్పుడేనాటకమును బ్రదర్శించి వీరికి సంతసము గలిగింప నెంచితివి ?

నటి:- ఇప్పటివఱకు ప్రపంచమునందలి యేభాషయందైనను రచింపఁబడని రసవత్తర నాటకరాజమగు కుమార విజయమును. అదుగో దేవలోకమునుండి దేవర్షియగు నారదుఁడు గానకళాలోలుఁడై చనుదెంచుచున్నాఁడు. అనంతర కార్యక్రమమున కుపక్రమింతము రమ్ము.

[ఇది స్థాపన]

ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

ప్రథమాంకము

ప్రథమరంగము

(అగస్త్యాశ్రమ ప్రాంతము)

(ఆకాశమునుండి గానలోలుఁడై నారదుఁడు ప్రవేశించుచున్నాఁడు)

నార:- సత్యలోకమున జననీజనకులగు సరస్వతీ బ్రహ్మలఁ బూజించి దీవనలు గడించి వియద్గంగాసైకతముల విహరించి భగవల్లీలావిలాస భాసుర గానకళాలోలుఁడనై వటద్వీపము చేరఁబోవుచున్నాను. (నలుదెసఁబరికించి) అహో! ఇది అగస్త్యాశ్రమము కాఁబోలు.

ఋషికుమారుఁడు:- (ప్రవేశించి) పూజ్యపాదులగు నారదమహర్షులకు అగస్త్యశిష్యుఁడు నమస్కరించుచున్నాఁడు.

నార:- జ్ఞానాభివృద్ధిరస్తు. మహామహులగు మీ గురువర్యుల తపోమహిమచే సహజవైరముగల పశుపక్ష్యాదులు సైతము మైత్రిమై మెలఁగుచున్నవా? వినయమ్మున వీశిరమ్మునలె ఫలభారమ్మున నివ్వరి మొక్కల తలలు వంగునుగదా? ఆశ్రమవాసులెల్లరు సుఖంబుండిరా?

ఋషికుమారుఁడు:- భగవదాజ్ఞవలన - మఱియు భవదనుగ్రహము వలన. మా గురువర్యుల ప్రబోధమున ఈ ప్రాంతమున భగవద్భక్తి అతిశయించినది. దస్యులబాధ తగ్గినది.

నార:- అటులైన నిప్పుడీ ప్రాంతమునకు దాక్షిణ్య మనర్థకాభిధానము. విశ్వకళ్యాణకారియై వింధ్యగర్వ మణంచిన కుంభసంభవు లిప్పుడేమి చేయుచున్నారో ?


ఋ॥కు:- తపోదీక్షయందున్నారు.

నార:- అటులైన నంతరాయము గలిగింపరాదు. అదియునుంగాక పద్మాసురాదుల వీరయాగము విలోకింప వటద్వీపమునకు వేగ నేగవలయు. ఆజ్యధూమజాలము వర్షాశరన్మధ్య మేఘమాలవోలె నాకసమున నలముకొనుచుండెనేమో! స్వాహారవమ్ములతో ఆహారవమ్ములు పెనఁగొనుట అబ్బురముకాదు. అచ్చట హోమధూమము గుప్పు గుప్పున పైకి లేచినంతనే స్వర్గమున ఇంద్రుని సింహాసనము చప్పున నులికిపడి యుండవచ్చు. సర్వేశ్వరుని సంకల్ప మూహాతీతము.

గీ॥ ఏ మహాశక్తి జగముల నెల్లనిండి
కర్మవశమునఁబ్రాణి చక్రమును ద్రిప్పు
ఆ మహాశక్తిధరుని చే నవతరము
సాదు సజ్జనరక్షణ జరుగుఁగాఁత !

ఋ॥కు:- మహర్షులవాక్య మవితథ మగుఁగాక! (అనుచు నారదునకు నమస్కరించుచుండ నారదుఁడు దీవించునట్లు హస్తసంజ్ఞ చేసి గానలోలుఁడై నిష్క్రమించుచున్నాఁడు)

[ఇది మొదటి తెరముందు జరుగుచుండ లోపల వీరయాగమునకు వలయు దృశ్యమును జక్కఁజేసి కొనవలయును]



స్థలము - యజ్ఞవాటిక

[పీతాంబరధారులై శుక్రతారకులు యజ్ఞకుండము దగ్గఱగూర్చుండి వేల్చుచుందురు. కుండ మధ్యమునఁద్రిశూలము నాటఁబడి యుండును. యూపము పూజాద్రవ్యములు మొదలగునవి వానివాని స్థానముల నుండవలయును]

శుక్రు:- ఓమ్ శివాయస్వాహా-శివాయ ఇదమ్ నమమ
ఓమ్ శంకరాయస్వాహా-శంకరాయ ఇదమ్ నమమ
ఓమ్ మృత్యుంజయాయస్వాహా-మృత్యుంజయాయ
ఇదమ్ నమమ
ఓమ్ పరమేశ్వరాయస్వాహా-పరమేశ్వరాయ ఇదమ్ నమమ
ఓమ్ రుద్రాయస్వాహా- రుద్రాయ ఇదమ్ నమమ

తార:- ఆచార్యా! అచంచల దీక్షాదక్షులగు నా అగ్రజులు చూపిన మహాత్యాగమునకే మహేశ్వరుని మనసు కరఁగనిచో ఇంక నే నా శంకరుని కరుణ సంపాదింపఁగలనా? మాకొఱకు సర్వశక్తుల వినియోగించి శ్రమపడుచున్నారు. ఈ జన్మమున మీ ఋణము తీర్చుకొనఁజాలము. ఇట్లెంత కాలము మనము అవిచ్ఛిన్నముగ హోమము చేయగలము?

శుక్ర:- శివానుగ్రహము కలుగునంతవఱకు.

తార:- అది యసంభవమైనచో?

శుక్రు:- కాదు. సంభవమే.

తార:- ఒకవేళ......

శుక్రు:- అట్లైన ప్రాణత్యాగము.

తార:- ఇది నాకు సరియైన యుపదేశము శంకరా! భక్తవశంకరా!

మ॥ నినుసేవింపని పుట్టువేల? యని తండ్రీ! వీరయాగఁబునక్
జనకుండుర్ గురుఁడానతిచ్చినటు విశ్వాసంబుతోఁ గొల్వమే,
కనులున్నందులకుర్ ఫలంబిపుడుగల్గర్ నీవు రాకున్నచో
నను నీలోకము చేర్చుకొమ్మికఁ జగన్నాథా! దయాసాగరా!

ఒక్కసారి మనసార శివుని ధ్యానించి యీ త్రిశూలముపై దూఁకెద. గురువర్యా! నీకిదే కడసారి నమస్కారము.

(అని ధ్యానించి దూఁకుటకు సిద్ధముగా నుండఁ దెఱలోనుండి తెల్లని వెలుఁగు జాడలు ప్రసరించు చుండును. తారకుఁడు ఆ ప్రకాశము నాశ్చర్యముతోఁ జూచుచుండును శంకరుఁడు తెఱలోనుండి... తారకా! ఆఁగుము... అనును)

చ॥ వలదిఁక దూఁక-మెచ్చితిని-నిచ్చెదఁ గోరు కోరికల్
కలఁగకు-మజ్జటాపటలి గంగను బంపెద-నగ్నికుండముల్
జలమయ మౌచు సోదరులు సత్వర లీల సజీవులై రసా
తలమున సౌఖ్యమందెదరు తథ్యము తథ్యము విశ్వసింపుమా!

(తెఱలోనుండి జలధారవచ్చి అగ్నికుండమును చల్లార్చ నందుండి పద్మాసురసింహవక్త్రులు వెలువడి తారకుని కలిసికొని జలధారవచ్చిన దిక్కుఁజూచుచు మోకాళ్ళమీఁద నిలువఁబడి నమస్కరించుచు)

పద్మా:- సింహా:- తార:- —: దండకము :—
శ్రీమన్మహాదేవ దివ్యప్రభావా శివా దేవదేవా
భవానీధవా భక్తసంరక్షకా కావఁగా వచ్చితే
మెచ్చితే విశ్వనాథా నమస్తే నమస్తే నమస్తే నమః.

శంక:- ఆహా! ఏమి యీ మహాహావదీక్ష. ఏమి యీ మహాహావదీక్ష. వీరరస విలాసమునకు మీ యీప్రదర్శనమే నిదర్శనము. అగ్ని పరీక్ష కాఁగితిరి. కోర్కులు కొనసాగఁ గోర్కొనుఁడు.

పద్మా:- సర్వేశ్వరా! సమస్తలోకముల జయించి ఏకచ్ఛత్రాధిపత్యముగ నేలునట్లును, విష్ణుబ్రహ్మేంద్రాది దేవతలచేతను... క్షమింపుఁడు... మీచేతను ఇప్పటిసృష్టిలో దేనిచేతఁగాని—మాకు చావుకలుగకుండునట్లు వరము ప్రసాదింపుఁడు.

శంక:- అట్లే యొసంగితి. నవరత్నఖచిత దివ్య విమానంబొకటి యిచ్చెద. ఈ యగ్నికుండమున రక్కసులుజనించి నీకు సైనికులయ్యెదరు. నేనుగూడ మీకు వశ్యుండను. నాలోని శక్తి మాత్రమసాధ్యము.

అందఱు:- మహాప్రసాదము. [తలలువంచియుండ శంకరుఁడదృశ్యుండగును]

పద్మా:- గురూ! ఇఁకఁగర్తవ్యము?

శుక్రు:- స్వర్గ మర్త్య పాతాళముల జయించుట. స్వర్గముపై మనకుఁ గల యధికారము స్వతస్సిద్ధము. "పూర్వదేవాః" అనుశబ్దమే మనజ్యేష్ఠత్వమునకు దృష్టాంతము. అదియునుంగాక రాజ్యము వీరభోజ్యము, అవిభాజ్యము.

పద్మా:- (తమ్ములంజూచి) మీ యభిప్రాయము?

సింహ:- గురూపదేశము శిరోధార్యము. మన విజయమునకేగదా మనజనని తపించుచున్నది. ఆ తల్లి యాశీర్వాద బలముతో నిర్వక్రపరాక్రమమున విజృంభించితిమేని యీ రేడుజగంబులు తాటుమాటులు కావే? ఝంఝూమారుతమ్మునఁ దల్లడిల్లుపారావారమ్ము పగిది ఘోరాపదలంజిక్కి- పాదాక్రాంతమ్ములు కావే? ఇంతకు నేమాటయైన మీ నోట వెలువడినఁగాని జీవకళ యుండదు. శంఖమునఁబోసినఁగాని తీర్థముగాదు. కావున మీయాజ్ఞ కెదురుచూచుచున్నారము.

తార:- అగ్రజా! నీ యడుగుజాడ ననుసరించుటకే తారకుఁడు సిద్ధముగనున్నాఁడు.

ఉ॥ సర్వ సుఖాస్పదంబయిన స్వర్గము వారల తాతసొత్తుగాఁ
బూర్వమునుండి దేవతలుపొంది యహంకృతినొంది యేలుచున్
బూర్వసురాగ్రగణ్యులను పోటున దీటుగ మాటిమాటికిన్
సర్వముఁ బాపి చంపిరఁట శౌర్యరసమ్ముఁ జూప చెల్లదే?

మీరు యుద్ధమునకు దిగినచో—

చం॥ చిటచిటలాడు నిప్పులను జిందెడి తూపుల నేపుమీఱఁగా
పుటపుటఁ జిమ్మ వైరులను బూదిగఁజేసెద నట్లుకానిచో
పటపట పండ్లుగీఁటుచును బాహుబలంబునఁ బట్టిచీల్చెదన్
గుటగుటలాడి శాత్రవులు గుట్టలుగా ధరఁ గూలునట్లుగా.

శుక్రు:- [ఆనందమున నవ్వి] అన్నకుఁదగిన తమ్ములు. ఇఁక దేవతల మట్టువెట్టి నట్టడవులకుఁ బాఱఁద్రోలి వారిపట్టణముల పట్టుదల

తోడఁ బాలించి శుక్రశిష్యులు శూరులనఁగ నొప్పుటయే మీ
కర్తవ్యము. అంతవఱకు శాంతిగాని విశ్రాంతిగానియుండఁదగదు

పద్మా:- సోదరులారా! వినుఁడు. హరుని వరబలముచేతను - గురుని మంత్రిబలముచేతను- మీ మనోబలముచేతను- సేనల శరీర బలముచేతను-

గీ॥ హరిని బంధించి స్వర్లోక మాక్రమించి
మర్త్య పాతాళ నాయక మణులఁ ద్రెంచి
సురల నడవికిఁ దోలించి హరుభజించి
ధరణిఁ బాలింతు నాచంద్ర తారకముగ.

శుక్రు:- తథాస్తు. తథాస్తు. పద్మాసురా! ఏనుఁగులపై దుముకఁ దమకించు సింహములవలె నీయండనున్న దండిమగలు దేవతలపై కురుగ సిద్ధపడియుండిరి. తమ కఱకుకత్తుల కెప్పుడు పని గల్గునా యని మాటిమాటికి నొఱనుండి తీసి చూచుకొనుచుండిరి. మనయోధులు శీతాకాలపుఁ గుంపట్లవంటివారు సుమా! వారి భీకర సంగ్రామ సాహసకృత్యములు సర్వసంవేద్యములు. అందఱు విచ్చుకత్తులవంటి జోదులే. చిచ్చరపిడుగులనుచేపట్టి విచ్చలవిడి యార్పివైచు నేర్పరులే. కుచ్చితమెఱుఁగని స్వామిభక్తిగల సచ్చరిత్రులే. ఇఁక మీరన్ననో నిజభుజార్గళ సంశోభిత గదాదండాగ్రమున సంగ్రామ విజయలక్ష్మిని దాండవమాడింపఁగల వరపుత్రులరు.

పద్మా:-సింహ:-తార:- (తలలువంచి నమస్కరించు) కృతజ్ఞులము.

[శుక్రుఁడు విజయోస్తు అనుచు నిష్క్రమించును]

పద్మా:- (లోనికిఁజూచి) యోధాగ్రేసరులారా!

చ॥ బ్రతికిన నాల్గునాళ్ళు నిజపౌరుషలీలఁ జరింపలేనిచో
బ్రతుకఁగనేల నేలకొక భారముగా జగమెల్ల రోయఁగా;
నతులిత శౌర్యసాహస మహాహవదీక్ష వహించి నేఁడికన్
గుతుకముతోడ దేవతలఁ గూఁకటివేళ్ళను ద్రెంప కుందునే?

ఈ సర్వదిగ్జైత్ర యాత్ర సందర్భమున మీ సంపూర్ణ సాహాయ్యమును గోరుచున్నాను. సంగ్రామ సాధన సన్నా

హాముతో శీఘ్రముగా శిబిరములకు రండు. సోదరులారా! మీరు ముందంజ వేయుఁడు.

సింహ:- తార:- చిత్తము. (నిష్క్రమించుచున్నారు)

(గానలోలుఁడై నారదుఁడు ప్రవేశించుచున్నాఁడు)

పద్మా:- గానకళావిశారదా! నారదా! వందనములు.

నార:- శుభంభవతు. (మోముఁజూచి) దీర్ఘాలోచన పరుఁడవై నట్లు తోఁచెడిని, కారణమరయవచ్చునా?

పద్మా:- కారణము (వెగటుగనవ్వి) మా రణము... మారణము.

సీ॥ వీరహోమము చేసి వీరుండనై యీశు
మెప్పించి మితిమించి మెఱసినాఁడ
రణరంగదుర్భేద్య రమ్యాస్త్ర కవచముల్
నందివాహను దయఁ బొందినాఁడ
బ్రహ్మాండముల మహాప్రతిభతోఁ బాలించు
పాలకులను బాఱఁదోలువాఁడ
ఈరేడులోకాల కేలికనై మించి
యెదురు క్షత్రియ లేక యేలువాఁడ

గీ॥ రాక్షసాన్వయ విజయ సామ్రాజ్యకీర్తి
సర్వ దిగ్దంతి దంత విశ్రాంతి నొంద
చూచి తలయూచి ముకు వ్రేలువైచుకొనవె?
మహితగుణసాంద్ర! నారదమౌనిచంద్ర!

నార:- (జనాంతికముగ) దేవ ద్వేషము పరంపరాగతము. ఆవుచేనిలో మేయ దూడ గట్టున మేయునా? ఇప్పు డీతని కోపాగ్నికి వాయుదేవుఁడ నయ్యెద. "స్థూణానిఖనన్యాయము" గఁ బరీక్షించెద. ఆవల హితోపదేశము గావించెద. (సమీపించి తల యూపి నవ్వుచు) ఔరా! యెంతటి ప్రయత్నము! ఇంద్రాదులకు సర్వ సహాయుఁడై విష్ణువుండునని తెలియునా?

పద్మా:- తెలియకేమి? తానుదూర సందులేదు డోలొకటి మెడకు. ఇఁక దేవతలు విష్ణువును నమ్ముట కుంటివానిపై గ్రుడ్డివాఁడెక్కుట

నార:- శ్రీమహావిష్ణుపుశక్తి నీవు పూర్తిగా గ్రహింపలేదు. దేవతలపై అక్కటికమ్మున పెక్కవతారములెత్తి రక్కసుల యుక్కడంచిన దైత్యారినా తెలుమఁజూచుట? మత్స్యావతారమ్మున సోమకుని మట్టువెట్టి, కూర్మావతారంబున మంధరగిరి కవ్వంబుగ మోసి, జగన్మోహినియై బుధులకు సుధ నిడిన పుండరీకాక్షునా నీవు దండించుట. అసాధ్యము... అసాధ్యము... అదియునుఁగాక తక్కిన దైవబలముమాత్రము సామాన్యమా?

సీ॥ శాపమాత్రమ్మున శత్రుల సాధించు
ద్వి తేజుఁడు బ్రహ్మదేవుఁడుండ
వజ్రాయుధమ్ముచేఁ బర్వత పక్షముల్
నఱికివైచెడి సురనాధుఁడుండ
అఖిలాస్త్రశస్త్రజాలార్జ నాహవశక్తి
వరలు దిక్పాలక వర్గముండ
గంధర్వకిన్నర గరుడ విద్యాధరు
లాజి రాజిత తేజు లలరుచుండ

గీ॥ అమృతపానమ్ముచేఁ జావు నధిగమించి
బలము కలిమిని గులుకు దేవతలు నుండఁ
గడు నసాధ్యమ్ము జయమందఁగలవో లేవో
నమ్మకము నాకు లేదు దానవకులేంద్ర!

పద్మా:- (నవ్వి) నారదా! శ్రమపడి దీర్ఘోపన్యాస మిచ్చినాఁడవు. ఇంతమాత్రమునకే భయపడువాఁడు కాఁడీ పద్మాసురుఁడు. నిండుకుండ తొనకదు - సరిగాపడిన కాలు వెనకదు. పెద్దవాఁడవనఁగూడదుగాని గడపగడప పూజచేయుటచే నీకును అప్పుడప్పుడు మతి మారుచుండునేమో.

నార:- నవగ్రహముల గతులుమారినను నామతి మారదు. నాకొకరు మిత్రులు - ఒకరు శత్రువులా! ఒకరినిగుఱించి యెక్కువగా మరియొకరిని గుఱించి తక్కువగాఁ జెప్పవలసిన యవసరము

నా కెప్పుడును గలుగదు. ఉన్నవిషయ మగ్గడించుటలో నిగ్గు దేలినవాఁడను. నీ మేలుగోరి నేనాడిన మాటలలోని తారతమ్యము తెలిచిచూడుము. అదేమి చిత్రమోగాని కన్ను దెఱిచినదిమొదలు రాక్షసవీరులకు స్వర్గముమీఁదనే చూపు.

పద్మా:- హక్కుగలవారి కాదృష్టి సహజమేగదా!

నార:- ఔను హక్కును గుర్తించినపుడు బాధ్యతగూడ గమనింప వలయును. అంతియేగాని, నీ శౌర్య ధైర్య స్థైర్యముల నెఱుంగని వాఁడనుగాను. తాడిసెక్కువారి తల తన్నువాడుండును నీవంటి మహా పరాక్రమశాలి మీ వంశమున నిప్పటికిఁ బుట్ట లేదనుట యతిశయోక్తిగాదు. కాని, ఇంతవఱకు (శ్రీ) మహా విష్ణువును జయించినవాఁడును లేఁడు.

పద్మా:- ఆ... అట్లు దారికిరమ్ము. ఆ కొఱఁత దీర్చుటకే మేము జన్మించినవారమని నమ్ము.

మ॥ పని లేనందునఁ దుప్పుపట్టిన గదాప్రావీణ్య మిప్పట్టునన్
బునరుద్భాసితమై చెలంగఁ గలఁగుఁ బోరాటమారాటమై
యినకోటిప్రభతో వెలుంగ శని నే నేకాదశస్థానమం
దొనఁగూర్తుఁ భళి! ముజ్జగంబులను నే నుఱ్ఱూతలూఁగింపనే.

నార:- పద్మాసురా! యుద్ధము సర్వానర్థములకు మూలము. చెలరేఁగిన దవాగ్ని మొండ్లచెట్లనేగాదు; పండ్లచెట్లనుగూడఁ గాల్చివేయును. కనికరములేని హృదయము నీరు, కొబ్బరిలేని నారికేళము. నీకున్న రాక్షసరాజ్యముతో తృప్తినొందలేవా?

పద్మా:- అది వీరధర్మముగాదు నీవిట్లాడుట గిల్లి జోలపాడుట.

నార:- నా సదుపదేశము బధిరశంఖన్యాయమైనది. విడువుమన్న పామునకు, కఱువుమన్న కప్పకు కోపము. కానున్నది కాక మానదు. మంచిది సెలవిఁకఁ బోయివచ్చెద.

[చెరియొక దెసకు నిష్క్రమింతురు]

ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

ద్వితీయాంకము

[ఇంద్రుడు - బృహస్పతి ప్రవేశించుచున్నారు]

ఇంద్రు:- ఆర్యా! ఈ స్వర్గసింహాసనాధికారమున నేను మహాభోగము లనుభవించుచున్నట్లు, ఇతరులకుఁ గనఁబడుటయేగాని, నాకు మాత్రమిది మోయరాని భారముగా నున్నది. నూఱు యజ్ఞములు చేసి పొందిన భాగ్యమిది.

బృహ:- ఔనౌను. కష్టసుఖములు కావడికుండలు. ఎంత దివ్వెక్రింద అంత చీఁకటియుంట నైజము. కావడిబరువు మోయువానికిఁ దెలియుఁగాని చూచువారికిఁ దెలియునా? ఇప్పుడీవిచారమేల?

ఇంద్రు:- నా యెడమ కన్నదరుచున్నది. స్వర్గపుర రాజ్యలక్ష్మి కళాహీనమైనట్లు నా మనస్సునకుఁ దోఁచుచున్నది.

బృహ:- రాఁబోవు కష్టసుఖముల సూచించు ప్రకృతిచిహ్నములను జ్ఞానవంతులు గ్రహింతురుగదా. నా యంతరాత్మయు నేదో కీడును శంకించుచున్నది. ఏ మూల ఏ రాక్షసులేమి చేయుచున్నారో.

ఇంద్రు:- మనము పంపిన గూఢచారులు ఇన్నిదినములకైనను దిరిగి రాఁజాలకపోయిరి. ఎవరిచేనైన బంధింపఁబడిరా? నేఁటిసభకు దిక్పాలకు లొక్కరునురారు. విమానసంచారమా: లేదు? కటా! ఏమికారణము?

బృహ:- నిర్విచారులైన సర్వసుపర్వులను గర్వంబునఁ జెలుపఁజూచు వారు రాతిరించరులేగదా!

[గానలోలుఁడై నారదుఁడు ప్రవేశము]

ఇంద్రు:- [నమస్కరించి] ఈ పీఠ మలంకరింపుఁడు.

నార:- (కూర్చుండును)

బృహ:- ఊరకరారు మహాత్ములు—

నార:- ఏమి మహాత్ములో... కఠినాత్ముల చేతిలోనుండి బయటబడి నప్పుడుగదా మహాత్ముల గొప్పఁదనము. ఒకప్పుడు మహాత్ము లూరక రావచ్చునుగాని దురాత్ము లెప్పుడును నూరక రారు.

బృహ:- (ఇంద్రుని జూచి) వశ్యవాక్కులుగల యీ దేవర్షి నోట నర్థ శూన్యముగ నిట్టి మాటలు వెలువడవు. అనవసరముగఁ బ్రకృతిమాత ఋతుధర్మమును వ్యత్యస్తముగఁ బ్రదర్శించునా?

ఇంద్రు:- కార్య కారణ సందర్భమును సూచించుచున్న మీ మాటల లోని రహస్యమును దెలిసికొన నా మ న స్సు తొందర పడుచున్నది.

బృహ:- నాకును నట్లేయున్నది. తెఱచాటున గానము సేయుచున్న వేషధారిని చూచుటకుఁ బ్రేక్షకులు తహతహపడుట సహజముగదా!

నార:- మేఘవాహనా!

గీ॥ ఓడ యొకప్రక్క మునుఁగుచున్న వేళ
నందు ముఖ్యులు వెలిచార్త లడిగినట్లు
ఏలికవు దేవలోకార్తి నెఱుఁగవైతి
వేయికనులున్న గ్రుడ్డివి వేయునేల?

బృహ:- నారదా! దేవనాథుని దేశభక్తిని — వజ్రాయుధశక్తిని శంకించుచుంటివా?

నార:- నేనుగాదు; జగమంతయు — వినుఁడు. అసురేంద్రునకు మంగళకేశియందు సురస యను కూఁతురు పుట్టి శుక్రునివలన మాయావిద్య లభ్యసించి మాయ యనుపేరుపొందె. ఆమె

మాయాసౌందర్య మాధురీమహిమచే కశ్యపునాకర్షించి వాని వలనఁ బద్మాసుర సింహవక్త్ర తారకులను ముగ్గురుపుత్రులం గనె. పూర్వము బ్రహ్మసేయు యాగమున నందీశ్వరుఁడు దేవతల సంపదలు చెడునట్లు శాపమిచ్చినసంగతి శుక్రుఁడు గుర్తుంచుకొని యా శాపము నెఱవేర్పఁగల సమర్థులు వీరని గ్రహించి వీరయాగము చేయించె అందు హరుఁడస్త్ర శస్త్రములతో నడిగిన వరము లనుగ్రహించినాఁడు. సహజబలమునకు వరబలము తోడ్పడుటచే వారిశక్తి నెంతని వర్ణింతును!

ఇంద్రుడు:- తన కపకారము సేయఁదలంచిన భస్మాసురునకు సైతము కోరిన వరమిచ్చిన మహాదేవుఁడు వీరికీయకుండునా? అడుగని వానిదే పాపము.

బృహ:- వృత్రాసుర-బలాసుర-జంభాసురాదుల మించినవారా?

నార:- వీరికి వారికిఁగల భేదము హస్తిమశకాంతరము.

ఇంద్రుడు:- తరువాత?

నార:- తరువాత___

మ॥ అసమాన ప్రతిభా విశేషమహిమాహంకారతన్ శూరుఁ డా
కసముంజీల్చు భయంకరధ్వనులతోఁ గాలాంకుండో యనన్
వెస నిర్వక్రపరాక్రమక్రమ జితానేకారి వీరేంద్ర సై
న్య సమేతుండయి దండయాత్ర వెడలెం దమ్ముల్ విజృంభింపఁగా

వెడలి యలకాపురి కేగి రూక్షేక్షణంబున యక్షరాజును భిక్షుకుని జేసి – గంధవతికరిగి గంధవహుని గర్వమడఁచి__ శ్రద్ధావతికిఁజని వరునుని శిబిరము వంగఁజేసి – కృష్ణాంగనకుఁ బోయి నైఋతిని గతిలేనివానిగా నొనర్చి-పితృపతిని భీకరముగనొంచి__అగ్ని తేజమణఁచి — స్వర్గపురికి రా సమకట్టియుండె.

ఇంద్రుడు:- (ధైర్యము తెచ్చుకొని) అటులైన సర్వసైన్యసమేతుండనై పుర ప్రాంగణమున నిల్చి సంగ్రామ మొనర్చి గెల్చెద.

మ॥ అతి శీఘ్రమ్ముగ దైత్య దానవ బలాహంకార శంఖారవో
ద్ధతులెల్లం దలకిందులై తొలఁగ మద్వజ్రాయుధాంచత్ప్రభా
వితంతింజూపెద రూపుమాపెద మహా వీరాధివీరుల్ సమి
ద్గతులంగాంచి ప్రశంససేయఁగ జగత్కళ్యాణ మేపారఁగా.

నార:- కట్టివేయవయ్యా దేవనాథా! గుఱ్ఱమును కట్టివేయుము. అలవిగానిచోట అధికులమనరాదు. ఆపనికి అదనుకాదని చెప్పుటకే నేనింతదూరము వచ్చితిని. సాహసించినను ఫలముదక్కదు. సమయమును గమనించి నీ వణఁగిమణఁగి యుండుట మంచిది. ఆపైని యుక్తిచే తప్పించుకొనుట మఱియు మంచిది.

గీ॥ నలిగియున్నట్టివేళల తొలఁగియుంట
కరము మేలని బుధులు పల్కంగ వినమె?
బలము లేనట్టితఱి మబ్బు పవనహతికి
తొలఁగిపోవదె తగుతోడు దొఱకువఱకు.

బృహ:- ఔను. గ్రహరాజునైతము సమయము తప్పినపుడు తలయుఁ దోఁకయు లేని గ్రహములచే బాధపడునుగదా!

గీ॥ పెద్ద యలవచ్చినప్పుడు వినయగరిమ
శిరమువంచినఁ పైఁజని విఱిగిపోవు
వానగాలి తాఁకుడు వనస్పతికెగాక
వంగిపోయిన తుంగకేభంగ మొదవు.

ఇంద్రు:- మునికులతిలకా! ఈకష్టవార్ధినుండి యుద్ధరింప మీరేసమర్థులు

నార:- దేవేంద్రా! వర దురంహంకార పూరితులైన యాదైత్యులను దాఁక మృత్యుంజయునకైనఁ దరముగాదన్న నీకింకేదిదారి? పాదపూజ గావించుటయే పరమకర్తవ్యము.

ఇంద్రు:- ఎవరికి?

నార:- తాత్కాలికముగ... దానవరాజునకు.

ఇంద్రు:- ఆపైని మాకు రక్షణగలదా?

ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

తృతీయాంకము

స్థలము - క్షీరసాగరము

[పాలసముద్రముపై శేషశయ్య మీఁద విష్ణువు యోగనిద్రయందుండ లక్ష్మి తిన్నఁగా మేల్కొలుపుచుండును. మెల్లఁగా శేషశయ్య ఒడ్డునకుఁ జేరును. లక్ష్మి విష్ణువుం దిగుదురు]

విష్ణు:- దేవీ! యోగనిద్రయందున్న నన్ను నీవు మేల్కొల్ప కారణ మరయక కోపదృష్టి ప్రసరించితిని. ఈ పాలసముద్రమున జాలరులరీతిఁ బడి యీఁదుచు గ్రోలుచు గోలసేయుచున్న వారెవరై యుండనోపు? అగో! మదాంధులగు దానవాధములు. వర్షాకాలమునందు క్షణములో వెలునడు ఉసుళ్ళవలె బయలుదేఱినారు. కదలించి కదనమునకుఁ కాలుద్రవ్వుటయన నిదియే.

చ॥ కరుణ యొకింత లేక సురకంటకులై చరియించు వీరలన్
సరగున జంపి దివ్యులకు శాంతి సుఖంబొనగూర్పకుందునే?
దురితము సేయుటే పరమ దోహదమంచు తలంచు రాక్షసుల్
హరియన నెట్టివాఁడో తెలియంగలరిప్పుడె చక్రధారచే.

దేవీ! నీ వింక లోని కేగుము. (లక్ష్మి నమస్కరించి లోని కేగును) దొంగ రక్కసులారా! మీ యంగంబుల పొంగు రణరంగంబున భంగంబొనర్ప కెంగేల చక్రంబు దాల్చి వచ్చుచుంటి. (నిష్క్రమించుచున్నాఁడు)

ఇంద్రు:- దేవతల యనర్థకములు- రాక్షసుల బలవర్ధకములు.

నార:- శిశిరఋతువున ఆకురాలినను వృక్షమునకు వసంతమునఁ జిగురు పట్టకుండునా? ధైర్యమూనుము. మహామేధావియగు బృహస్పతితో యోచించి వలయురీతిని వర్తింపుము. నేఁబోయి వచ్చెద. (గానలోలుఁడై నిష్క్రమించుచున్నాఁడు)

ఇంద్రు:- గురూ! ఇపుడేది కర్తవ్యము?

బృహ:- సత్యలోకమునకరిగి బ్రహ్మను బ్రార్థించి వీరిమరణోపాయము తెలిసికొనుట మనకర్తవ్యము.

[తెఱలోఁ గలకలము]

సేవకుఁడు:- (రక్తసిక్తాంగుఁడై ప్రవేశించి) సురేశ్వరా! రక్షింపుము రక్షింపుము. పద్మాసురాదులు సైన్యసమేతులై హఠాత్తుగ వచ్చిపైఁబడ నగర సింహద్వారదుర్గరక్షకులు మహాదీక్షతోఁ బోరుచున్నారు. మనబలము చాలదు మీ యాజ్ఞకొఱకు నన్నంపినారు.

బృహ:- ఇంద్రా! అంతఃపుర రక్షణము.

ఇంద్రు:- సేవకా! జయంతుని తోడ్కొనిరాఁగలవా?

బృహ:- (ఆతురతతో) వలదు. ఇది సమయముగాదు ఆలసించిన నన్నియుఁ గష్టములే నెమిలికంటనీరుగాఱ వేఁటకానికిముద్దా?

ఇంద్రు:- భార్యాపుత్రుల విచారించుటకైనను వ్యవధిలేదు ... ... ఆచార్యా! అటులైన మీరు కుటుంబసమేతులరై, యంతఃపుర స్త్రీలను జయంతుని దోడ్కొనిపోయి మేరుపర్వతమున నుండుఁడు. సమయమును గమనించి మిమ్ము గలిసికొనఁగలను. సేవకా! ఆచార్యాదులసాఁగనంపి మఱియొకసారియిటురమ్ము.

సేవ:- చిత్తము.

బృహ:- కష్టములందు ధైర్యమువహించుటయే మహాపురుషుల లక్షణము. విషమును విషముచేతనే యణఁచవలయును. జాగరూకతతో వర్తింపుము. సేవకా! రమ్ము.

(నిష్క్రమించుచున్నారు)

విప్రప్రయోజనములు. ఏనాఁడుగాని వైరులకు జంకని స్వవంశమునకు మాయని మచ్చఁ దూర్పఁ దలంచితిరా? నిలుండు... నిలుండు.

ఉ॥ ఏల రణస్థలిన్ విడిచి యేఁగెదరిట్లు వదుండు గాజులం
దాలిచి చేతులన్ జెలులదాపున మాచ్పట జెప్పుకొందురే?
కూలిన మీకు స్వర్గమొనఁగూడును నా అసిధార గుండియల్
వ్రీలిన రెంటికింజెడిన రేవడులయ్యెదరింకఁ జూడుఁడీ!

అవిగో! సేనలు నిలిచినవి. వారిడాసి వలయురీతి వర్తింపఁ జేసెద.

విష్ణు:- (ప్రవేశించి) ఓరీ నీచులారా!

ఉ॥ నీతి దొఱంగి కాయములు నిత్యములంచుఁదలంచి వేగ్రటుచే
కోతుల రీతి గంతులిడుకొంచును చెప్పక పారిపోయి, యా
రీతి నియంతృవాక్యముల కేఁగిన మీ బలశౌర్యధైర్యముల్
చూతము రండు మిమ్మిపుడ చోద్యముగా జముగీముకంప నే?

తార:- (పద్యము చదువుచుఁ బ్రవేశించుచున్నాఁడు)

శా॥ఆలంబందున నాదుసైనికులు నీ యస్త్రాహతిన్ నిల్వలే
కీలీలం బరువెత్తిపోయిరని యోరీ శౌరి! నిర్భీతితో
మేళంబాడెదె? నల్ల మేకవగు నీన్ మొక్కంగ ఈ సింహమే
కాలాంతంబుగ వచ్చుచుండెఁగనుమా- గర్వోద్ధతిన్ మానుమా!

విష్ణు:- తారకా! నీవుశూరుడవని నే నెఱుంగుదు. దైత్యారియనెడి నా సార్థకనామము నీ వెఱుంగుదువా? అవతారంబులనెత్తిన దెల్ల అసురసంహారమునకే యని తెలియదా? అట్టి నాయట్టి జగజెట్టితో సంగ్రామంబున కొడిగట్టి నీ గట్టియుసురుల నేల వీడెదు? కొంచెపుబుద్ధిని బెంచి మంచిమార్గమునకు రావించి మేలెంచి సుఖంబనుభవింపుము. నేఁజెప్పిన వాక్కులు నీమనంబునకు ఒప్పిదంబులు కావేని తిప్పలుపడక మానవు నీ అబ్బవంటివారు నా దెబ్బకు తబ్బిబ్బులైరి. ఏతత్పరాభవంబున కాసింపక నీ వెచ్చటినుండి వచ్చితివో యచ్చటికేగుము.

ఇంద్రు:- దయచేయుఁడు (ఆసనముఁజూపును)

పద్మా:- (విసపు నవ్వునవ్వి) దయచేయుఁడు-అతివినయము ధూర్త లక్షణము. ఎంత చల్లనిచూపు!...వానలుగురిసిన వాఁతలు పోవునా? ఇంద్రా!

ఉ॥ ఉక్కరియున్న రక్కసుల ఉక్కునచిక్కులఁ జిక్కఁజేయుచిన్‌ఁ
వ్రక్కలుచేసినాఁడవట వారక దిక్కులకేగు గట్టులన్‌
ఱెక్కలు చెక్కినాఁడవట తేఁడ! పవింగొని వెన్నుచూపకే
నిక్కపు శౌర్యమున్నయెడ నీవ రణంబుననిల్చి గెల్వుమా!

[పద్యాంతమున నింద్రునిచేయిపట్టుకొని ముందుకులాగును]

ఇంద్రు:- (వినయముతో) దానవ సార్వభౌమా! మీ సింహగర్జనము నకు బ్రహ్మాండభాండములు బ్రద్దలగుచున్నవి. మీ శౌర్య రసవాహిని కడ్డుదగిలి మరల్పఁగల మహాపర్వతమనా నేను? కాదు... కాదు...... మీ యాజ్ఞకు లోఁబడి స్వర్గమును బాలింప నాకనుజ్ఞనిండు. కాశ్యపులమగు మన మన్నదమ్ము లము గదా!

పద్మా:- అన్నదమ్ములమా?... [నవ్వి] అన్నదమ్ములము! అయిన మనసంబంధము రక్తసంబంధమా? (వికటముగనవ్వి) సెబాస్! అదియే మనకుఁ గావలసినది. అటులైన "జ్ఞాతి శ్ఛేదన లేనకి" మ్మనెడిమాట మనలో నెవరు సార్థకముచేసిరి (తమ్ములవంక చూచి) అన్నదమ్ములము. పొత్తులు కలుపుకొను తొత్తుల జిత్తులు—నక్కజిత్తులు — ఇందు అన్న లెవరు? తమ్ము లెవరు? మాలో మేమా? మనలో మనమా? ఇంత సన్నిహితసంబంధ మింతకుముందేమైనది? మీ అహంకారాగ్నిలో దగ్ధమైనదా? ...అగుఁగాక. ఒకయొఱలో రెండుకత్తులిముడవు. అందిన జుట్టు...అందకున్నఁ గాళ్ళు నీచలక్షణము! నల్లనివెల్ల నీళ్ళు తెల్లనివెల్ల పాలని విశ్వసించెడి మా రాక్షసుల నెన్నిసారులు మాయోపాయముచే నాశనముచేసినది. మా గురువులు మాకుఁ జెప్పియేయున్నారు.

[సాభిప్రాయముగ సింహవక్త్రుని జూచును]

విష్ణు:- వదరుబోతా! నీ వ్రాతయెటులుండెనో గాని యెన్ని యోరీతుల నా చేతలఁదెల్ప నీ బుద్ధిని మరల్పవైతివే? నీ మెడపై నెక్కిన మృత్యుదేవత విననీయదులే. బాల్యంబాదిగ మీ వంశవృక్షమును ఛేదించుచున్న యీ విష్ణునిబారికి నిల్పుట నిన్ను సృష్టించినవానికైన వశమా?

గీ॥ త్రిపుర రాక్షస సంహార దీక్షయందు
హరుని శరముగ నేనెగా అరిగినాఁడ
అరుగుటేగాదు దైత్యుల నాగసముఁ
బట్టి గుండెలు చీల్చిన జెట్టి నేన.

తార:- (హేళనగా) ఓహోహో! మా శంకరునకు నీ వొక కొఱనుట్టుగా ఉపయోగపడితివా? మారణాస్త్రముగనుపయోగపడుటకంటె మాయెడ సమ్మోహనాస్త్రముగా నుపయోగ పడుటలో నీకు మఱింత శక్తియున్నదేమో! నీవు జగదేకవీరుడవు గావు. జగన్మోహినీరూపధారివి. నాఁడు రాక్షసులొక పంక్తిగా దేవతలొక పంక్తిగాఁ గూర్చుండ నడుమ అమృతకలశము చంకబెట్టుకొని గజ్జెలందియలు ఘల్లుఘల్లుమని మ్రోగ సురాసురల తలలూఁగ నాగకన్యవలె నాట్యము చేసిన శృంగారరసవాహినివి జగన్మోహినివి నీవేగదా! ఏంత మోసము; ఆ వింత వేసము!

శా॥ నీ ప్రజన్ సుధనీక మాదనుజులన్-నిర్వీర్యులం జేయఁగా
పాపాచారుల నిర్జరాధములఁగాపాడన్ జగన్మోహినీ
రూపంబీవుధరించి మించితివె ఆరూపంబుతో వచ్చి మ
త్కోపంబెల్ల శమింప నాట్యకళ నాకుంజూపుమా మాధవా!

విష్ణు:- నాట్యకళగాదు. జగన్నాటకకళ నేచూపఁగలను. ఆనాట్యకళతోనే మీ భస్మాసురుని భస్మము చేసితిని. అమృతమందకున్నను మీ యహంకృతి యింతవింతగ నున్నదే యందిన నింకెంతగనుండునో. నిన్న గాక మొన్న కన్ను దెఱచిన చిన్నవాడవు. కన్నుబోవునంత కాటుక పెట్టుకొనఁబోకుము.

చ॥ వినయముఁజూపెదేల? కనువిందుగ నీ కదనమ్ము విందుగాఁ
గొనఁ జనుదెంచ నద్ది దృగగోచరమైన నినుంద్యజింతు మే
కనుమిఁక మంత్రిరుద్ధ భుజగంబువలెఁ నినుఁ జేయకుందు మే
దినదినగండ మెట్లుకడతేఱునురా యని యేడ్వకుందువే!

సింహ:- అగ్రజా! యీ పిఱికిపంద యుద్ధకుశలుఁడుఁ కాడే-మఱి దేని యందుఁ గుశలుఁడు?

పద్మా:- కష్టముగలిగినప్పుడు కనఁబడ్డవారి కాళ్ళుపట్టుకొని తప్పించుకొనుటలో అతి కుశలుఁడు. పగతుఱ గుట్టెఱుంగుటలో నిజముగా అనిమిషుఁడు.

సింహ:- పాపము! బెబ్బులులనడుమ జిక్కిన జింకపిల్లవలెనున్నాఁడు. పట్టణము వెలువలికి మెడఁబట్టి నెట్టుదునా?

పద్మా:- వలదు. ఈ స్వర్గరహస్యములు వీనివలనఁ దెలిసికొనవలెను ఇంద్రా! అప్సరసలెక్కడ?

ఇంద్రు:- వారెవ్వరు నాసభకురాలేదు. ఏమైరో వారిసంగతియే నాకుఁ దెలియదు.

పద్మా:- తెలియదా? నిన్నుఁగూడఁ దక్కిన దిక్పాలకులతోఁ బాటు బంధించియుంచినఁగాని తెలియదు.

తార:- ఎవఁడురా అక్కడ?

సేవ:- (ప్రవేశించి) ప్రభూ! ఏమిసెలవు?

పద్మా:- బ్రతికిచెడ్డ-వీనిని బంగారపుసంకెళ్ళచే బంధింపుము.

సేవ:- చిత్తము. [లోనికేగును]

సింహ:- మంచిది. మనయెడ నిది మంచితనమును —— వీనియెడఁ బోయిన రాజ్యగౌరవమును సూచించును.

ఇంద్రు:- ఆహా! నిగ్రహానుగ్రహ సమర్థులు మీరుగాక మఱెవ్వరు?

తార:- ముమ్మాటికి......మూఁడులోకముల. ఇఁక నోరెత్తెదవేని గదతో మొత్తెద.

సేవ:- (ప్రవేశించి బంగారుసంకెళ్ళతో నింద్రుని గట్టివేయుచున్నాఁడు)

ఇంద్రు:- రాక్షసరాజులు మామాటలనుండి విపరీతార్థములు గ్రహించుట మా దురదృష్టము.

పద్మా:- అతిశూర- అగ్నిముఖ- అళివక్త్రి- వజ్రిబాహ్వాది సురారు లారా! మీరు నైమిశారణ్య బదరికావన దండకాటవులంజేరి ఋషులంజేరి యజ్ఞ హావిర్భాగములఁ బద్మాసురునకుఁ, దత్సోదరులకు నర్పింపుఁడని నామాటగా శాసింపుఁడు. కాదన్నవారిని మీ యిచ్చవచ్చినట్లు గావింపుఁడు. పోండు. [తారకుని జూచి] సోదరా!

శా॥ వైకుంఠంబునకేగి పట్టణము విధ్వంసంబుఁ గావించి త
త్తద్వైకుంఠాధిపు భక్తులం దునిమి భాస్వచ్ఛోభతో శ్రీహరిన్
వీఁకన్ద్రాకి కలంచి మించి ఘన దోర్వీర్యంబు చాటింపుమా
నాకుం దమ్ముఁడనంగ నొప్పెదవు సన్మానంబునం దారకా!

తార:- కృతార్థుఁడను. అగ్రజా! నీయాజ్ఞ నాకు నూతనోత్సాహము గలిగించినది. నా గదాఘాతమున లోకములు చీకాకుపడవే. హరి గిరి లెక్కయా? (పైకిఁజూచి) ఓరీ విష్ణూ!

ఉ॥ మగ్గిన తాటిపండ్లవలె మామక వైరుల మస్తకంబులన్
నుగ్గుగ రాల్చువాఁడ హరినోటినిడాయు మృగంబురీతి నా
దగ్గఱ వేఱొకం డనికి ధైర్యముతో నిలువంగ నేర్చు నే
పగ్గెగనంగ వచ్చెదను పాపి! హరీ! ఇఁక నెందుజొచ్చెదో.

సింహ:- అగ్రజా! సృష్ట్యాదినుండి యే మహోత్కృష్ట స్థానమునకై దేవదానవులు బాహాబాహి పెనంగుచుండిరో యట్టి విశిష్టాధి కార శోభితమగు నీ త్రివిష్టపసింహాసన మెక్కసారి మీరధి ష్ఠించి మా కన్నులవండువుసేయఁ బ్రార్థన.

పద్మా:- [చిఱునగవుతో సింహాసన మెక్కును]

తార:- శ్రీ శ్రీ శ్రీ పద్మాసుర సార్వభౌమునకు...... జే
శ్రీ మాయా తనూజాగ్రజునకు...... జే
స్వర్గ సింహాసనాధీశునకు...... జే

[తారకుడు జే యనునప్పుడు పద్మాసురుడు-ఇంద్రుడు తప్ప తక్కినవారందరు 'జే' యనవలెను.]

ముందు జగత్ప్రళయము సంభవించును. కావున, లోకముల మేలెంచి మీమీ యస్త్రముల నుపసంహరించుకొనవలయును తారకా! శివకేశవులకభేదమని యెఱుంగుము.

[శంకరుఁడు నెమ్మదిగ జరిగి విష్ణువునకుఁ జాటుగ నిలువఁబడినంతనే తారకుఁడు తలవంచి నమస్కరించుచుండ విష్ణువదృశ్యుఁడగును. శంకరుఁడు దత్తాత్రేయునివలెఁ ద్రిమూర్త్యాత్మక రూపము ధరించును. కుడిభాగమున విష్ణు వెడమభాగమున బ్రహ్మ మధ్య శంకరుండు ప్రకాశింపవలెను. తారకుఁడాశ్చర్య పడి తలవంచి నిమీలితనేత్రుఁడు కాఁగా క్షణములో విష్ణు శంకరులు వేర్వేరుగా యథాస్థానముల నుండ తారకుఁడు నమస్కరించి నిష్క్రమించుచున్నాడు]

(తెర)



ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

తృతీయాంకము

స్థలము – క్షీరసాగరము

[పాలసముద్రముపై శేషశయ్య మీఁద విష్ణువు యోగనిద్రయందుండ లక్ష్మి తిన్నఁగా కాళ్ళొత్తుచుండును. మెల్లఁగా శేషశయ్య ఒడ్డునకుఁ జేరును. లక్ష్మీ విష్ణువులు దిగుదురు]

విష్ణు:- దేవీ! యోగనిద్రయందున్న నన్ను నీవు మేల్కొల్ప కారణ మరయక కోపదృష్టి ప్రసరించితిని. ఈ పాలసముద్రమున జాలరులరీతిఁ బడి యీదుచు గ్రోలుచు గోలసేయుచున్న వారెవరై యుండనోపు? అనగా! మదాంధులగు దానవాధములు. వర్షాకాలమునందు క్షణములో వెలువడు ఉసుళ్ళవలె బయలుదేరినారు. కదలించి కదనమునకుఁ గాలుద్రవ్వుటయన నిదియే.

వ। కరుణ యొకింత లేక మరకంటకులై చరియించు వీరలన్
పరగున జంపి దివ్యులకు శాంతి సుఖంబొనగూర్పకుందునే?
దురితము సేయుటే పరమ దోహదమంచు తలంచు రాక్షసుల్
హరియన నెట్టివాఁడో తెలియంగలరిప్పుడె చక్రధార చే.

దేవీ! నీ విక లోనికేగుము. (లక్ష్మి నమస్కరించి లోనికేగును) ఓరోరి రక్కసులారా! మీ యంగంబుల పొంగు రంగారంగంబుగ భంగంబొనర్ప కెంగేల చక్రంబుదాల్చి వచ్చుచుంటి. (నిష్క్రమించుచున్నాఁడు)

తెఱలో

తారకాసుర మహారాజా! బలవంతుఁడగు వనమాలి శరజాలంబుచే కాలాంతకునిలీల మనసైన్యంబులఁ గొన్నింటిని గూలనేసినాఁడు. మిగిలినవారు పాలికలనిం దొలంగి నిలువక వలసఁ ద్రోవబట్టినారు. మీ ఆగమనము అవశ్యము అభిలషణీయము. (రక్తసిక్తాంగులై రాక్షసులు పరుగెత్తవలెను)

[తారకుఁడు గదాహస్తుఁడై ప్రవేశించుచున్నాఁడు]

తార:- (లోనికిఁజూచి) ఔరా! ఏమి వీరి మనోదౌర్బల్యము!

ఉ॥ కాకులగుంపులోన నొక గడ్డను ఱివ్వున ఱువ్వినంత, చీ
కాకున లేచిపోవునటు కాల్కొలఁదిం బఱుగెత్తుచుంటిరే
వాఁడొననేమిఁకం బిఱికివానికిఁ జావులు పెక్కుమార్లు — శౌ
ర్యాకరుఁడైన వానికి లయంబొకమారెగదా తలంపఁగా.

డేఁగనుజూచిన పావురములవలె నా సైనికులు ఈ భ్రష్టుఁడగు విష్ణుని బాఱికి నిలుచుటకష్టంబని ఉక్కుదక్కి పిక్కబలము చూపుచుండిరి. నాయకుఁడులేని సైన్యనటన యిట్లుండును గాఁబోలు. ఛీ! అట్లైనన్నఁటికినిగాదు. మానహీనులగు వీరికిఁ దగునుగాని మానవంతుఁలెన్నఁడైనను మర్యాదమాసిపోవుటకిచ్ఛగింతురా? నా శౌర్యవాక్యములచే మరల వీరిని యుద్ధసుముఖులుగ నొనర్చెద. సైనికులారా! నా సమరధర్మోపదేశమొక్కింత ఆలకింపుఁడు. సంగరరంగమును వదలి మీరేల పాఱిపోయెదరు? ఆకసమునుండి భూమిపైఁ బడువడగండ్లవిధమున— సలిలహీనకాసారమధ్యమత్స్యంబులపగిది— మనతెనువులెప్పుడో మాసిపోవును. ఇట్టిదానికై స్వధర్మమును వీడుట పాడిగాదు వైకుంఠవాసకంఠలుంఠనాకుంఠితాయుధహస్తుండనై నేనుండ మీరేల భయపడెదరు? రండు. రాక్షసరాజ్యస్థాపనార్థమై మీరక్తమును ధారవోయుఁడు. దానవవంశమహోన్నత్యైకై మీప్రాణములర్పింపుఁడు. దైత్యకులయశశ్చంద్రికను సర్వదిక్తటముల వ్యాపింపఁజేయుఁడు. అట్లుకానిచో "అంధకారదీపన్యాయముగా" మీ హస్తములందలి యాయుధములు

నిష్ప్రయోజనములు. ఏనాఁడుగాని వైరులకు జంకని స్వవంశమునకు మాయని మచ్చఁ గూర్పఁ దలంచితిరా? నిలుండు... నిలుండు.

ఉ। ఏల రణస్థలిన్ విడిచి యేఁగెదరిట్లు వదుండు గాజులం
దాలిచి చేతులన్ జెలులదాపున ముచ్చట జెప్పుకొందు రే?
కూలిన వీరకు స్వర్గమొనఁగూడును నా అసిధార గుండియల్
చీలిన రెంటికిం జెడిన రేవడులయ్యెదరింకఁ జూడుఁడీ!

అవిగో! సేనలు నిలిచినవి. వారిడాసి వలయురీతి వర్తింపఁ జేసెద.

విష్ణు:- (ప్రవేశించి) ఓరీ నీచులారా!

ఉ। నీతి దొలంగి కాయములు నిత్యములంచుఁ దలంచి వేఁటు చే
కోతుల రీతి గంతులిడుకొంచును చెప్పక పారిపోయి, యీ
రీతి నియంతృవాక్యముల కేఁగిన మీ బలశౌర్యధైర్యముల్
చూతము రండు మిమ్మిపుడ చోద్యముగా జముగీముకంప నే?

తార:- (పద్యము చదువుచుఁ బ్రవేశించుచున్నాఁడు)

శా। ఆలంబందున నాదుసైనికులు నీ యస్త్రాహతిన్ నిల్వలే
కీలం బరువెత్తిపోయిరని యోరీ శౌరి! నిర్భీతితో
మేలంబాడెదె? నల్ల మేకవగు నిన్ మొక్కంగ ఈ సింహమే
కాలాంతంబుగ వచ్చుచుండెఁగనుమా- గర్వోద్ధతిన్ మానుమా!

విష్ణు:- తారకా! నీవు క్రూరుడవని నే నెఱుంగుదు. దైత్యారియనెడి నా సార్థకనామము నీ వెఱుంగుదువా? అవతారంబుల నెత్తినదెల్ల అసురసంహారమునకే యని తెలియదా? అట్టి నాయట్టి జగజెట్టితో సంగ్రామంబున కొడిగట్టి నీ గట్టియసురుల నేల [illegible] [illegible] చెడుబుద్ధిని బెంచి మంచిమార్గమునకు రావించి మేలెంచి సుఖంబనుభవింపుము. నేఁజెప్పిన వాక్కులు నీమనం [illegible] కావేని తిప్పలుపడక మానవు నీ అబ్బ [illegible] నా దెబ్బకు తబ్బిబ్బులైరి. ఏతత్పరాభవంబున [illegible] నెచ్చటినుండి వచ్చితివో యచ్చటికేగుము.

సీ॥ కామైకదృష్టిమైఁ గామురూపిగవచ్చి
వదరగానచ్చర వాడగాదు
అర్థరాత్రిమునందు అగ్నిపాల్ సేత్కై
మెల్లఁగాఁ జన మునిపల్లెగాదు
తప్పఁదాగి యథేళ్ఛ తైతక్కలాడుచుఁ
గేలిసల్పఁగఁ బానశాలగాదు
పొంగి నింగింజేరి దొంగతనమ్ముగా
నార్పివేయంగ హోమాగ్నిగాదు

గీ॥ యుగయుగమ్ములఁ బగతురపొగరడంచి
విజయభేరిని మోగించి వేడ్కమించి
వేయియంచుల రాణించు నాయుధమ్ము
వేచియున్నది యనిఁ దెగవేయ తలువ!

తార:- ఓరీ! నల్లవాఁడా! నీ యెల్లిదపుమాటలిఁక మెల్లఁగ చాలింపుము. త్రుళ్ళిపడినచో మదీయ గదాదండంబుచేఁ ద్రెళ్ళెదవు. వీరాధివీరులను జంపితినని విఱ్ఱవీగుచుంటివా?

సీ॥ ప్రళయకాలమునాఁడు ప్రాణభీతినిజెంది
మామగీమునదాఁగు మగతనంబు
హాలాహలజ్వాల నణఁసఁజాలక మహే
శా! యని పఱతెంచు సాహసంబు
దక్షయజ్ఞధ్వంస దారుణంబున వీర
భద్రునింగని పాఱు బాహుబలము
మును జలంధరుతోడ మోహరంబును మాని
వలసతోగివనుబట్టు వాడితనము

గీ॥ ఎఱుఁగలేమొక్క! నీవేల యెఱుఁగఁజేయుఁ
బూనినాఁడవు విసీ! తల్లి పుట్టినిల్లు
మేనమామకుఁ దెలుపంగఁ బూనినట్లు
చెప్పుకొననేల అయ్యయ్యో! సిగ్గుచేటు.

విష్ణు:- వదరుబోతా! నీ వ్రాతయెటులుండెనో గాని యెన్ని యోరీతుల నా చేతలం దెల్ప నీ బుద్ధిని మరల్పవైతివే? నీ మెడపై నెక్కిన మృత్యుదేవత విననీయదులే. బాల్యంబాదిగ మీ వంశవృక్షమును ఛేదించుచున్న యీ విష్ణుని బారికి నిల్పుట నిన్ను సృష్టించినవానికైన వశమా?

సీ॥ త్రిపుర రాక్షస సంహార దీక్షయందు
హరుని శరముగ నేనెగా అరిగినాఁడ
అరుగుటేగాదు దైత్యుల నాగసముఁ
బట్టి గుండెలు చీల్చిన జెట్టినేన.

తార:- (హేళనగా) ఓహోహో! మా శంకరునకు నీ వొక కోలయముట్లుగా ఉపయోగపడితివా? మారణాస్త్రముగ నుపయోగపడుటకంటె మాయెడ సమ్మోహనాస్త్రముగా నుపయోగ పడుటలో నీకు మఱింత శక్తియున్న దేమో! నీవు జగదేకవీరుడవు గావు. జగన్మోహినీరూపధారివి. నాఁడు రాక్షసులొకపంక్తిగా దేవతలొకపంక్తిగాఁ గూర్చుండ నడుమ అమృతకలశము చంకబెట్టుకొని గజ్జెలందియలు ఘల్లుఘల్లుమనిమ్రోగ సురాసురల తలలూఁగ నాగకన్యవలె నాట్యముచేసిన శృంగారరస వాహినివి జగన్మోహినివి నీవేగదా! ఏంత మోసము; ఆ వింత వేసము!

శా॥ ఏ వ్రజన్ సుధనీక మాదనుజులన్-నిర్వీర్యులం జేయఁగా
వావాదాశల నిర్జరాధములఁగావఁగన్ జగన్మోహినీ
రూపంబీవుధరించి మించితివె ఆయూహంబుతో వచ్చి మ
త్కోపంబెల్ల శమింప నాట్యకళ నాకుంజూపుమా మాధవా!

విష్ణు:- నాట్యకళగాదు. జగన్నాటకకళ నేచూపఁగలను. ఆనాట్యకళతోనే మీ భస్మాసురుని భస్మము చేసితిని. అమృతమందకున్నను మీ యహంకృతి యింతవింతగ నున్నదే. యందిన [illegible]. నిన్నగాక మొన్నకన్ను దెఱచిన చిన్నవా [illegible] నిన్ను నాప్రొవునంత కాటుక పెట్టుకొనఁబోకుము.

ఉ॥ చంపితి సోమకాద్యసురసంఘము భంగమునొంది క్రుంగగా
జంపితి నీదుసైనికుల సంగరరంగమునందునిల్వగ౯
జంపెద నిన్ను నీహితుల శార్ఙ్గ విముక్త శరాళి, దాసుడన్
జంపకు నన్ను నీవనుచు, సాగిలిమొక్కియున్న రాక్షసా!

తార:- కార్యశూరునకు వాగాడంబరముండదు. ఏమంటివి నీకు మ్రొక్కవలయునా?

సీ॥ పట్టి కోరలు తీసిపరగ మచ్చిక చేసి
పవళింప మెత్తని పాముగాదు
చిననాటినుండి సాధనచేసి పైనెక్క .
ఱెక్కలార్చెడిపక్కి ఱేఁడుగాఁడు
అఖిలమ్మునకు నీవ యాధారమని యెంచి
పొగడిపాడంగ తుంబురుఁడు గాఁడు
భోగమ్ముకై హవిర్భాగము లర్పించి
దాసుఁడై వేఁడ ఛాందసుఁడు గాఁడు

గీ॥ సారసంగరసకలాస్త్రశస్త్ర సహిత
భుజబలోపేత మర్దితభూరి వైరి
తారకాసురుడనుమాట తలఁపకలుక
నిట్లు హేళనగాఁబలుకఁ దేలబేల!

నీచే రక్షింపబడుచున్న దేవతలందఱు మాచేశిక్షింపబడుచున్నారు. తెలియునా?

మ॥ ఇఁకనీ మాటలు కట్టిపెట్టుము రణంబెంతేని సాగింపుమా
ప్రకటంబౌను బలాబలంబులు వృథావాగ్వాదమింకేలరా
సకలాశల్ క్షణభంగురంబులయి పో సాష్టాంగదండంబు మా
కొకమారొత్తి క్షమింప వేడినను విష్ణూ నిన్ను మన్నింతునే!

విష్ణు:- (కన్నెఱ్ఱఁజేసి) శ్రుతిమించినది రాగము. త్రుళ్ళినయెద్దు గంతమోయక మానదు.

ఉ॥ కాఱులు ప్రేలెదేల చెడుగా! చెడుకాలము చేరువయ్యె నీ
నేరములన్ని కూడి యిటునెత్తెను మృత్యువునోటఁ బెట్టఁగాఁ

గారణమింత లేక యపకారము చేసెడి క్రూరకర్ములన్
నే రణమందుఁ గూల్చుటది నిక్కము రమ్మిఁక దుష్టదానవా!

[ఇరువురు గదలం ద్రిప్పుచు లోనికేగుదురు]

తెఅలో

విష్ణు— దుష్టదానవ కంఠలుంఠనంబగు మదీయ చక్రమును విడచుచున్నాను. కాచికొమ్ము

[చక్రము విడువ అది మంటలతో గిరగిర తిరుగుచు తారకుని తాకఁబోవును]

విష్ణు:- (ప్రవేశించి ఆశ్చర్యపడి) కలుషాత్ములకంఠములు ఖండించెడి నా చక్రము ఈ తారకునిపై కరిగి వజ్రతుల్యమైనవాని వక్షమున కలంకారప్రాయమైనది.

తార:- (ప్రవేశించుచు)

చ॥ వగవగ నేల? వీరులనివార్య బలోదయ యుద్ధధర్మ తె
ప్పగిదిని అస్త్రహీనుని కృపారహితాత్ములై రణంబులోఁ
దెగ నఱుకంగ నెంతురె? మదిం దలపోసితి నీదు పాటు ఓ
ఖగగమనా! శరంబుగొను కాచితినింకను ధర్మబుద్ధిచే.

విష్ణు:- దైత్యాధమా! నన్ను రక్షించునంతవాడవైతివిగా?

శా॥ చక్రంబీగతి వక్రమైనదని నీచా! నిక్కెదే చూడు భూ
చక్రంబెల్లను దల్లడిల్లనిఁక నస్మత్క్రూర నారాచముల్
మీఁక ప్రవ్యాదులతో నినుం బ్రళయకాళీదేవి కర్పింపనే
యీ కీడ్పాటువ కేను నిన్విడువరా యీర్ష్యాసమ త్తత్పరా!

ఇదిగో! ప్రళయాగ్నికణ సన్నిభంబగు నారాయణాస్త్రము వదలుచున్నాను. (వింట సంధించును)

తార:- ఇదిగో! పాశుపతాస్త్రమును సంధించుచున్నాను.

(ఇరువురు సంధించి విడువ సిద్ధముగా నుండ శంకరుఁడు ప్రవేశించి యిరువుర మధ్యనిలిచి చేతులతో వారింపుచు)

శంక:- లక్ష్మీవల్లభా! శాంతింపుము. తారకా! ఆఁగుము. మీరీ రెండస్త్రముల వదలితిరేని మీ జయాపజయము లట్లుండ

ప్రళయము సంభవించును. కావున, లోకముల
మీా యస్త్రముల నుపసంహరించుకొనవలయును
కేశవులక భేదమని యెఱుంగుము.

ు నెమ్మదిగ జరిగి విష్ణువునకుఁ జాటుగ నిలువఁ
తారకుఁడు తలవంచి నమస్కరించుచుండ విష్ణువద్ర
శంకరుఁడు దత్తాత్రేయునివలెఁ ద్రిమూర్త్యాత్మక
ంచును. కుడిభాగమున విష్ణు వెడమభాగమున
శంకరుండు ప్రకాశింపవలెను. తారకుఁడాశ్చర్య
ు నిమీాలితనేత్రుఁడు కాఁగా క్షణములో విష్ణు
వేర్వేరుగా యథాస్థానముల నుండ తారకుఁడు
ు నిష్క్రమించుచున్నాఁడు]

(తెఱ)



ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

చతుర్థాంకము

ప్రథమరంగము

స్థలము - సత్యలోకము

[సరస్వతీ బ్రహ్మల మందిర సింహద్వారముచుట్టు రత్నములు వెలుగుచుండును. తలుపులు వేసియుండును. నారదుఁడు నృత్యగానలోలుఁడై ప్రవేశించుచుండ ద్వార రక్షకులు నారదునకు నమస్కరించుచున్నారు]

నార:- ఎండలోనడచు బాటసారికిఁ జలి పందిరివలె లోకములోఁ దిరిగి తిరిగివచ్చిన నాకు ఈ బ్రహ్మ మందిరమెంతో హాయి గూర్చినది. ఇది పరమ భక్తులకుఁ గళ్యాణదుర్గము. పరమ హంసలకు అపవర్గము. [చిఱునగవు] ఇది నిర్మలత్వమునకు నిలయము. ఆనందమున కాలవాలము. అరిషడ్వర్గములకు దూరము. అజ్ఞానమునకు భారము. ఆశలేని వారందుకొను చోటు — అహంకారుల కిది తెఱచాటు. సాకారము నిరాకారమున కొకబాట. అందులకే నిత్యము నా పాట.

సీ॥ ఎవ్వానిసంకల్ప మీచరాచర సృష్టి
కాది కారణమౌచు నలరుచుండు
ఎవ్వానివాక్కున నింపుగా సొంపుగా
స్వరయుక్తముగ శ్రుతుల్ వఱలుచుండు

ఎవ్వాని వాహనం బెలమి పాలును నీరు
　　వేరుచేసెడిశక్తి వెలయుచుండు
ఎవ్వాని రాణి జ్ఞానేందిరయై వీణ
　　పలికించి సుఖమెంచి పాడుచుండు
గీ॥ ఎవఁడు వెలుఁగును స్థిరమైన యెఱుకగలుగు
నచల యోగీశ్వరుల సహస్రారమందు
నట్టి పరమాత్మ రూపు నే ననవతరము
గొలుతు మనసారఁ గలుషపుఁ గలఁత దీఱ.

[సింహద్వారముదగ్గఱ మోకాళ్ళపై నిలిచి నమస్కరించుచు]

ఓ కమలాసనా? నీ దివ్యస్వరూపము చూడవచ్చిన యీ బిడ్డనొక్కసారి యనుగ్రహింపుము. (గానము)

[మనుష్యులు కూర్చుండఁదగినంత పెద్దవిగా రెండు తెల్లతామరలు ఎత్తుగా నుండవలయును. వానియాకులు, కాడలు స్పష్టముగాఁ గనఁబడుచుండవలెను. ఆ రెంటినడుమ పెద్ద రాజహంస యుండవలయును. ఆ రెండు పూలపై సరస్వతీ బ్రహ్మలు కూర్చుండవలయును. నారదునిపాట పూర్తికాఁగనే తలుపులు తెఱచినట్లు తెఱ రెండుగా విడిపోవలయును. అప్పుడు సరస్వతీ బ్రహ్మలు ప్రత్యక్షమగుదురు]

బ్రహ్మ:- ఆత్మానంద సిద్ధిరస్తు.

నార:- కన్నులున్న ఫలమిప్పుడు కలిగినది. ఈ అనిర్వాచ్యానందము అనుభవైకవేద్యము ప్రభూ!

సేవ:- (ప్రవేశించి) దేవా! ఇంద్రాదులు మీదర్శనమునకై ద్వారము కడ వేచియున్నారు

బ్రహ్మ:- లోనికిఁ బ్రవేశపెట్టుము.

సేవ:- చిత్తము. (నిష్క్రమించును)

[ఇంద్రుడు బృహస్పతి ఖిన్నవదనులై ప్రవేశించుచున్నారు]

ఇంద్రు:-బృహ:- సరస్వతీ బ్రహ్మలకు నమస్కారము.

బృహ:- ఓ సత్యలోకాధీశ్వరా!

ఉ॥ సృష్టికి ముందొకండవయి సృష్టియొనర్పఁగ మూఁడురూపులై
దృష్టికి నీవ స్త్రీ పురుష దేహములన్ ధరియించి కన్పడన్

గష్టము నీ మహామహిమ కన్గొని చాట హిరణ్యగర్భ! మా
యిష్టములెల్లు తీర్చెదవా. యీ వాకరుండ వెదిక్కు కావుమా!

బ్రహ్మ:- శాంతిరస్తు. (తేఱిపాఱఁజూచి) మంచుచేఁ గాంతికనఁబడని
చుక్కలవలె మీ ముఖములు కళాహీనములైనవేమి?

నార:- ఐనను సూర్యుఁడుదయించినప్పుడు పద్మములవలె మీ దర్శ
నమున శోభ నొందుచున్నవి.

ఇంద్రు:- నారదమహర్షి గూడ సమయమునకుండుట మా భాగ్యము.

బ్రహ్మ:- అష్టదిక్పాలురకు, అమరులకు క్షేమమా?

బృహ:- మా క్షేమమునకు క్షామము కలిగినది. మీచే,శివునిచే వరము
లందిన పద్మాసురాదులు విజృంభించి ముల్లోకముల జయించిరి.
వారిధాటికు ఇంద్రుని వజ్రాయుధము మొక్కవోయినది.
యముని దండము నిస్తేజమై భూమినిద్రవ్వు కఱ్ఱవలెనున్నది.
వరుణుని పాశము గరుడమంత్రముచే కట్టఁబడిన పామైనది.
గదలేని కుబేరునిచేయి కొమ్మలు నఱికిన చెట్టువలె నున్నది.
పడఁగొట్టుదురను భీతిచే దివ్యవిమానములు తిరుగవు. ఆకాశ
గంగలోని తామరలన్నియు వారి దిగుడుబావులలో చేరినవి.
సముద్రుఁడు రత్నరాజముల నేరికోరి కానుకగా సమర్పించు
చున్నాఁడు. జీవమణులుగల వాసుకి మొదలగు సర్పములు
వారి యిండ్లలో నాఱిపోని దీపములుగా నుపయోగపడు
చున్నవి. ఉచ్చైశ్శ్రవము వారివాహనమైనది. కల్పవృక్షము
కత్తిదెబ్బలకు గురియగుచున్నది. చెఱలోనున్న దేవతాస్త్రీలు
పద్మాసురాదులు నిద్రించుచున్నప్పుడు మాత్రమే యేడ్చు
చున్నారు. వారిలో తారకుఁడు లోకనాశనమునకుఁ దోఁక
చుక్కవలెఁ దోఁచినాఁడు ప్రభూ! (విచారముతోఁ దలవంచును)

ఇంద్రు:-పరుండినప్పుడు పాన్పుగా, కూర్చున్నప్పుడు సింహాసనముగా,
నిల్చినప్పుడు గొడుగుగా నే యుజ్జ్వలాంగునకు సహస్రమణి
గణ ఫణాలంకృతుఁడగు శేషుఁడుపయోగపడుచుండునో యా
మహానుభావుఁడగు విష్ణువువిడిచిన చక్రముగూడ వానికి

వక్షస్స్థలాలంకారమైనది. కట్టా! మా యిక్కట్టులింకెట్టులఁ దీఱఁగలవు?

బ్రహ్మ:- నీరు వెనుకకు మరలుటచేఁ బ్రివాహమునకేదియో యడ్డు తగిలెనని యూహింపవచ్చునుగదా! బిడ్డలారా! నన్నిప్పుడు కోరునదేమి?

బృహ:- వారి మరణము.

బ్రహ్మ:-అదినావనిగాదు విసపుచెట్టైనను దానుపెంచి తానేత్రుంచుట మంచిదిగాదు. ఈశ్వరుఁడైనను దనచేతులతో వానిఁజంపఁడు

ఇంద్రుడు:- మహాత్మా! మాకింకేదిదారి? తగినసేనాని లేకపోవుటచే దేవతలకీ గతిపట్టినది. ఆ సృష్టి మీరొనర్చి మమ్ము రక్షింపవలెనని ప్రార్థన.

బ్రహ్మ:- ఆ సృష్టి నావలన జరుగదు. ఈశ్వరాంశసంభూతుఁడు తప్ప అన్యుఁడు వారల జయింపలేఁడు.

నార:- మహాతపోదీక్షలో నున్న మహేశ్వరునకు సంతానమెట్లు కలుగును స్వామీ!

బ్రహ్మ:- నూదంటురాయిచే నినుము నాకర్షించినట్లు పార్వతీదేవి సౌందర్యముచే నీశ్వరుని మనస్సునాకర్షింపవలయును. ఆశివుని కుమారుఁడు సేనానాయకుఁడై రాక్షసులఁజంపి బంధింపఁబడిన దేవతాస్త్రీలను విడిపింపఁగలఁడు. ఆపైని మీకు సర్వము శుభమగును.

బ్రహ్మమందిర సింహద్వారపు తెఱపులు వేయపలెను. నారదాదులు నమస్కరించి ముందుకుఁబోవుచుండ మధ్య మేడతెఱ దింపవలెను.

(నారదుఁడు గానముతో నిష్క్రమింపఁబోవుచుండ నింద్రాదులడ్డుతగులుదురు)

ఇంద్రుడు:-మహాశయా! మీరుకొంచెము సేపుండవలయునని మా ప్రార్థన.

నార:- (తలపంకించి) ఆపదలోనున్న వారిమాట యాలకించుట పరమధర్మమే (జనాంతికముగ) నన్ను సాక్షిగ నుపయోగించుకొనుట కిదియొక యెత్తు.

బృహ:- సుర కార్యసాధమునకు శంకుస్థాపన చేయ వలసినవాడు మన్మథుఁడు.

ఇంద్రు:- ఔను ఆ మనసిజుఁడొక్కసారి యిటకు వచ్చు, గాక.

మన్మ:- (ప్రవేశించియింద్రునిజూచి) జయము జయము సురనాథునకు.

ఇంద్రు:- దిగ్విజయము మన్మథునకు.

బృహ:- స్వాగతము రతీధవునకు. నూఱంచు కత్తులరాణించు జోదుల నొక్కచోఁ గనులపండువుగాఁ గాంచుచున్నారము.

మన్మ:- మునికుల తిలకా! నమస్కారము.

నార:- యశస్సిద్ధిరస్తు.

మన్మ:- (ఇంద్రునిజూచి) అనురాగసూచకమైన మీ యాహ్వానమునకు కారణమరయవచ్చునా?

ఇంద్రు:- (చిఱునగవుతో సాభిప్రాయముగ మన్మథునివంకఁజూచును)

బృహ:- సంకల్పమాత్రమునఁ జనుదెంచిన మీసరసజ్ఞతను గుర్తించి సుర సార్వభౌముఁడు సాదరముగ సహస్ర నేత్రములతోఁ జూచుచున్నాఁడు.

మన్మ:- గమనించుచున్నాఁడను.

నార:- (జనాంతికముగ) అవసరజ్ఞులగు ప్రభువుల కామాత్రము నేర్పు లేనిచో బండి మొండినడుచు. కోటలు బీటలువాఱును.

బృహ:- ఇతరుల నేదైనఁ గోరునప్పుడు వారేమనుకొందురో యని సందేహించుట మృదుల హృదయుల లక్షణము.

మన్మ:- నావంటి యాత్మమిత్రుని విషయమున సందేహమేల గురూ! మహేంద్రా! నీవు కోరుటయు, నీ మన్మథుఁడు కాదనుటయునా? ..... కల్ల.

గీ॥ అలిగి యెవ్వతె నీ ప్రియురాండ్రలోన
నిన్ను వేధించుచున్నదో నిజము చెపుమ!
ఆమె స్వయముగ వచ్చి నీ యడుగులంటి
వేఁడుకొనఁజేయ నిప్పుడె వెడలువాఁడ.
లేక నీస్థానమాక్రమింపఁదలఁచి దైత్య దానవులం దెవ్వఁ

డైనఁ దపోదీక్షలోనున్నాఁడా! వానిపేరు జెప్పుము స్త్రీల బాహు పాశములచే వానిబంధించెద. నాశక్తినను మానించుట నన్ను పరాభవించుట. ప్రభూ! ఎక్కుపెట్టిన బాణముచే ముక్కంటినైన సాధింపఁగలను. తక్కినవారొక లెక్కయా?

బృహ:- ఇది మాకు వాగ్దానము.

మన్మ:- కాదు. ప్రతిజ్ఞ.

నార:- [జనాంతికముగ] మఱసీల బాగుగా బిగియుచున్నది.

ఇంద్రు:- (మన్మథునిభుజముపైఁ జేయివేసి, ఇది నిశ్చయమా?

మన్మ:- ముమ్మాటికి.

నార:- (జనాంతికముగ) పిట్ట వలలోఁ జిక్కినది. ప్రభువులు తమ యధికార సౌధమునకు అన్యుల తను ప్రాణములను మెట్లుగాఁ గట్టుకొందురు.

ఇంద్రు:- మిత్రరత్నమా! ఈశ్వరునిపైనను బాణము విడుతుననుటచే మాపని నీవు పూనుకొన్నట్లే. ఎవరిపైన నా వజ్రాయుధము పనిచేయదో యా తపశ్శాలురపై నీవను నస్త్రము బాగుగాఁ బనిసేయఁగలదు. భూమిని మోయుశక్తిని జూచియే విష్ణువు శేషుని తన శయ్యగాఁజేసికొనె. నీ మహిమ తెలిసికొనియే నిన్నీపనికిఁ బంపుచున్నారము.

నార:- (జనాంతికముగ) మిన్నువిఱిగి మీఁదఁబడినది. (మన్మథుని జూచి) రతీకళత్ర! విషయరహస్యము నేనే యిఁక విప్పిచెప్పెదవిను. దాక్షాయణి యోగాగ్నిలో దగ్ధమైనది మొదలు ఈశ్వరుఁడు నిస్సంకల్పుఁడై మహాతపోనిష్ఠలో నిలిచియున్నాఁడు. దాక్షాయణి పార్వతియను పేర హిమవంతునకుఁ గూతురుగాఁబుట్టి పరమేశ్వరుని పరిణయమాడఁగోరి తండ్రియాజ్ఞచేఁ దఱిమెఱిగి భవుని సేవించుచున్నది. ఆమె సేవాదీక్ష వర్ణనాతీతము.

గీ॥ శివతపోవేది నిత్యమ్ము-చిమ్మిచల్లి
విరులు దర్భలు తోయముల్-వేగఁదెచ్చు
పార్వతీదేవిశ్రమమెల్లఁ బాయుచుండు
శివశిరశ్చంద్రచంద్రికా-శీతలమున

కాని, మహేశ్వరుని మనసించుకయు మాఱలేదు. ఆ మహానీయుని తపస్సు చెడఁగొట్టవలయునని ఇంద్రాదులు నిన్ను గోరుచున్నారు.

మన్మ:- శివతపోభంగము? అబ్బా! ఇది సింహఘుంటాన్యాయము.

నార:- ఏన్యాయమో! లోకమంతయు నన్యాయము. కాలుజాఱినఁ దీసికొనఁగలముగాని నోరుజాఱినఁ దీసికొనలేము.
మీనకేతనా!

గీ॥ నోటిమాటలు నూఱైన నుడువవచ్చుఁ
గార్యసాఫల్యమునఁగాదె కలుగుఘనత?
చెప్పినంతటి సులభంబె చేయుటనిన?
దూఁకుమనువారు తోడుగ దూకఁగలరె?

ఉ॥ ఐనను నాడితప్పరుమహాత్ములు వారలజీవితంబు లే
మైననుగాని లోకమునకంతకు మేలొనగూర్చుటొక్కటే
దానికిఁ గారణంబగును దావకజన్మము సార్థకమ్ముగాఁ
బూనుము దీని;కష్టములు పొందనివాఁడు యశంబు గాంచునే?

మన్మ:- నిజముమునీంద్రా! నిజము కాలమును గమనింపక యే కార్యముసేయరాదు. కానిమ్మని కాలకాలునిపైఁ గవియుందునా? యమ్మహాత్ముఁడు కన్నుతెఱచెనేని మఱుందు నా కార్యము కాగమానదు. ఊరకుందునా? మాటతప్పినవాఁడ నగుదును. ముందుఁజూచిన నుయి. వెనుకకుఁబోయిన గోయి.

నార:- కష్టములు రెండురకములు. విరుద్ధపరిణామముగల యీ రెండును భగవంతుని యాయుధములు. ఒకటి యగ్నిలోఁ బడిన కట్టెవలె దుర్మార్గుఁడు సర్వనాశనమగుటకుపయోగపడును. రెండవది పరీక్షాసూచకమై యగ్నిలోఁబడిన బంగారమువలెఁ గలు

షములడంచి కాంతిపెంచును. ఇది సన్మార్గులయందుపయోగ పడును. కావున, నొకటి విషమయము. రెండవది యమృత మయము.

బృహ:- మదనా! ఒక్కమనవి.

గీ॥ వృత్రసంహార మొనరించువేళ నమరు
లెఱిఁగి యడుగ దధీచి వెన్నెముకనిడఁడె?
శివసుతునిగోరి యీపని సేయుదేని
నీవు కీర్తిగడింతువు నిశ్చయముగ.

మన్మ:- మాటవరుస కనినమాట మీకుఁ బెట్టిదపుఁగోట యైనది.

ఇంద్ర:- రతీకళత్రా! పద్మాసురాదుల చావు శివునికుమారుని చేతిలో నున్నదని బ్రహ్మ చెప్పినాఁడు. ఆపని పార్వతీపరమేశ్వరులకు సంబంధించినదైనను నీ సహాయము గావలయును. నేలయు, విత్తనమున్నను అంకురమునకు నీరు ప్రధానముగదా! కావున,

ఉ॥ ముప్పదిమూఁడుకోట్ల సురముఖ్యులు కోరెడివారు-చూడఁగా
నిప్పని ముజ్జగమ్ములది- హింసయుఁగాదది- పూలువాలుగా
నొప్పిన నీ పరాక్రమ గుణోన్నతి సనుతి నొందుటబ్రమే!
తప్పక యీ జయంబునవ ధన్యుఁడవయ్యెదవీవు మన్మథా!

మన్మ:- (ధైర్యము తెచ్చికొని) అన్నిఁటికి నా భగవంతుఁడే గలఁడు. సురేంద్రా!

మ॥ శరసంధానము చేసి శంకరునిపై సమ్మోహనాద్యస్త్రముల్
పఱపింతున్-ఘనయోగ మెల్లఁద్రుటిలో భగ్నంబు గావింతు అ
గ్గిరిజాతం దలపింతు- మోహజలధిక్రీడార్థి గావింతు- స
చ్చరితుండైన కుమారుజన్మమునకై సాధింతు నెకార్యముల్.

బృహ:- ఇంద్రుడు:- తథాస్తు!

(అనుచుండ మన్మథునిపై దేవతలు పూలుచల్లుచుండ నారదుఁడు పాటపాడుచుండ)

తెర

ద్వితీయరంగము – శివతపోభంగము

స్థలము – దేవలోకము

[జగన్మోహనాకారులగు రతీ–మన్మథులు సమ్మోహనాస్త్రమువంటి కమ్మని గానముతో శృంగార రసద్యోతకమగు నృత్యగానము చేయుచు చెరియొక దెసనుండి ప్రవేశించి కలసి యేకరీతిగాఁ గొంచెము సేపు నృత్యగానములఁ బ్రదర్శించిన పిదప]

మన్మ:– ప్రేయసీ!

సీ॥ సొగసుగాండ్రకు మంచి సుందరాంగులఁ గూర్పఁ
బుణ్యకాలమునకుఁ బొంచిపొంచి
ఎల జవ్వనంబునఁ గులుకు స్త్రీ పురుషుల
మోహసాగరమున ముంచిముంచి
కోమరుఁబ్రాయపువారి కోర్కులు తమి మించఁ
బ్రియ బంధనంబులఁ బెంచిపెంచి
విరహుల హృదయారవిందంబు లరసి నూ
అంచుల బాకుచేఁ జించి చించి
గీ॥ కామినులచూపుతూపులఁ గలఁచికలఁచి
కలికి వలపుల రతనాలు తొలఁచి తొలఁచి
మదను కేళికి మనసుల మలఁచి మలఁచి
ఆట నాడింతు జగ మొకనాటకముగ.

రతి:– (మన్మథుని బుజముపైఁ దలవాల్చి) నిన్నెవ రాడింతురు?

మన్మ:– నీవే. నా సంకల్పమునకు ఫలస్వరూపిణివి నీవే,

గీ॥ నళినదళనేత్రి! నీచూపు–నాకు తూపు
తరుణి! నీమాట–నాకు రత్నాలబాట
కలికి! నీయండ–నాకు బంగారుకొండ
నీవు లేకున్న–నా కళానిరతి సున్న.

రతి:– నీ రతి లేనిచో నీ రసము నీరసమా మనోహరా? (చిరునగవుతో శృంగారరసదృష్టిని బతిపైఁ బ్రసరించి) జగన్మోహనాకారులగుమీారే యీముదానిగొప్పతన మొప్పుకొనుచున్నారే!

మన్మ:-మృదుమధుర హావ భావ భాసురమైన నీ జీవిత మొక రసగంగా ధరము సతీ!

రతి:- (కులుకుచు) నా జీవితముగాదు. నీ జీవితమే మధురాతి మధురము నీ విల్లు మధురరసముల కిల్లు. నీ ముల్కి మధు వాల్కు. నీ నారి మధుపాన విహారి. నీ తేరు మధురఫలము కోరు నీ సేన మధుమాస కళాప్రదర్శనమున నెఱజాణ మధుఁడు నీ మహిత హితుఁడు. నీ మనసు మ ధు ర ము. నీ సంబంధ మేది మధురము గాదు నాథా?

మన్మ:- చాలుచాలు. సరసనాహిత్యమునఁ దోడికోడల మించఁదలం చితివా? ప్రకృతిరహస్య మొక్కసారి పలుకఁ దలంచితి వా?

రతి:- నిజము పలుకఁ దలంచితి. ప్రకృతిలో సహజ సౌందర్యము మగవారిదే పశుపక్ష్యాదులలో సైతము మగజాతిదే. క్రిక్కి రిసినజూలుచే సింహమునకుఁ జక్కఁదన మెక్కువగుచున్నది. దగదగ మెఱయు కోరలచే మగయేనుఁగే సొగసు గుల్కుచు న్నది. అవయవ సౌందర్యమున నావుకన్న నాఁబోతు మిన్న. పోతునెమిలికి మాత్రమే పింఛము విప్పి నాట్యమాడు భాగ్య మున్నది. పుంజు రాచఠీవితో ముందంజ వేయుచున్నది. ఇందేదికాదనదవు నాథా! (చిఱునవ్వు) ఐనను మీరనినట్లు స్త్రీ జీవితము రసగంగాధరము. కనుకనే శివుఁడు గంగాధరు డయ్యెను.

మన్మ:-[ఏదిమోజ్ఞ ప్తికివచ్చినట్లు]గంగాధరుఁడు. శృంగారరసము... ప్రేయసీ! నా శరశరాశన తూణతనుత్రాణాదులందీయుము.

రతి:- (తెచ్చి వింటి నెడమబుజమునకుఁదొడిగి యమ్ములపొది కుడి వీపునకుఁగట్టి పుష్పబాణములు చేతికిచ్చి) ఏదీ ఒక్కసారి యిటుచూడుము ఇప్పుడు జగదేకవీరుని వలె నున్నావు. నీ దివ్యసుందరవిగ్రహము చూడఁగ నా రెండుకన్నులు చాలవు. నిన్ను —

వెల్లగింపనలయునా? ఇప్పటికే పతినివిడిచి రతి క్షణకాల ముండఁగలిగెనను నింద నొందితి ఇత్తఱి నాకుఁ జితిపేర్చు వారెవ్వరు? ఓ వసంతుఁడా! నీకైన నాగోడు వినిపింపలేదా? లేక, నీ చెలికానితోఁ బాటు నీవుగూడ బూడిదవైతివా? కాకున్న నేల కాన్పింపవు? కష్టములో ఆదరింపని బంధుత్వము స్నేహము నిజమైనదగునే?

వసం:-(ప్రవేశించి) అమ్మా! నీవలె నేనును నిష్ప్రయోజకుఁడనైతి. నామిత్రుని చరిత్రమాత్రము పవిత్రమైనది. దేవకార్యమునఁ గాలు కర్పూరము దివ్యసాంగళ సూచకముగదా!

రతి:- వసంతుఁడా! నా కళాజ్యోతి యారిపోయినది. నా విలాసగతి మాఱిపోయినది. మా యీ యవస్థనుజూచుట కిప్పుడు కన్నులు దెఱచితివా? నీ చెలికాఁడు-పూవిలుకాఁడు నాకొక కాలికిఁ బారాణి పెట్టి దేవతలు పిలిచిరని యిటువచ్చినాఁడు. అది పూర్తి చేయుటకు నాదగ్గఱకు రప్పింపుము. కాదేని నా ప్రియునికడకు నన్ను గొనిపొమ్ము. చంద్రునితో వెన్నెలయు, మేఘముతో మెఱుపును అస్తమించునట్టుల పతిదేవతలు భర్తతో నస్తమింతురు. మాకు నీవు పలుమార్లు పూసెజ్జల నమర్చియుంటివి. ఇప్పుడు చితిపేర్చి యగ్గిముట్టింపుము. పిదప మా యిరువుర కొకేజలాంజలినిచ్చి కడసారి బంధుకృత్యము నెరవేర్పుము.

వసం:-పూలుచల్లిన చేతులతో నిప్పులుచల్లవలెనా తల్లీ!

రతి:- అది నీ దోసముకాదు. ప్రకృతిలో నిదియొక విచిత్రధర్మము. వేనిఁక నిముసమైన నిలువఁజాల.

వసం:- సాధ్వీమణీ! పరుగెత్తిన ప్రొద్దుగ్రుంకునా! ఎండకాలమున నీరింకుటకుఁ దల్లడిల్లిన మత్స్యాంగన తొలకరివానలచేఁ గులుకకుండునా? తల్లీ! ఊరడిల్లుము!

రతి:- రాజేశిక్షించిన రక్షించువారెవ్వరు? నాయేడుగడ నేకడ తేర్చిన నాకేడ మనుగడ? నీవాలసించుట యుపకారముసేయుట.

[పతిపైఁబడి దుఃఖించుచుండును]

నంబై యలరారుచున్నదో యెఱిఁగింపుఁడు.

మన్మ:- ఇప్పుడు పావకాశముగఁ బరికించుటకు వ్యవధి లేదు. కాని, సమీపభూముల విశేషములఁ దెల్పెద. మెల్లఁగా నడువుము. (నడచి) కలికీ!

ఉ॥ మున్ను భగీరథుండు తనపూర్వులకై తపియించి గంగ నీ
యున్నత శృంగరాజముల నుండియు భూమికిఁ దెచ్చినాఁడు-వి
ద్వన్నుతయైన శాంకరిని భార్యగఁ గోరు జలంధరాసురున్
గ్రిన్నన శంకరుండు తెగఁగాల్చెనిటన్ సెగకంటి మంటతో.

(నడచి) ఇది అఖాతము-అది జలపాతము. ఇవి గండశిలలు-అవి కొండతిలలు. ఇది మానసమునకు బాట - అది సెలయేటియాట. అది రత్నపు మొలక - ఇది నెలరాలపలక, అవి వియచ్చరల యానములు. ఇవి యచ్చరల గానములు. అవి సానువులు- ఇవి వేణువులు. ఆ పెలుకుల కొలంకులు___ ఈ దెస కుసుంభ కుసుమవిసరములు.

రతి:- వికారాకారములుగల ఆ విలుకాం(డెవరో గుర్తింపఁగలరా?

మన్మ:- వారే కిరాతులు. వారి నెత్తివి పికిలిపిట్టల యీఁకలు. మెడలోనివి వాలపూసలు. కట్టుకున్నవి పారుటాకులు. గుత్తులుగుత్తులుగా పడియున్న ముత్తెముల వగుసలుగని మత్తగజముల మస్తకముల భేదించిన సింహములజాడ తెలిసికొని వారు వేటాడుచుందురు.

రతి:- (వినుట నభినయించి) ఏదియో గంభీరశబ్దము వినవచ్చుచున్నది.

మన్మ:- గంగానదీఘోషము ఇటుచిమ్ము (నదిని సమీపింతురు)

రతి:- పరమపావనీ! గంగాభవానీ!

గీ॥ తల్లివోలెను జీవనాధారవగుచు
సకలజీవుల రక్షింపఁ జాలి గావు
దేవకార్యార్థు నాదేవు గావుమీవు
దేవదేవ జటాసంగ! దివిజగంగ!

ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

పంచమాంకము

ప్రథమరంగము

స్థలము - పద్మాసురుని భవనము (పానశాల)

[వేశ్యలు నృత్యముచేయుచు నెడనెడఁ బద్మాసురుని పానపాత్రిలో మద్యము పోయుచు నతనికి సంతోషము కలిగించుచుందురు. పద్మాసురుఁడు మద్యపానము సేయుచు వేశ్యలతోఁబాటు సంతోషము వెలిబుచ్చుచు, వేశ్యలవంకఁ దీవ్రదృష్టితోఁజూచి వారిని బొమ్మని సైఁగచేయ భయముతో నిష్క్రమింతురు]

పద్మా:-ఛీ!...మద్యము. ఇది యేమిమధువు? సారహీనము. నిస్సారము. ఆఁ! మఱచితి. అమృతము సంగతి మఱచితి. ముల్లోకములను జయించితి ముగ్గురుమూర్తులను మూలలకొదిగించితి. ఇంద్రాద్యఖిలసురలఁ సేవకులఁ గావించితి. వైరి స్త్రీలను బంధించితి. సార్వభౌమత్వమును స్థాపించితి...కాని, యమృతము చిక్కలేదే! అందువలన నా కివియన్నియు నిష్ప్రయోజనము లే యని తోఁచుచున్నది. కుచ్చితులగు దేవత లమృతము నెచ్చట దాచిరో ఆఁ! అచ్చరలు...రంభ తప్పించుకొని పోయినది. మేనక కానరాలేదు. ఉన్నఊర్వశి తిన్నగఁగన్ను మొఱఁగినది.

[వినుట నటించి]

[తెఱలో - చెంచుపాట]

ఏలుకో లోకాలు - నాసామీ

ఎవరడ్డు నీకింక - నాసామీ

అదిగో! దక్షిణామూర్తి యనుపేర సనకాది ఋషులకు జ్ఞానోపదేశము చేసిన సర్వేశ్వరుని వాసప్రదేశము. దానినే స్థాణ్వాశ్రమమందురు. హరు నెఱుకలేక ఆకల్లాడదు. ఎల్లో నందీశ్వరుని గనుబ్రామి శీఘ్రమ శివతపోభంగ మొనర్పవల యు... రమ్ము.

రతి:- (నివ్వెఱపడి) ఇందులకా నీ విటకు వచ్చినది? సమాధి నిష్ఠాగరిష్ఠుఁడైన హరునిపై నా శరములు విడుచుట? ఇదియా దేవతల ప్రార్థన? వలదు నాథా! వలదు.

మన్మ:- నీ నా మాట యనలేదు. నే వినలేదు. తిరిగి చనఁదగదు. ఫలము గలదు.

గీ॥ అరయు మింతేల-సమ్మోహనాస్త్రలీల
బెదరెదవు చాల-ఇత్తరి భీతి యేల?
పొల్లుపోవదు సుమ్ము-నా పూవుటమ్ము
మాట యిచ్చితి బాల-నే మరలఁజాల.

ముప్పదిమూఁడుకోట్ల దేవతల కధిపతియైన మహేంద్రున కిచ్చినమాట తప్పినచో నా తలిదండ్రులగు లక్ష్మీనారాయణుల కీర్తికిఁ గళంకము తెచ్చినవాఁడ నగుదును.

రతి:- ఔను. కాని, ప్రణవనాదమునకుఁ బ్రణయ వినోదమునకు సుదూరము నాథా! విషయము విషమించె నేని విషమనేత్రుఁడు విషకంఠుఁడుసుమా! నా కుడికన్నదురుచున్నది. ఇది నిప్పుతోఁ జెఱలాట. కాదు. అంతియ కాదు. అగ్నిపర్వతమును భేదించుట వలదు... బలముచాలదు. మరలిపోదము రమ్ము ... రావా? .. రావేని నీవు బాణములు తొడుగుల... నేను ప్రాణములు విడుచుట.

మన్మ:- నేనీ పనికిఁ దలఁగిన దేవతలకష్టములు తొలఁగవు. నీకుఁ దెలియదు. పిఱికిమందు పోయకుము. పరోపకారదీక్షలో ప్రాణత్యాగమునకైనను వెనుకంజ వేయను.

రతి:- నామాట వినవా పతీ!

మన్మ:-వినను రతీ!

రతి:- సందిగ్ధస్థితి. ఆహా ఏమి నీ ధృతి. ఇంకేది గతి? నాఅంతరాత్మ ఆకాశవాణివలె నేదియో యశుభమునే సూచించుచున్నది. అడుగావలఁ బెట్టనీయను. (పాదములంటి) నా మంగళసూత్రి మేలకో గజగజ వణఁకుచున్నది. నీ పాదములంటి బ్రతిమాలుచుంటి. వినవా? జీవితేశ్వరా! (మన్మథుఁడు లేవనెత్తు)

ఉ॥ ఎన్నఁడు వేఁడలేదురతి యేటికి నేఁటికిఁ గాళ్ళవ్రేళ్ళపైఁ
దిన్నఁగవ్రాలి జాలిమెయి దేవరప్రార్థన సేయుచున్నదో
యెన్నఁగ లేవ? ఏటికెదురీదుట మేలొకో! అఁడుదాని మా
టన్నను లెక్కసేయవు కదా! మితిమించిన ధర్మమొప్పునా?
(కన్నీరువిడచును)

మన్మ:-అత్యవసర సమయమునఁ దెలివిగల స్త్రీ యుపయోగించు నాయుధము కన్నీరు. దేవీ! ఏల నాశక్తినింకను శంకించెదవు?

గీ॥ చూపు తూపుర యేపున కోపఁగలదె
దేవ దానవ మానవ భావజగతి
నిశ్చల సమాధి నిష్ఠలో నిలువకిపుడ
భంగపడి యీశ్వరుఁడు నాకు లొంగిపోఁడె?

రతి:- ఆర్యపుత్రా! ఏమి నీధైర్యము!

గీ॥ అలరుటమ్మెడ-శూలి నేత్రాగ్ని యెడ
రెండు ఢీకొన మన జయముండుటెట్లు?
అన్ని యశుభములని యాడ-నిన్ను వేడ
వలచివచ్చితి నీతోడ-వలపుతేఁడ!

మన్మ:-దేవీ! ఇఁక నీ మాటలు నా చెవిం జొరవు.

రతి:- (ఆలోచన నటించి) కానున్నది కాకమానదు. ఓ దేవతలారా! మీరందఱు నా పతికి శుభాశీస్సులు పంపుఁడు.

మన్మ:-ఇటురమ్ము [నడతురు. మధ్య తెఱతొలఁగ నించుకమూలగ కొంచెము దూరమునఁ దపోనిష్ఠ యందున్న శంకరుఁడు కనఁబడుచున్నాఁడు]

మన్మ:- దేవీ! నీవిఁక నొక్కయడుగు పక్కకుఁ దొలఁగుము.

[రతి ప్రక్కకుఁ దొలఁగి చాటుననుండును]

మన్మ:- ఈప్రదేశమంతయు నందీశ్వరుని యాజ్ఞచే నెంతప్రశాంతముగ నున్నది! చెట్లు కదలవు. తుమ్మెదలు రొదసేయవు. జంతువులు సంచరింపవు ఈవనము పటమున వ్రాయఁబడిన బొమ్మవలె నిశ్చలముగా నున్నది. (శంకరునిజూచి) ఆహా! పరమేశ్వరుని దర్శనమ్మునఁ బావనుఁడనైతి. ఔరా! ఏమి యీ మహానుభావుని తేజము! దేవదారు వృక్షముక్రింద పులితోలు పఱచుకొని కుడిప్రక్క త్రిశూలము నాటి దానికి డమరుకము కట్టి వీరాసనము వేసికొని పాముతో నెత్తికట్టఁబడిన జడలతోడను, జడలలోనుండి వెలువడు గంగతోడను, గంగనురుగోయనఁ దోఁచు బాలచంద్రునితోడను, చెవికిందగిలించిన జపమాలతోడను, కనురెప్పలించుకఁ దెఱచి నాసాగ్రమున లక్ష్యముంచి గాలిలేని తావున వెలుఁగుచున్న దీపమువోలెఁ బ్రకాశించుచున్న హరునిఁజూచితి. ధన్యుఁడనైతి. (సరిగఁబరికించి) బ్రహ్మరంధ్రమునుండి లేచిన తపోగ్నికి బాలచంద్రుఁడు వాడిపోవుచున్నాఁడు పరమశివుని పరివేషము వలదని నన్ను వారించుచున్నది. చూడఁజూడ నా గుండె జారుచున్నది. చేయి వణఁకుచున్నది. బాణము లెట్లు వేయఁగలను?...... ఇది శివతపోభంగమా? రణరంగమా? (మరలఁజూచి) యోగమును జాలించి కనులించుకఁ దెఱచినట్లున్నది నంది నమస్కరించి యేదియో చెప్ప శివుఁడు కనుసైగతో నంగీకరించుచున్నాఁడు. (దిగులుపడి తలవంచుచు) కట్టా! ఏమినాకష్టము! (తిన్నఁగాఁ దలయెత్తిచూచి) ఆహా! ఏమి నా అదృష్టము! (పార్వతి పుష్పాదులు తెచ్చి నమస్కరించి శివునిదగ్గఱ పెట్టఁబోవుచుండును) పార్వతీదేవి శివపూజార్థము పుష్పఫలాదులు తెచ్చినది. ఆ తల్లి సదుముతో నాధనుస్సు వంగుఁగాక! ఆమె చూపుతో నా తూపు ప్రసరించుఁగాక! అర్థ నిమీలిత

నేత్రిఁజై యాత్మ సాక్షాత్కారమున కుద్యమించుచున్నాఁడా? ఏమైన నగుఁగాక! ఇదియే సమయము (సమ్మోహనాస్త్రము విడచును) ఆఁ! కనులు దెఱచి పార్వతివంకఁ బ్రేమతోఁ జూచుచున్నాఁడు. ఆమెయు సిగ్గుతో మోమును బ్రక్కకుఁ ద్రిప్పుకొనుచున్నది. ఎదురెదురుగానున్న సింహ వృషభముల ముఖములు వికసించినవి. ప్రకృతిచేఁ బరమాత్మ యాకర్షింపఁ బడుచున్నాఁడు. (పార్వతి యొక్కొక్క వస్తువు శివుని పళ్ళెరమునఁ బెట్టుచుండును) నాసమ్మోహనాస్త్రము వృథయగునా? మఱియొక బాణము విడచెద. (ప్రత్యాలీఢపాదముతో విడువ సిద్ధముగనుండును)

శంకర:- విద్యుత్ప్రవాహమువలె నవ్యక్తమధురానురాగ రసవాహిని నా దేహమున జనించి పార్వతీ ప్రణయపయోధివైపు ప్రవహించుచున్నది. నా తపోభంగము కావించిన దురాత్ముఁ డెవఁడురా? అస్మదీయ ఫాలనేత్రాగ్ని జ్వాలాప్రసరణంబున వాఁడు భస్మమగుఁగాక? (ఫాలనేత్రము విప్పును. పార్వతి భయమున నిష్క్రమించును)

ఆకాశమున దేవతలు:- దేవా! మహాదేవా! జయశీలా! కరుణాలవాలా! దేవతల మేలుగోరి శాంతింపుము. అనుగ్రహింపుము.

మన్మ:- (జ్వాలపడుచుండ భయముతో) హతోస్మి...హతోస్మి.

[నేలపైఁబడ జ్వాల చుట్టుముట్టును. శంకరుఁ డదృశ్యుఁడగును. అనఁగా మధ్య తెఱ వేయవలెను]

రతి:- (ఆతురతతో) హా నాథా! (మూర్ఛపడి కొంతసేపటికి లేచి) హా జీవితేశ్వరా! నన్నొడనాడి పోవుచుంటివా! ఇఁక నాకుదిక్కెవరు! నీవులేనిచో నాకీ దేహమేల? విరాగియైన భోగివలయుని పరాగుంకేయ వలదాగు మాగుమని యెంత నేఁగొట్టు కొన్నను త్యాగంబునఁ బూఁగోలనేసి యుసురులం బాసితే? ఓ దివిజాధిపులారా! నాపతిని రక్షింపలేమి? కొఱవితోఁ దలఁగోకి కొనుమని పంపినది మీరేగదా! ఓ పరమేశ్వరా!

ఆ॥వె॥ పూలవేయు నిన్ను బూజించుటేగదా
కోపపడిన భర్త లోపఁగలరె?
లోకరక్షకుఁడని లోఁ దలంచెనుగాని
హింస చేసెదవని యెఱుఁగఁడకట!

(చంద్రునుద్దేశించి) తండ్రీ చంద్రా! నీ వావిషకంఠుని సహవాసము చేసిన దానిఫలము చూపితివే. పెఱవారినైన నిష్కారణముగఁజంపుచుండఁ జూడ మనసొప్పదే! నీ వొక్కింత యమృతము చిలికి సజీవుం జేయవేమి? ఇట్టి కఠినాత్మునంత వగుటఁజేసియే విరహిణీజన సంతాపకరుఁడవై వారిచేఁ దిట్లు తిని పదియాఱు వ్రక్కలగుచు సిగ్గులేక కళకళ లాడుచుంటివి. ఛీ! నిన్నుఁ గేఁదలఁపరాదు. ఐనవారి నాశ్రయించుటకన్నఁ, బడినచోట దేవులాటమేలు. (గంగనుద్దేశించి) నిర్మల జల తరంగా! గంగా!

గీ॥ ఉంచుకొన్నవాఁడు తలకెక్కించుకొన్న
వాఁడు నాకేమి యని గర్వపడెదవీవు
పతికిఁ గష్టముగల్గుచో సతి కృశింపు
తెఱవ! తెలియునె నీయట్టి తిరిమ్మరులకు.

(మగని శరీరముఁజూచుచు) పడినరీతిగా శరీరమంతయు బూడిదయై పావురమువలె- ఇంద్రధనుస్సువలె- పలురంగులు కలిగియున్నది. ఓ గిరిజామనోహరా! నన్నుఁజూచి లతా లలితాంగులు సైతము అంగలార్చుచు పూఁదేనె నెపంబునఁ గన్నీరు కార్చుచున్నవే. నీ యెద కరఁగదా?

ఉ॥ పెద్దవు గొంతుకన విసపువ్రేగున మాటలనాడెదీవు నీ
సుద్దిని విశ్వసింపఁదగుచో నిటుసేయుదె? పంశవృద్ధికై
తద్దయుఁజూచు నా మగని తామసివై మసిచేసితిట్లు నీ
కిద్ది శుభంబె? నిక్కముగ నేరికి మేలొనరింప కీడగున్.

ఇఁక నాకేదారిఁ జూపెదవు? అయ్యో! ఆసంగతి నిన్న డుగనేల? చెట్టునుబెల్లగించిన దాని చుట్టుకొన్న దీఁగను వేఱ

పెల్లగింపవలయునా? ఇప్పటికే పతినివిడిచి రతి క్షణకాల ముండఁగలిగెనను నింద నొందితి ఇత్తఱి నాకుఁ జితి పేర్చువారెవ్వరు? ఓ వసంతుఁడా! నీకైన నాగోడు వినిపింపలేదా? లేక, నీ చెలికానితోఁబాటు నీవుగూడ బూడిదవైతివా? కాకున్న నేల కాన్పింపవు? కష్టములో ఆదరింపని బంధుత్వము స్నేహము నిజమైనదగునే?

వసం:-(ప్రవేశించి) అమ్మా! నీవలె నేనును నిష్ప్రయోజకుఁడనైతి. నామిత్రుని చరిత్రమాత్రము పవిత్రమైనది. దేవకార్యమునఁగాలు కర్పూరము దివ్యమంగళ సూచకముగదా!

రతి:- వసంతుఁడా! నా కళాజ్యోతి యారిపోయినది. నా విలాసగతి మాఱిపోయినది. మా యీ యవస్థనుజూచుట కిప్పుడు కన్నులు దెఱచితివా? నీ చెలికాఁడు-పూవిలుకాఁడు నాకొక కాలికిఁ బారాణివెట్టి దేవతలు పిలిచిరని యిటువచ్చినాఁడు. అది పూర్తిచేయుటకు నాదగ్గఱకు రప్పింపుము. కాదేని నా ప్రియునికడకు నన్ను గొనిపొమ్ము. చంద్రునితో వెన్నెలయు, మేఘముతో మెఱుపును అస్తమించునటుల పతిదేవతలు భర్తతో నస్తమింతురు. మాకు నీవు పలుమార్లు పూసెజ్జల నమర్చియుంటివి. ఇప్పుడు చితిపేర్చి యగ్నిముట్టింపుము. పిదప మా యిరువుర కొకేజలాంజలినిచ్చి కడసారి బంధుకృత్యమూనెర వేర్పుము.

వసం:-పూలుచల్లిన చేతులతో నిప్పులుచల్లవలెనా తల్లీ!

రతి:- అది నీ దోసముకాదు. ప్రకృతిలో నిదియొక విచిత్రధర్మము. వేఱొక నిముసమైన నిలువఁజాల.

వసం:- సాధ్వీమణీ! పరుగెత్తిన ప్రొద్దుగ్రుంకునా! ఎండకాలమున నీరింకుటకుఁ దల్లడిల్లిన మత్స్యాంగన తొలకరివానలచేఁ గులుకకుండునా? తల్లీ! ఊరడిల్లుము!

రతి:- రాజేశిక్షించిన రక్షించువారెవ్వరు? నాయెడుగడనేకడ తేర్చిన నాకేడ మనుగడ? నీవాలసించుట యుపకారముసేయుట.

[పతిపై:బడి దుఃఖించుచుండును]

వసం:- అమ్మా! నీయాజ్ఞ శిరసా వహించుచున్నాఁడ.

[లోనికేగి చితిపేర్చి మండించును]

ఆకాశమున : దేవతలు

దేవదేవా! శివా! నీ నేత్రాగ్నికిఁ బార్వతీదేవిసైతము భయపడి తన్ను పరాభవించినట్లు భావించి తల్లి చెంత కరుగుచున్నది. ప్రభూ! విజృంభించిన విద్యుత్తు నెవరుచూడఁగలరు?

ఉ॥ ఈవు దలంచుకొన్న జగమెల్ల నిప్పగున్ నీరగున్ శివా!
కావుము మన్మథున్ రతిని కారణ జన్ములు వీరు లేనిచో
జీవులు నిస్సమున్నలగు సృష్టి నశించును లోకనాథా! నీ
సేవలుసేయు దేవతల చింతలు బాపవా దారిఁజూపవా!

రతి:- (నలుదెసలు పరికించి నిరాశతో) దేవతల ప్రార్థనఁగూడ వృథయైనది. ఇఁక నారోదన మరణ్యారోదనమే. ఓ మృత్యుంజయా! నా ప్రియునిఁ గాల్చిన యగ్నిని చల్లార్చినది నీవ. అంతకంటె వేయిరెట్లు రగులుచున్న నా హృదయాగ్నిని చల్లార్పలేవా? లేనిచో నాయగ్నితో నన్నుఁగూడ దహింపరావా? అర్థాంగిని విడుచుటచే నీపని సగమే పూర్తియైనదని యెఱుఁగవా? మేములేనిచో అందము - ఆనందము మందుకైన దొఱకునా? సృష్టి జరుగునా? కళలు వెలుఁగునా? లోకమంధకారబంధురమైపోదా? పతివ్రత భర్తనుచేర లేదా? చూడుము.

[ఢమరుకఁబోవ నెదురుగ శంకరుఁడు ప్రవేశించుచున్నాఁడు.
రతి మోకాళ్ళపై నిలఁబడి శంకరునకు నమస్కరించును]

శంక:- రతీ! నీ పతిభక్తికి మెచ్చితి. నీవంటి సాధ్వీమతల్లులు లేనియెడల ప్రపంచము జరుగనేరదు. ఇప్పటినుండి నీ భర్త నీకు మాత్రము కనఁబడుచు సర్వ సౌఖ్యముల చేకూర్పఁగలఁడు. ఇతరులకుఁ గనఁబడఁడు. దీన నీకు మేలగు.

రతి:- ధన్యురాలను.

తెర

ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

పంచమాంకము

ప్రథమరంగము

స్థలము - పద్మాసురుని భవనము (పానశాల)

[వేశ్యలు నృత్యము చేయుచు సెదనెకఁ బద్మాసురుని పానపాత్రలో మద్యము పోయుచు నతనికి సంతోషము కలిగించుచుందురు. పద్మాసురుఁడు మద్యపానము చేయుచు వేశ్యలతోఁబాటు సంతోషము వెలిబుచ్చుచు, వేశ్యలవంకఁ దీవ్రదృష్టితోఁజూచి వారిని పొమ్మని సైఁగ చేయ భయముతో నిష్క్రమింతురు]

పద్మా:- ఛీ!...మద్యము. ఇది యేమి మధువు? సారహీనము. నిస్సారము. ఆఁ! మఱచితి. అమృతము సంగతి మఱచితి. ముల్లోకములను జయించితి ముగ్గురుమూర్తులను మూలలకొదిగించితి. ఇంద్రాద్యఖిలసురలఁ సేవకులఁ గావించితి. వైరి స్త్రీలను బంధించితి. సార్వభౌమత్వమును స్థాపించితి...కాని, యమృతము చిక్కలేదే! అందువలన నా కివియన్నియు నిష్ప్రయోజనము లే యని తోఁచుచున్నది. కుచ్చితులగు దేవత లమృతము నెచ్చటో దాచిరో ఆఁ! అచ్చరలు...రంభ తప్పించుకొని పోయినది. మేనక కానరాలేదు. ఉన్న ఊర్వశి తిన్నగఁగన్ను మొఱఁగినది.

[విసుగు నటించి]

[తెఱలో - చెంచుపాట]

ఏలుకో లోకాలు - నాసామీ
ఎవరున్నా నీకిఁక - నాసామీ

నీ కీర్తిచంద్రికలు - నాసామీ
నిఖిలదిక్కులనిండె - నాసామీ
చెంచుగూడెములెల్ల - పంచినా పనిసేయు
పెంచిమీసముదువ్వ - నాసామీ
కంచుకోటలుకట్టు నాసామీ॥ ఏ॥

వ॥ దొడ్డదొరగారు మా రాజుగారు సెలవిస్తే లోపలికివస్తాముదొరా
[పద్మాసురుఁడు సైగసేయ సేవకుఁడు చెంచులవారిని "రండు" అని పిలుచును]
వాతాపి-ఇల్వలుఁడు (చెంచు వేసములతో ప్రవేశించుచు) మా దొడ్డ
సంస్థానం... పెద్దదొరగారి మొగానేవుంది రావుకళ-
ఏలుకో లోకాలు - నాసామీ
ఎవరడ్డు నీకింక - నాసామీ
నీయండ చేతనే - దండిదైత్యులపిండు
చండప్రచండులై - నాసామీ
కొండపిండిగ సేయు నాసామీ॥ ఏ॥

సేవ:- ఒరే! చెంచులూ! రాజుగారికి కొంచెము శృంగార రసము.
వాతా:-చిత్తముదొరా చిత్తము.

పాట

పద్మాసురునిజూడు- చెంచీతా
బహు సుందరాంగుడే- చెంచీతా
చుక్కల్లోచంద్రుఁడే- చెంచీతా
చూడ చక్కనివాఁడె- చెంచీతా
చక్కనీ చుక్కవే- చెంచీతా
సరసమ్ములాడవే- చెంచీతా
గుట్టెక్కియాడవే- చెంచీతా
చెట్టెక్కిపాడవే- చెంచీతా
గండుకోయిలతోడ- కలిసి కూశావంటె
నీదె పై చేయౌను చెంచీతా-
నిన్నె కొనియాడుదుము చెంచీతా॥ ప॥

పుట్టపొంతననీవు- చెంచీతా
పొంచి నిలుచుండవే- చెంచీతా
చెట్టుచాటుననీవు- చెంచీతా
చేరి మాటాడవే- చెంచీతా
అలినీలవేణివి- జలజాతపాణివి
అందాల రాణివే- చెంచీతా-
సందేహమేలనే- చెంచీతా॥ ప॥
ఏకాంతమధుసేవ- చెంచీతా
ఎంతయానందమే- చెంచీతా॥ ప॥

పద్మా:-ఏదేశమురా మీది?

వాతా:-ఓ మాది వటద్వీపములే సామీ దేవతలకు రాక్షసులకు జరిగిన యుద్ధాల్లో మేము రాక్షసులవైపునిలిచి యుద్ధము చేశాం. అందువలన దేవతలు గుర్తుపట్టకొండా వుండడానికి ఈవేషాలతో తిరుగుతున్నాము దొరా.

పద్మా:-(ఆలోచన నటించి) ఏమది! ఈకంఠధ్వని మున్నపరిచయము గలదిగా తోచుచున్నది. నన్ను మోసముచేయుటకు వచ్చినవారు కారుగదా (ఆలోచించుచు సేవకునికిసైగచేయు సేవకుడును తానును వాతాపియిల్వలులకు రెండువైపుల దగ్గఅగా కత్తులుపట్టియుంచి) నిజముచెప్పవలెను.

వాతా:-రాతికి చక్కలిగిలేమంది దొరా. ఓ మీ యిష్టమువచ్చిన పరీక్ష చేసికోవచ్చు.

పద్మా:-(సేవకులతో) తలగుడ్డలు తీయుమురా.

సేవ:- (వారి తలగుడ్డలుతీసి ఆశ్చర్యముతో) ప్రభూ! ప్రభూ! మీ మేనల్లురు- వాతాపీ ఇల్వలులు.

వాతాపి:- ఇల్వలుడు:- మామగారికి నమస్కారములు.

పద్మా:-(చిఱునగవుతో) ఓ హోహో! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు- రండు కూర్చుండుడు- ఎందులకివిచిత్ర వేషధారణ?

ఇల్వ:- మీ గూఢచారులుగా తిరుగుటకు - దేవతల రహస్యములు తెలిసికొనుటకు.

[వారు పద్మాసురుని కిరుప్రక్కలనున్న ఆసనములపై కూర్చుందురు. పద్మాసురుడు సైగ చేయ సేవకుడు వాతాపి ఇల్వలులకు గూడ పానపాత్రలందిచ్చును]

సేవ:- ప్రభూ! మీకు గూడ మధువు......

పద్మా:-ఆ!...మధువు నిఖిల మధురరసనిర్మిత మధువు ఇప్పుడేగదా సేవించినది. ఐనను నాప్రాణబంధువులైన వాతాపియిల్వలుల సంతోషముకొఱకు మఱియు కొంచెమాస్వాదించెద. ఆ!... ఏదీ... (తీసికొని ముగ్గురు త్రాగుదురు)

వాతా:-మామా! ఇదేమిమద్యము. మేము ప్లక్షద్వీప, కుశద్వీప, క్రౌంచద్వీప, శాఖద్వీప, శాల్మలీద్వీపాదుల దిరిగితిరిగి భారత వర్ష వింధ్యాటవీ సంచారసమయమున అక్కడ ఆటవికులగు బోయలు- కోయలు- చెంచులు- సవరలు......

పద్మా:-ఆ! ఎన్నిరకములవారున్నారేమిరా?

వాతా:-ఎన్నిరకాలేమిటిమామా! ఒక్క బోయల్లోనే చెంచుల్లోనే ఎన్నో తెగలవాళ్ళున్నారు. అడవిచెంచులు- గయితచెంచులు- దాసరచెంచులు-పుట్టచెంచులు-ఆటచెంచులు-వేటచెంచులు- ముత్తరాసిచెంచులు- బాసకోయలు- ఒడ్డికోయలు- కోలుకోయలు- కాకకోయలు- కమ్మరకోయలు- గుమ్మకోయలు- గుట్టకోయలు- మొదలైన తెగలెన్నోవున్నాయి మామా... తాటికల్లు-ఈతకల్లు- టెంకాయకల్లు- ద్రాక్షసారా- ఇప్పసారా-తాటిసారా-అబ్బో! చెప్పలేనన్నిరకాల వానియాలు- కుక్కమూతికూజా- కొంగమూతికూజా-బాతుమూతికూజా- కోతిమూతికూజాలతో బహూకరించారు. ఎలావున్నాయిరా యిల్వలా?

ఇల్వ:- ఎలావున్నాయేమిటి? ఆ తీపు- ఆ ఊపు- ఆ వవు- ఆ కోపు- ఆ లాహిరీ- వహ్వారే. యెంతని వర్ణించేది మామా!

పద్మా:-మఱి నాకునోరూరునట్లు చెప్పుటయేనా...

వా తా:-వివిధద్వీపాలనుండి తెచ్చిన మధుకలశాలతో మనపానశాల యంతయు నింపివచ్చాము. మదురపండిన తాటిపండులాగా-అత్తిపండులాగా......

ఇల్వ:- తెగ మురిగిన కడుగునీళ్ళలాగా...

వాతా:-ఏరోయి- మామగారిని వరుసాడుతున్నావే. నీవలె చెంచుల వేషంలో ఉన్నాడనుకొన్నావా?ఎంతైనా...పెద్దవాడు-సురాసురసార్వభౌముడు. తెలుసా?—

ఇల్వ:- ఓ! తెలియకేం. మధ్యమధ్య వరుసైనవాళ్ళతో హాస్తసరసం ఆడకపోతే సంభాషణ ఉప్పులేని కూరే.

పద్మా:-నిజమేరా యిల్వలా. అదిలేనిదే మజాలేదురా.

ఇల్వ:- సరే! అన్నా ఏమిచెపుతున్నావ్.

వాతా:-మదురపండిన తాటిపండులాగా-అత్తిపండులాగా గమగమ వాసనేస్తున్నాయి. మీరు కడుపునిండా త్రాగవచ్చు-కావలసినంత ఇతరులకు పోయవచ్చు.

పద్మా:-మా సోదరి అజముఖికి కుశలమా?

ఇల్వ:- కుశలమే. ఆమె దొరికిన దేవతాస్త్రీలనెల్ల మాయోపాయమున బంధించి మనచెఱసాలకు చేర్చుచున్నది మామా!

పద్మా:-మీరో?

వాతా:-ఋషులము, దేవతలను బాధించుటలో మాది అందెవేసిన చేయి.మాయలుపన్నడంలో మనపేరుముందు చెప్పాలి. కాని....

పద్మా:-ఏ మా సంశయము!

వాతా:- అగస్త్యుడట... అగస్త్యుడు... పూర్వము సముద్రమును ఆపోశనముపట్టి యందుదాగిన అసురులను హతముచేయించుటేగాక ఇప్పటికిని మనవారికి అంతులేని అపకారము చేయుచున్నాడట. అతి సమర్థుడట, అతనిఅంతు కనుగొనుటయెట్లాయని యాలోచన?

ఇల్వ:- అన్నా! అపాయములేని ఉపాయము ఆలోచిస్తామంటివే?

వాతా:-నాకేమి తోచలేదురా! సోదరా!

ఇల్వ:- తోచే దేమిటి! మనము కామరూపులముగదా. నేనొక చక్రవర్తి దేవతా స్త్రీ రూపముధరించి యాతనిదగ్గఱ నృత్యగానములు ప్రదర్శించి ఆతనిమనస్సు చల్లగా ఆకర్షిస్తాను. తీరా దగ్గఱకు వచ్చేసరికి బలాత్కారిస్తున్నాడు నాథా! రక్షించండని కెవ్వున కేక వేస్తాను. చెట్టుచాటునో, పుట్టచాటునో ఉన్న నీవు హఠాత్తుగావచ్చి ఆ ఋషిని అమాంతంగా స్వర్గానికి పంపించవచ్చు అంతటితో మనపీడా వదలిపోతుంది.

వాతా:-అతడు నన్ను చూడగనే రాక్షసుడనని శంకించి శపిస్తే...

ఇల్వ:- శాపమా గీపమా! ఆ గాబరాలో స్వస్వరూపాన్ని మఱచి క్రిందుమీదౌతాడురా.

వాతా:-ఏమో! అతడు విశ్వామిత్రుడులాగా ఆకర్షింపబడడేమో-

పద్మా:-ఐతే-వాతాపీ- అంతకంటెమంచిఉపాయము నీవుపన్న లేవా?

వాతా:-అదే చూస్తున్నా మామా- ఒరే! ఇల్వలా! ఋషులను మోసముచేయాలంటే ఋషిరూపాలే ధరించాలిరా!

ఇల్వ:- ఏదో వేశావే యెత్తు ఏదీ కాస్తరానియ్.

వాతా:-మనమిద్దరము గురువు శిష్యులరూపం ధరిస్తాము. అతడువచ్చే దారిలో ఆశ్రమం కల్పించి తంబురమీటుచు తత్వాలుపాడు కుంటూఉంటాము. ఆయనరాగానే ఆతిథ్యానికి ఆహ్వానిస్తాము.

పద్మా:-ఆహ్వానించినచో హాయిగాతిని వెళ్ళగలడు. ముందుయుద్ధము చేయుదలంచి చివఱకు కూతునిచ్చి పెండ్లి చేసినట్లు.

వాతా:-లేదుమామా! ఇక్కడేఉన్నదిమజా! ఇల్వలా! నేనుమేకగా మారతాను. నన్నుచంపి యా మాంసము వండిపెట్టు అతడు తిని బయటికివచ్చి నిలబడగానే శుక్రాచార్యులుగారు చెప్పిన సంజీవనీ మంత్రం లోలోనజపించి నన్ను బ్రతికించి నాపేరుతో కేక వేయి. వెంటనే నాతనిపొట్ట చించుకొని బయటకువస్తాను. అంతటితో ఆ ఘట్టం ముగిసిపోతుంది. గోడలకు చెవులుంటు వంటారు. కొంపదీసి ఇది యెవరు విన లేదుగదా.

[తెఱలో నారదుని గానము]

పద్మా:-ఈ జడదారి తనదారిని పోవువఱకు మీరారాన నేల? మీపనికి మీరుపొండు. మీక శుభముగలుగుగాక.

[వాతాపి ఇల్వలులు బిత్తఱచూపులతో నిష్క్రమించుచున్నారు]

పద్మా:-వీణమాని... నోరు మాటలాడుచుండ నొసలు వెక్కిరించుచుండును. మింగరాని కబళము (నారదుఁడు ప్రవేశింప) బహుకాలదర్శనము, సమయమునకే వచ్చుచుందురు. మీ దర్శనభానూదయము లేనిచో వార్తాప్రపంచ మంధకారబంధురము. (పీఠముజూపి) దయచేయుఁడు.

నార:- (కూర్చుండి) నాకు రెండేముఖ్యమైనపనులు. విశ్వకళ్యాణమునకు సంచారము, ఏకాంతమున నాత్మవిచారము.

పద్మా:-మునీంద్రా! నాకు మద్యము హృద్యముగా లేదు. అమృతము కావలయును. నీవు సర్వజ్ఞుఁడవు. అది యెచ్చట నున్నదో చెప్పఁగలవా?

నార:- (నవ్వి) అమృతము కావలయునా? అది లభించుటకుఁ గొన్ని యర్హతలుండవలయునే... సరి సరి అమృతమున కేమిగాని ఉన్నమాటయన్న నులుకుండదుగదా!

ఉ॥ ఆమున ముజ్జగంబుల మహోర్భటి గెల్చిన పాలకుండ నా
కేమని నిర్విచారమున నీ గతిఁ గన్నులు మూసికొంటివా?
సేమము లేని దేవతల చింతలు చిచ్చులుగాఁగ మాటి నీ
యామము నడంచు నేమొ యింకనైనను రెప్పలువిప్పి చూడుమా!

పద్మా:-నేను కన్నులు మూసికొంటినా? ఔను...... మైకముచేత. (వికటముగ నవ్వి) నేను గన్నుదెఱచిన లోకము కన్ను మూయవలయును.

నార:- ఇంకను వెనుకటిధోరణియే. అట్లైన లోకముపోకడ నీవుగమనించుట లేదన్నమాట! తలతగిలినప్పుడుగదా తడవుకొనుట!

పద్మా:-ఎవరు?

నార:- పద్మాసురుఁడే! కాయలున్న చెట్టునకేగదా రాళ్ళ దెబ్బలు!

మీ వైరులగు దేవతలు శంకరునకుఁ గుమారుఁడుపుట్టినఁ దమ కష్టములు తీరఁగలవని నమ్మి తత్కార్యసిద్ధికై మన్మథుని బంప నతఁడు యోగసమాధినున్న భవునిపై బాణము వేసి యమ్మహాత్ముని కంటి మంటచే బూడిదయయ్యె.

పద్మా:-(వికటముగ నవ్వి) భళీ! మంచి ప్రాయశ్చిత్తము జరిగినది. చెఱపకురా చెడెదవు. తరువాత?

నార:- తరువాత రతీదేవి సతీత్వమువలన మన్మథుఁడు శివునిచే ననంగుఁడుగా ననుగ్రహింపఁబడియె.

పద్మా:-అరెరే! ఎండినమ్రాను చిగిర్చినదా? పిమ్మట?

నార:- పిమ్మట, సప్తర్షులు పెండ్లిపెద్దలుగనుండఁ దపంబునఁ దన్ను మెప్పించిన పార్వతిని బరమేశ్వరుండు పరిణయమాడెను. పంచబాణుండట్లు పంచత్వంబు జెందినను పంచబాణములు పంచాననునిపైఁ బనిచేసినవోయనఁ గుమారసంభవము గలిగె. గంగాతీరంబున నబ్బాలుండు షట్కృత్తికల స్తన్యపానముచేఁ బెరుగుచుండఁ బార్వతీ పరమేశ్వరువచ్చి కృత్తికా నక్షత్రమునఁ గుమారస్వామిని నిశ్చలభక్తితోఁ బూజించినవారలకుఁ గుమారులుగలుగుదురుగాక యనిదీవించి కుమారు నెత్తుకొని కైలాసమున కరిగిరి. శుక్లపక్ష చంద్రునివలె దినదినాభివృద్ధి గాంచు నబ్బాలుని శౌర్యంబుగాంచి పద్మాసురుని తలఁదన్ను వానిఁ దయారుచేసితిమని దేవతలు సంతోషపడుచుండిరి.

పద్మా:-(నవ్వి)ముగ్గురుమూర్తులే మూలలకొదుగ ముక్కుపచ్చలారని యీ బాలునివలనా ముప్పువాటిల్లుట? ఈ వ్యర్థప్రలాపము లన్నియు సార్థకములని నిశ్చయించితివా?

నార:- సార్థకమో... నిరర్థకమో! ఎట్లుచెప్పగలను?

పద్మా:-అటులైన నిప్పుడే మదీయ సైన్యమునుబంపి కైలాసమును ముట్టడించి కుమారుని సంహరించునట్లు చేసెద.

సీ॥ ఆజ్ఞనిచ్చితినేని హాలాహలాగ్నిని
అఱచేతితోఁబట్టి యార్పఁగలరు
సెలవిత్తునేని వే చెలరేఁగి మున్నీట
ముగ్గురుమూర్తుల ముంచఁగలరు
శాసింతునేని దోస్సారంబు దీపింపఁ
బట్టి జీవుల పండఁగొట్టగలరు
పొమ్మందునేని నభోమార్గమున లేచి
పొంగి సూర్యుని దిగమ్రింగఁగలరు
గీ॥ చెలఁగి కొండలఁ దలక్రిందు సేయఁగలరు
బాలుఁడన నెంత అవ్వాని బలమదెంత?
కొట్టి యరదమునకు నంటఁగట్టి నాదు
సన్నిధికిం జేర్పఁగలరు నిస్సంశయముగ.

నార:- తానుబోయిన లేదు. తన పేర చీటి. (నవ్వును)

పద్మా:-ఆఁ! సర్వలోకభయంకరుఁడగు పద్మాసురునా యొక్క బుడుతఁడు సంహారించుట? అసంభవము... ఐనను గోటితోఁబోవు దానికై గొడ్డలియేల? ఇప్పుడేపోయి వానివధింతు.

చ॥ చిఱుతని జూపకున్న శశిశేఖరు ప్రేవులు ప్రోవులై పడన్
జెఱికెద- రుద్రసైనికుల భీకరలీలనధించి పార్వతిన్
నఱికెద- కొండనూపెద- నందిని గిందిసిబట్టి కుత్తుకన్
గొఱికెద- ముజ్జగంబులను గొంకక చావగఁ జుట్టివై చెదన్.

[అని గదతో నిష్క్రమించును]

నార:- మంచిది. పెంచినవాని తల త్రుంచుటకుఁ బ్రయత్నించుట! మంచి పరాభవము జరుగును పొమ్ము. ఇఁక దేవాసురులకు జరుగఁబోవు యుద్ధము వర్ణనాతీతము.

ఉ॥ ఎన్నఁగనేల యిట్టిరణమెప్పుడు చూడము కొండకొండ ఢీ
కొన్నవిధంబునన్ విలయఘోషమెసంగఁగ వార్ధివార్ధి ఘూ
ర్ణన్న తెఱంగునన్ జగము ఘూర్ణిలునట్లుగ దేవ దానవుల్
క్రిన్నన మన్ను మిన్ననక క్రమ్మిన క్రోధముతోడఁ బోరరే.

[తెర]

ద్వితీయ రంగము

స్థలము:- వాతాపి యిల్వలుల ఆశ్రమము.

[ఆకుటింటిముందు లేళ్ళు, ఆవుదూడలు పరుండి నెమరువేయుచుండును. వాతాపి లేడిచర్మముపైన ఇల్వలుండు దర్భాసనముమీఁదకూర్చుండి గురుశిష్యులుగ నటింతురు. తంబురమీటుచు తాళము వేయుచు తత్త్వము పాడుచుందురు]

గేయము _ తత్త్వము

అఖిలజీవులకెల్ల- ఆధారభూతమౌ
ఆత్మరూపముజూడు మనసా
ఆత్మరూపముజూచి- అందుకౌఁగలిగితే
ఆనందమున్న దే మనసా ॥నీకు॥
ఆశలన్నియు తెంచి- అఘములన్నియుతుంచి
అచలసిద్దినిపొందు మనసా
అచలసిద్ధినిపొంద- అఖిలమ్మునీవమై
అలరుభాగ్యముగల్గు మనసా ॥నీకు॥
పరధనమ్మునుజూచి- పరభామలనుజూచి
భ్రాంతిపొందకెనీవు మనసా
భ్రాంతిపొందితివేని- భ్రష్టమైతిరిగెదవు
పాటించునామాట మనసా ॥నీవు॥
మాయలోకముజోలి- మరచి నీలోనీవు
వాలసంద్రముచిలుకు మనసా
చిలికితేప్రతిచిన్కు- శివతత్త్వమైవెల్గు
వెల్గులో జేరవే మనసా ॥నీవు॥

వాతా:_ఓరీ! శిష్యా! ఋషులు-రాజర్షులు- బ్రహ్మర్షులు-మహర్షులు-దేవర్షులు- కులపతులు మొదలగు వారెవ్వరైన మన ఆశ్రమ ప్రాంతమునకు వచ్చుచున్నారేమో చూడరా.

ఇల్వ:- చూచుచున్నాను గురూ! అదుగో... మనకు కావలసినవారే వస్తున్నారు.

వా తా:-అగస్త్యుడేనా?

ఇల్వ:- ఔను.

వా తా:-ఐతే మహానిశ్చలమనస్సుతో తత్త్వముపాడవలెరా. కూర్చో

[పరధనమ్ముననుజూచి- అనుచరణముపాడి ఆనందముతో మానముపహించినట్లుందురు]

అగస్త్యుడు:-(ప్రవేశించి) ఆహా! ఏమి వీరి నిర్మల తత్త్వజ్ఞానము. పండిన వేదాంతులవలెె గనఁబడుచున్నారు. గురుశిష్యులు కాఁబోలు ఇప్పుడిప్పుడు క్రొత్త ఆశ్రమములు మిక్కిలిగా వెలయుచున్నవి. మంచిది ఇట్టి ఆశ్రమముల ప్రోత్సహించుట నా కర్తవ్యము.

వా తా:-(వంగి నమస్కరించి) మహానుభావులు మహాఋషులు- మా ఆశ్రమము పవిత్రమైనది. శిష్యా! వారిపాదములుకడిగి వల్కలముతో తడియొత్తి తాళవృంతముతో విసరుమురా.

ఇల్వ:- (తత్తరపాటుతో) చిత్తము. చిత్తము. ధన్యుఁడను. కృతార్థుఁడను. (విసరుచు నమస్కరించి) మంచి పాడియావులున్నవి- మార్గాయాసము తీరుటకు ఉష్ణధారగ లాస్వాదింతురాస్వామీ.

అగ:- అక్కఱలేదు. అంతకంటె మీ చల్లనివాక్కులే నా శ్రమను బోఁగొట్టుచున్నవి ఆహా! ఏమి మీగురువు శాంతస్వభావము.

ఇల్వ:- ఔనుస్వామీ! వారు ఉపనిషదర్థవేత్తలు- మంత్రద్రష్టలు- ఆశ యేకోశముల లేనివారు- తలచుకొన్నచో మనబోటివారలను-(తప్పుతప్పు అనుచు చెంపలు వేసికొనుచు) కాదుస్వామీ! మాబోటివారలను ఈ మాయాలోకమునుండి పూర్తిగాతరింపచేయగలమహాత్ములు- పేరు సర్వాతీత సచ్చిదానంద పరమహంసావతంస స్వాములవారు-వచ్చినవారికెల్ల వేదాంతబోధ సేయుటయే వీరిపని.

వా తా:-మాశిష్యుని అతిశయోక్తులకేమిగాని - మీరెన్నడుదయసేయనివారు- మాఆతిథ్యము దయతో స్వీకరింపవలెనని ప్రార్థన.

అగ:- నేను త్వరగా వెళ్ళవలయు. దక్షిణ సముద్రతీరారణ్యమున ఋషులు సత్రయాగము చేయఁబోవుచున్నారట.

వాతా:-స్వామీ! ఇట్టియవకాశము మాకులభింపదు. మీరీఆతిథ్యము తీసికొనిచో మేమింక నిరాహారదీక్షతో మరణింతుము.

అగ:- ఇంత భక్తిశ్రద్ధలతో ఆహ్వానించుచున్న మీమాటను త్రోసి పుచ్చుటయు సమంజసముగాదు- కానిండు-

వాతా:-మహాప్రసాదము. ఓరీ! శిష్యా. స్వాములవారిని స్నానమునకు తీసికొనిపొమ్ము.

ఇల్వ:-చిత్తము. దయచేయుడుస్వామీ-(అగస్త్యునితో నిష్క్రమించు చున్నాడు)

వాతా:-మా పాచిక బాగాపారింది - అడుగో- ఇల్వలుడు సంతో షంగా వస్తున్నాడు-

ఇల్వ:- ఏసిన ఎత్తు మంత్రంగా సరిపోయిందిరా. ఆయన అనుష్ఠానము తీర్చుకు నేసరికి కాలాసన్నమవుతుందట.

వాతా:-ఈ పెద్దఘటము జరిగిందంటే మన మామగారు- పద్మాసుర మహారాజుగారు బలేబహుమతిఇచ్చి నెత్తికెక్కించుకుంటాడు.

ఇల్వ:- అయితే పిల్లనేమైనా ఇస్తాడురా?

వాతా:-నేను గట్టిగా చెప్పలేనుకాని, ఔట్టుచేస్తే ఎలావుంటుందో! పడుచుపిల్ల మాంచి పాకంలో వుందిరా! చక్కనిచుక్క! అచ్చంగా రంభ నోట్లోనుంచి ఊడిపడ్డట్లే ఉంది. "ఊఁ" అన్నాడా మనరొట్టెవిరిగి నేతిలోపడ్డట్లే. ఈఉల్లాసంలో అసలు పనిమరచాం. లోపలకుపద-నేను మేకరూపం ధరిస్తాను- పని చకచక కానియ్-

ఇల్వ:- కనుమూసేసరికి ఐపోతుంది. పద (అనుచు నిష్క్రమింతురు)

[లోపల మేక అరుపు వినబడును]

ఇల్వ:- (ప్రవేశించి) అడుగో! సంధ్యవార్చుకుని అగస్త్యుడు వచ్చు చున్నాడు. లోనికి తీసికొనివెళ్ళి భోజనము తినిపించి తీసికొని వస్తాను. (నిష్క్రమణ)

అగ:- (ప్రవేశించి) భుక్తాయాసమధికముగానున్నది. బలవంతముగాఁ దినిపించుటచేఁ గాఁబోలు.

ఇల్వ:- (ఎదురుగావచ్చి యేదోజపించి) వాతాపీ! (అని అఱచును)

అగ:- (పొట్టలోఁగదలుచున్నట్లుగమనించి) జీర్ణంజీర్ణం వాతాపిజీర్ణం (అనుచు పొట్ట నిమురుకొని దివ్యదృష్టితో సత్యమెఱిఁగి దర్భపోచలుతీసికొని మంత్రించి) ఈ కుశప్రహారముచే ఇతఁడు మరణించుఁగాక! (అనివేయ ఇల్వలుఁడు భయంకరముగ అఱచి చనిపోవును)

[తెర]

తృతీయ రంగము-మహాకాళీ దృశ్యము

స్థలము - కైలాసగిరి

[కుమారస్వామి యుయ్యెలలో శయనించి యుండును. పద్మాసురుఁడు ప్రవేశించి గదతోఁ గుమారుని గొట్టఁబోవ వివిధాయుధములతో భయంకరధ్వనితో మహాకాళి యడ్డుపడి పద్మాసురునిపై కుఱుకఁబోవును]

పద్మా:-(భయముతో) ఆఁ ఆఁ! భయంకరము .. అతిభయంకరము కాళీ! మహాకాళీ! ఉత్తేపరక్తకపాలమాలీ! దీర్ఘదంష్ట్రిజాతసితమయూఖాళీ! ఆయతనీలచికురపాళీ! దీపతభక్తహృత్పత్రితోళీ! భీకరసంహారకేళీ! నిలువుము...నిలువుము. ఈ లీల నేలవచ్చితివి? అబ్బా! చూడఁజాల. కుమారుని రక్షింప వచ్చితివా? నీరూపముచూడఁజాల. దండగానున్న తలపుఱ్ఱెలు పండ్లికిలించు చవియు, నల్లగుడ్లు తిరిగిపోవుననియు, రక్తముచిమ్ముచున్నవియు... ఆఁ! అసాధ్యము. అసాధ్యము. బాకులవంటి తెల్లని కోఱల నడుమ రక్తమయమగు నాలుక పాముపడగవలెఁ జాచినదే! అన్నిచేతులలోఁ జిత్రవిచిత్రములైన యాయుధములు వెలుఁగుచున్నవి ఘోరము, మహాఘోరము...... నాహస్తము వణఁకుచున్నదే! గద నిలుచుట లేదే! కాళీ! కాళీ! చూడుము. నామాయాతంత్రప్రభావంబున నీకుఁజిక్కకుండఁబోయి నిన్ను జయించుటకుఁ దగినయుపాయమాలోచించెద.

(నిష్క్రమించును)

ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

షష్ఠాంకము

ప్రథమరంగము

స్థలము:- పద్మాసురుని దర్బారు

[మంత్రులు, సామంతులు, శుక్రాచార్యుఁడు సింహవక్త్రుఁడు, తారకుఁడు, భానుకోపుఁడు, ధర్మగోపుఁడు, ఆసీనులై యుందురు. పద్మాసురుఁడు సింహాసనమలంకరించుటకు వచ్చుచుండ వందిమాగధులు స్తోత్రపాఠము సేయుదురు.]

వంది:- జయము జయము. శ్రీమద్వీర మహేంద్రపుర సింహాసనాధికారా! సకలలోక సంచారధీరా! బ్రహ్మాండ దిక్కటాహ విదీర్ణ వర్ణనాతీతార్ణవ గంభీర నాద క్ష్వేడాకరా! రాజాధిరాజ రమ్యమకుట రత్నద్యుతిచ్ఛటా నీరాజితపాదపంకజా! విజయీభవ! దిగ్విజయీభవ!

మాగధ:- ఖరాసి దర్శనమాత్రానంత భయభ్రాంత శరణాగత శాత్రవ పిశాచ కాలభైరవా! అవక్రపరాక్రమోపేత లబ్ధ భూచక్ర చంక్ర సంఘర్షితాహిత మత్తమాంగ కంఠలుంఠనకంఠీరవా! విజయీభవ! దిగ్విజయీభవ!

శుక్రు:- దానవకుల తిలకా! నీవు పట్టినదెల్ల బంగారము, ముట్టినదెల్ల ముత్యమగుటచే దేవతలకు మిక్కిలి కంటకముగానున్నది. కావుననే వాతాపియిల్వలుల నగస్త్యునిచేఁ జంపించిరి. మఱియుఁ గైలాసగిరి వార్తలన్నియు నీకుఁ దెలియుచున్నవిగదా!

పద్మా:- తెలియకేమి? ఇంద్రాద్యమరులు కుమారుని శరణుజొచ్చి యాతని సేనానాయకత్వమున మనల జయింపవలెనన యెత్తు లెత్తుచుండిరట.

శుక్రు:- గాలిచొఱలేని తావునకైనఁ బోఁగల వేగురు వేఁగులుండ వైరుల మర్మకర్మము తెలుసుకొనుటలో మనకు లోపముండదు. అమాయకుల నణఁగద్రొక్కుటలో నమరులందెవేసిన చేతులు గాని మీవంటివారి నేమి సేయఁగలరు?

పద్మా:- బహువిధరాజకీయ తంత్రజ్ఞుఁడగు బృహస్పతి యటు రాజ గురువుగానుండ నేదియో పన్నాగము పన్నకుండునా?

గీ॥ కదనమున నెల్లజగములు కదలవచ్చి
డీకొనినఁగాని నన్ను నోడింపలేవు
ఎన్నివ్యూహములను బన్న నేమిలెక్క
పట్టువిడువను నేన నీ పాదమాన.

ధర్మ:- సకలభువనేశ్వరా! కుమారవీరబాహుల కృత్యంబు లత్యంత భయంకరంబులు. కార్తికేయుఁడు కారణజన్ముఁడని త్రిమూ ర్తుల నిశ్చయమట.

శుక్రు:- కారణజన్ముఁడైనను నిష్కారణముగ మనతో యుద్ధమునకు సిద్ధపడునా?

ధర్మ:- సిద్ధపడిన మనమేగతి వర్తింపవలయునో దురూహ్యము.

తార:- మంత్రిగారినోట నెన్నఁడు విననిమాట వెలువడినదే. ధర్మ గోపా! యెంతలో ధైర్యమును గోల్పోయితివయ్యా!

మ॥ శరజన్ముండన జంకనేల? యిపుడీ శస్త్రాస్త్రముల్ చూడు భీ
కరుఁడీ తూపతి-సింహవక్త్రుఁడు-మహాకాయుండు క్రౌంచుండు భా
సుర దివ్యాస్త్రుఁడు భానుకోపుఁడరరే శూరుల్ ఘనుల్ సైనికుల్
తురగ స్యందన కోట్లుగల్గు మనలన్ దూలింపగా శక్యమే?

సింహ:-(పరికించి) ఎక్కడిదారథము? మనోవేగమున వచ్చుచున్నదే. దానిచిహ్నములన్నియు శివసంబంధముగా నున్నవి.

ధర్మ:- దేవతలెవరికైనను రాయభారిగాఁ బంపిరా?

సింహ:-అగ్రజా! ఆగ్రహింపక యొక్క మనవి వినవేడెద. శుక్రా
చార్యాదులుండ మీకు హితోపదేశము చేయఁదగినవాఁడను
కాదుగాని విషము విషయమును జ్ఞప్తికిఁదెచ్చెద. శంకరుఁడు
వరమనుగ్రహించు సమయమునఁ దనలోనిశక్తి మాత్రమసా
ధ్యమనియె. ఆ శక్తియే యీ కుమారస్వామిగా జన్మించెనని
నాయంతరాత్మ చెప్పుచున్నది. కావున, మంత్రిగారుసూచించి
నట్లు మనము దీర్ఘాలోచనసేయుట మంచిది.

తార:-(జనాంతికముగ) అన్నగారికినోటనా యిటువంటి మాటలు
అలాత పిశాచన్యాయముగ నున్నదే.

పద్మా:-మంచిది (సింహవక్త్రునిజూచి) ఐన నీ యభిప్రాయమేమి?

సింహ:-సవినయముగ సంధికొడంబడుట మేలని నా నిశ్చయము.

పద్మా:-ఛీ బుద్ధిహీనా! యేమని పేలితివిరా? నిఖిల భువనాధినాథ
మస్తక భాస్వద్రత్న మకుట చుంబిత పాదద్వయుండనైన
నేనొక బాలునకుజంకి సంధిగావించుకొనవలయునా? కొండొక
తూటి యీమాట నోట రానిచ్చితివేని నిశిత కరవాలంబున
నీ నాలుక ఖండించెద.

శుక్రు:-దానవేంద్రా! శాంతింపుము. నీ తమ్ముఁడగు సింహవక్త్రుఁడు
నీ యనుయాయిగాని ఆతతాయిగాఁడు. ఇదియేదో విసపు
గడియగా నున్నది. గుప్పిడి విడిపోయిన తిప్పలు తప్పవు.
అడుగో! ఆ రథకుఁడిటే వచ్చుచున్నాఁడు.

[వీరబాహువు ప్రవేశించినంత నీశ్వరదత్తమైన దివ్యాసన మాకసము
నుండివచ్చి యాతని వెనుకఁజేర దానిపైఁగూర్చుండును. అందఱునాశ్చర్య
పడుదురు. ధర్మగోపుఁడు, సింహవక్త్రుఁడు సాభిప్రాయముగ నొకరినొకరు
చూచుకొందురు]

ధర్మ:- శివ భక్తాగ్రగణ్యులగు మీ పేరడుగవచ్చునా?

వీర:- నాపేరు వీరబాహువు. నా స్వామి కుమారస్వామి. దేవదూత
నై యిటకు వచ్చినాఁడను.

[గానలోలుఁడై నారదుఁడు ప్రవేశించుచున్నాఁడు]

పద్మా:-మహర్షిచంద్రా! ఆ యాసనమలంకరింపుఁడు.

వీర:- (నారదుఁడు కూర్చుండ) దివ్యర్షి సమాగమము సంతోష దాయకము. శుక్రాచార్య ధర్మగోపాది జ్ఞాన వృద్ధులారా! సింహవక్త్ర తారక భానుకోపాది మహాయోధులారా! తక్కుంగల సభాస్తారులారా! సావధాన చిత్తులరై కుమార స్వామియొద్దనుండి రాయబారిగావచ్చిన నాపల్కులువినుఁడు. వీరమహేంద్రపుర సార్వభౌమా!

ఉ॥ ఏలితివింత కాలము యథేచ్ఛగ లోకములెల్ల-నిందురనిం
దోలితి-వెన్నరాని బహు దోషములంబొనరించి, తింక నీ
శీలము మార్చుకొమ్ము పరిశీలనతో-సురరాజు రాజుగాఁ
బాలన సేయనిమ్ముసురపాలక! జాలి యొకింత పూనుమా!

మఱియు—

ఉ॥ ధర్మము తప్పఁగాఁదగదు దానవకోటికి దేవతాళికిన్
ధర్మమె శాశ్వతంబు నిజధర్మమె ముక్తిపథంబు చూడఁగా
ధర్మము తప్పినన్ యశము తప్పును, దప్పును భోగభాగ్యముల్
మర్మమదేల? కాయములు మాయును-మాయునుబంధుసేనలున్.

సురాసురవంశము లాదిలో నొక్క వృక్షమునఁ బూచిన రెండుపూవులు, ఒక వనమునఁబెఱిఁగిన రెండుప్రాణులు.

నార:- (జనాంతికముగ) ఒకగూటిలోఁబెఱిఁగినను కాకికాకే కోయిల కోయిలే!

వీర:- ఇదిగమనించి యమరావతీ పట్టణము నింద్రుఁడు వీరమహేంద్ర పట్టణమును నీవు పరిపాలించుట తగవని మాహితవు. కావున దేవతలకు సంబంధించినది పూరిపుల్లయైనను నీ విఁక నుంచుకొనఁ దగదు.

పద్మా:-ఓహో! వీరబాహూ! మహోపదేశముచేసితివి.

ఉ॥ ధర్మము ధర్మమంచు బహుధా వ్యథ పొందెదవేల? ఏది నీ
ధర్మము చెప్పుమా మునుపు దైత్యులకిచ్చిరె స్వర్గమేలఁగా
ధార్మికులైన దేవతలు దాని నటుంచుట పక్షపాతపుం
ధర్మముగాక నీది యొకధర్మమె చాలిఁక గట్టిపెట్టుమా!

శుక్రు:- శౌర్యరసభాసురా! పద్మాసురా! మంచిసమాధానమిచ్చితివి. బుద్ధియందు బృహస్పతిని మించితివి.

వీర:- అసురాచార్యా! మీరే సురద్వేషమును బురికొల్పిన నిట మా మాటలఁ బాటించువారెవరు? బుద్ధియందు బృహస్పతిని మించఁగలవారు మీరు కావచ్చు నేమోగాని యీ రాజెన్నఁడును గాఁడు. నారదా!

ఉ॥ నీతుల నెత్తిచూపి యవినీతుల రూపముమాపి లోక వి
ఖ్యాతికి నోపి రాజ గురువై తగు శుక్రుఁడె పక్షపాతపుం
జేతముతోడ నాడ నిఁకఁ జెప్పెడిమాటల నొప్పుకొందురే
పాతకమెల్ల పండఁగనె ఖండనమొక్కటి రాక తక్కునే?

నార:- ఔనౌను ఈను రోసములు పెనుబాములవలె బుసకొట్టు చున్నవి. తగిన నాగస్వరమూఁదఁగల యహితుండికుండు కావలెను. ఇంతకు విధి బలవత్తరము. ఐనను నా యెఱింగినంత చెప్పిచూచెద. పద్మకోమలాకళత్రా!

చ॥ కొడుకులు తమ్ములుం గురులు కోరిన కృత్యములందు నండగా
నడచుచునుండ నాకు నొకనాఁటికేనియు లోటువచ్చునే
జడమతులైన దేవతల సంధుల గిందులతోఁ బనేమి యం
చెడఁదఁ దలంపబోకు జయమెల్లపు డొక్కరిపక్షముండునే?

ఉ॥ సంధియొనర్చి యిర్వురకు సంతసమున్ సమకూర్పఁగా జగ
ద్బంధువు వీరబాహువు శుభంబుగ నేఁ డిటువచ్చె సత్కృపా
కంధి గిరీశుఁడంపఁ జెలికారపు సంధిబరంబు నీ భుజ
స్కంధముమీఁద నిల్చినది సర్వము గర్వముమాని పల్కుమా?

పద్మా:- ఋషీశ్వరా! మాయైశ్వర్యమును మీరునుజూడఁజాలకుంటిరా?

శుక్రు:- అందాశ్చర్యమేమి? ఆతఁడు దైత్యఋషిగాఁడు. దేవఋషి.

నార:- నాకాబుద్ధిలేదు. ఉన్నచో నీ యాస్థానమునకు వత్తునా? మీ యోగక్షేమములు విచారింతునా?

ఉ॥ నీవును సర్వశాస్త్రములు నేర్చినవాఁడవు నీ గురుండు వి
ద్యా విభవాన్వితుం డొరులు ధర్మముచెప్పఁగలరె మీకు-మీ

భానము శాంతి భద్రితల బంధురమై త్రిజగత్ప్రమోదమై
దీపసలందినం గలుగదే సుఖమెంతయుఁ గశ్యపాత్మజా!
ఇప్పుడు లోకమట్టుడికి నట్టుడుకుచున్నది.

సింహ:-ఎందులకు?

నార:- మీ స్వార్థమునకు - దేవతల కష్టములకు.

తార:- నీ లోతుపాతు లిప్పటికిఁ దేటతెల్లముగాఁ దెలిసినవి దేవత లందఱు స్వార్థరహితులు. రాక్షసులందఱు స్వార్థపరులు.

ఉ॥ మాయలమారి నారదునిమాటలు నమ్మఁగనేల యగ్రజా!
పాయుము వానిమైత్రి యని పల్కఱుచెప్పిన నొప్పవైతి-వే
న్యాయమొ తెల్లమైనదె యథార్థముగా నిపుడైన నిట్టి య
న్యాయముఁ దెల్పువారు ఋషులా మనపాలిటి గర్భశత్రులా?
ఈతఁడు మనరహస్యములెన్ని వైరులకందిచ్చెనో! తేనెబూసినకత్తి.

నారదుఁడు:-

ఉ॥ కత్తెఱబోనుజిక్కినటుగా నిటునుంటిమటంచు తారకా!
మత్తిలిపల్కఁబోకు మవ-మానముసుమ్మిదె-చెట్టుగొట్టి మీ
కుత్తుకపైఁకిదెచ్చుకొను-కూరిరత తొల్తటినుండి యున్న దే
విత్తొకటైన చెట్టొకటి-వేఱుగ నెత్తఱినైనఁ బుట్టునే?

సింహ:-తమ్ముఁడా! ముందువెనుకలరయక తొందరపడవలదు. ఈఋషి మహామనీషి.

తార:-కావుననే యింతకాలము యుక్తితో నటించినాఁడు.

శుక్ర:-నారదా! రాక్షసులోడిపోయి యడవులలో నిడుమలు పడు నప్పుడు దేవతలకిట్టి నీతులెప్పుడైన బోధించితివా?

నార:- అవసరమని తోఁచినప్పు డెవరికైనను బోధించుటలగ్గు. ఇది మీకెగ్గుగా నున్నచో నిట నే నుంటఁ దగనిపని.

ఉ॥ వాద మిదేల మీరు పగవారివలెన్ మముజూచునప్పుడీ
బోధలు కర్ణ శూలములపోలిక మీకు సహింపరానివా
పోదును-కర్మ మేగతులఁ బొందఁగఁజేయునో-పైత్యరోగికిం
జేదగుఁ బంచదార యని చెప్పిరఁ బెద్దలమాట వ్యర్థమా?

[లేచి పోఁబోవును]

పద్మా:-మహాత్మా! పిన్నవానిపల్కుల కింత పెద్దకోపమా? సురసామ్రాజ్యము మాకుఁ బరాక్రమమున లభించినదిగాని దానధర్మముగ వచ్చినదిగాదు.

వీర:- మునీంద్రా! ధర్మనిర్ణయము చేయలేనివాఁడు లేచిపోఁదగుంగాని మీ రేలపోవలయు? నే వచ్చినపని పూర్తిగాఁ దెల్పునంత వఱకైన నిల్వుఁడు. అసురవరులారా! మీరు వరబలమున విజృంభించి ధర్మప్రవర్తనలేక దివాకర నిశాకరులు దిక్పాలకులు పూజనీయులని గ్రహింపక పాదపూజఁ జేయించుకొనుచు దేవతల నెందఱినో చెఱయందుంచితిరట. వారి నీ క్షణము విడిచిపెట్టుఁడు. ఎవరి యధికారము వారికొసంగుఁడు కాదేని మీకును మాకును యుద్ధముసిద్ధము. అందువిజయము మాకు సిద్ధాంతమని యీశ్వరపుత్రుండగు కుమారస్వామి మీతో ముమ్మాటికిఁ జెప్పుమనె.

పద్మా:-ఒక్క యీశ్వరపుత్రుఁడేగాదు. ముగ్గురుమూర్తుల పుత్రులు వచ్చినను లెక్కసేయము.

శా॥ ఏమో సంధికివచ్చినాఁడవని నే నీ కొల్వుకూటంబునన్
స్వామీ! రమ్మట స్వాగతంబనుచు నీ సంభాషణం బెంతయో
యామోదించెదనంచు నీదు మదిలో నాశించితే యెన్నఁడున్
మోమోటంబుగ మాటలాడము సుమీ ముక్కంటియే వచ్చినన్.

వీర:- ఇందు మోమోటంబుగ మాటలాడవలసిన విషయము లేదు. నేనువచ్చినది క్షేమముఁగోరి కాని మీ స్వాగతముఁగోరి కాదు. నవాధిక లక్ష ప్రమథగణముతో చతురంగబలముతో మహాతేజస్వియగు కుమారస్వామి శ్రీసంధినగరమునకు వచ్చినాఁడు. కాని, ధర్మమాలోచించి నన్ను సంధికిఁబంపినాఁడు. నీవును శివభక్తితత్పరుఁడవు శాంతముగ యోచింపుము. పోరు నష్టము పొందు లాభమని గ్రహించి సంధికి సమ్మతింపుము.

పద్మా:-ఓ దేవదూతా!

మ॥ ఇటుసూర్యుండటు దోచినన్ వినను. నే నీమాట ముమ్మాటికిన్
పటుబాహాబల శక్తిచూపఁగల దేవవ్రాతమే యున్నచో
ఎటులేనిన్ మముగెల్చి పొందఁదగుఁగాదే మమ్ము సేవింపనా
అటుగాకొండొక మార్గముండఁ దగదీయార్భాటమున్ మానుమా.

తార:-అగ్రజా! అదియునుంగాక-

చ। కరులు రథంబు లశ్వములు కాల్బలముల్ కడు వేనవేలుగాఁ
బురహర సూనుఁడా నగరభూమికిఁ దోడ్కొనివచ్చి సంధికై
సరగునదూతనంత నతిశాంతము జూపుచు నొప్పుకొన్నచో
శరజునిరాకఁజూచి మదిజంకెను శూరుఁడటంచు నవ్వరే.

వీర:- సాధువు లెన్నఁడు నవ్వరు... నవ్వఁజాలరు.

చ॥ కరము భయంకరంబు-జనకంటక-మున్నత జీనహింసకా
కరము- పరార్థసంగ్రహము- క్షేమము సన్నిహితంబు గాన సం
గరము మహాలయంబనుచు జ్ఞానులు దానికి నిచ్ఛగింతురే
పరమదయావిహీనులగు పాపులకే తృణమాత్ర మారయన్.

పద్మా:-ఐన మీరేల యుద్ధమునకు సిద్ధముగానుంటిరి? ఇట్టి శ్రీరంగ
నీతులు మాకును దెలియును. దేవతలు రాక్షసులు ఆజన్మ
విరోధులు. ఐనను నొక ఱొంటిలో రెండుకత్తులిముడవు.

ఉ॥ వారలొ మేమొ లోకములు పాలనసేయుట యొప్పుగాని య
వ్వారలు మేమునుంగలిసి పాలనసేయుటకల్ల- వారితోఁ
బోరు ఘోసంగునా మరలఁ బూర్ణముగాఁ గసిదీర్చుకొందు మీ
తీరున మాటలాడకిఁకఁ దిన్నఁగ వచ్చినదారిఁ బట్టుమా!

వీర:- దోషాచర సార్వభౌమా! మృత్యువు నీతలపై నెక్కి తాండవ
మాడుచున్నప్పు డెవరేమి సేయఁగలరు?

చ॥ వినయ వివేకశూన్యుడవు వేయివచింపఁగ నేల యయ్యయో
తనయులు బంధువుల్ హితులు తమ్ములు మంత్రులుచత్తురన్న నీ
యునికి యొకింతమార్చి చెవియొగ్గవు తగ్గవు తోడు లేని దే
చనదిల రాచపీనుఁగను సామెత యుత్తటి ఱిత్తవోవునే?

ఆచార్యా!

ఉ॥ ఎందఱు శూరపద్మలు మఱెందఱు తారక సింహవక్త్రు లిం
కెందఱు భానుకోపు లిఁక నెందఱు క్రౌంచులు ధర్మగోపులున్
వందలు వేలు లక్షలుగ వాహినులన్ గడియించివచ్చి మా
స్కందుని దాఁకి చత్తురు నిజంబు నిజంబిది దైత్యరాడ్గురూ!

భాను:-ఓయీ! నీ పిల్లి శాపముల కిట భీతిల్లువారు లేరు. జనకా! ఆగ్రహంబుగల్గెనేని యుగ్రుసైన నిగ్రహింపఁగల సోదరులుండ గతజీవుల సజీవులుగఁ జేయంజాలు మహామంత్రవేత్త యగు శుక్రాచార్యులుండ మనకా యపజయము? ఇంత యేల?

చ॥ సెలవిడిపంపినం దివిజసేనలతోఁగ గుహుండువచ్చినం
దోలఁగఁక జుట్టుపట్టుకొని తోడ్కొనిరాఁగల సూనుఁడుండఁగాఁ
గలఁగకుఁ డింక - తెడ్డుకలుగంగను జేతిని గాల్చుకొందురే
విలయ సమీరఘోరహతి వ్రీలవె నాలము లొక్కపెట్టునన్.

తార:-సెబాస్! పులిపిల్ల పిల్లికిజంకునా?

వీర:- యౌవనబలంబున నేల పిచ్చిమాటలాడెదరు?

ఉ॥ మారుఁడు దైత్యహంతక కుమారుఁడు ధీరుఁడు మారమార ధీ
హారుఁడు రౌప్యభూధరవిహారుఁడు నిర్జరకోటిసైన్య సం
భారుఁడు గౌరి గంగల కుమారుఁడు భీకరశక్తి శక్తి దు
ర్వారుఁడు ధాతృదుర్మద నివారుఁడు మీకు శరణ్యుఁడారయన్.

తార:-మా వైనులఁజేరినవాఁడు మాకు శరణ్యుఁడా? కాఁడు; పరమ శత్రువు. దేవదానవ సార్వభౌమా!

ఉ॥ ఆజ్ఞనిడఁ సురాసురులనైన పడంకఁగఁజేయునట్టి నా
ప్రజ్ఞఁదలంప రేమి - పసిపాపఁడు మొన్నజనించినట్టి స
ర్వజ్ఞతనూజుశీర్షమున వంగనికొమ్ములు వచ్చియున్న వే
ప్రాజ్ఞులు దీనికై యదురుపాటు వహింతురె తేల్చిచెప్పుమా!

వీర:- ఓయీ తారకా! అజ్ఞానాంధకారమునఁ గన్నుగానవుసుమా!

ఉ॥ బాలుఁడు సర్వలోకపరిపాలుఁడు సంతతధర్మచింతనా
శీలుఁడు - నిత్య సత్యపరిశీలుఁడు - కిల్బిష శుష్కకాటవీ

కీలుఁడు- విశ్వరూప పరికీర్ణవిలోలుఁడు- పాఱఁజూడు భూ
పాలక! అట్టివాఁడు పసిపాపఁడనన్ మదిఁజోద్యమయ్యెడిన్.

భాను:-తండ్రీ! నిజముగా సంధిఁగోరువాఁడైన సమరసన్నాహకుఁడై రానేల? ఇందునకు శరణ్యుఁడై మనలనేమేమో చెసెదనని బయలుదేరియుండవచ్చు. ఈఁగ తెక్కలగాలికి కొండలూఁగ వని గ్రహించి యా దురహంకారి సంధకుదిరిన మాటలతోఁ గార్యసిద్ధియగునని యీతనిని బంపియుండనచ్చు ముందు వీనిసిబట్టి చెఱసాలలోనికి నెట్టినచో అన్నిసంధులు నప్పుడే తేలఁగలవు.

శా॥ జాలింబూనితిరో ప్రశాంతమతులై సంధింపఁగా వచ్చినాఁ
డేలీలం జెనకంగఁ జూతుమను చెంతే నాత్మఁజింతింతురో
కాలాతీతమదేల చూడుమిదె తెక్కల్ వెన్కకింగట్టి యీ
నీల స్తంభము కంటగట్టెదను దండ్రీ! యాజ్ఞనిప్పింపుమా!

నార:- (జనాంతికముగ) నూఱు కాకులలో నొక కోయిల.

వీర:- (చిఱునగవుతో) భానుకోపా! నన్ను బంధింప మీకుఁగాదు గదా మీ తాతముత్తాతలకైనను దరముగాదు నన్నుదూషిం చినఁ బడియుందునుగాని పరమాత్మస్వరూపుండగు కుమార స్వామిని నిందించిన నేనూరకుండను, ఆపై నిమహాప్రళయము సంభవించును. గాన మీ వంశవృక్ష మామూలాగ్రముగ నశించును. లోకములఁ గబళించితిమిగాదాయని గర్వపడకుఁడు.

ఉ॥ గాలపు మాంసలేశమునుగాంచి మహాభ్రమ మీను చంగునం
దాలిమితోడ మ్రింగుతఱి దానిముదంబును జెప్ప శక్యమే
జాలరి పిమ్మటన్ వెలికి సంతసమొప్పఁగ లాఁగిపట్టి యా
గాలము కంఠసీమను జెకల్చుతఱింగద తుళ్ళడంగుటల్.

తార:- చాలుఁజాలు. నీ తెలివి నిచ్చటఁదెలియఁజేయ నవసరములేదు. ఇఁక దయచేయుము. ఇంతవఱకు నిన్నుపేక్షించుట నీయదృష్ట మనుకొనుము.

పద్మా:-ఇటనుండి మఱలిపోయెడి వాంఛత లేదేమో!

వీర:- నీయట్టివాని కతంబుననా?

ఉ॥ ఎట్టి ప్రదోషవేళ జనియించితివో భువిపైన రాజ! నీ
యట్టి వివేకహీనుఁడెవఁడైనను గల్గునె? దేవతాళినిం
గొట్టిన-స్త్రీలనెందఱినో ఘోషిలుచుండగఁ బట్టియుం జెఱన్
బెట్టిన పాప మీ వనుభవింపక తీఱున బుద్ధిమాలునా?

క్రౌంచ:-ఓరీ దూతా! నీ నీతులిఁకఁ గట్టిపెట్టుము. మా రాజేంద్రుని నోట నీకుందగుహితవచనములు విన నెంచుట పులినోట పురాణ ధర్మములు వినఁ దటస్థించుట. ఈ సభాస్థలమున మమ్మిట్లు తూలనాడిన వారెవ్వరు లేరు. ముందున్న చెవులకంటె వెనుక వచ్చిన కొమ్ములు పైకిలేచినవి. రాజా! దండప్రయోగమున కాజ్ఞనిత్తురా?

సింహ:-ఛీ పాపీ! రాయభారిని గొట్టెదవురా! ఇదిగో! మదీయ గదా దండమును చూడుము.

క్రౌంచ:-ఆఁ రమ్మా, నీక్రొవ్వడగించెద (తారకుండు ఇరువురను వారించును)

వీర:- నీ పాపఫలమేరీతిగా పరిణమించినదో చూచితివా? నీ సభా స్థలము రణరంగమైనది. మీలోమీరు కొట్టుకొని చచ్చు కాలము వచ్చినది. ఇప్పుడైన యోచింపుము. దేవతల విడి పింపుము. నానుడువులాలింపుము. కాదేని కొలది కాలములోఁ గాలుని లీలలు గాంచఁగలవు.

తార:-దురాత్మా! మా యెట్టయెదుట బ్రహ్మేంద్రాద్యమరులు సైతము నిలువఁజాలరు. ఏమిరా నీ ప్రగల్భములు! అగ్రజా! ముందు వీనిని జెఱసాలలోనికి నెట్టి యాపైని వీనింబంపిన దుర్మార్గుని పనిబట్టుదమా?

వీర:-

మ॥ కలుషాత్మా! ననుఁబట్ట సాధ్యమగునా కైలాసవాసాత్మజున్
జలనంబేమియు లేని భక్తినెదపూజల్ సేయువాఁడంజుమీ
బలునిన్ స్కందుని విశ్వరూపుని మహాభ్రాజిష్ణునిన్ జిష్ణునిం
బలుకాకీ! యిటు లేలపల్కెదవు నీ పాండిత్యమున్ నిల్పుమా!

పద్మా:- భటులారా! (బంధింపుఁడని సైగ చేయఁబోవ)
భటులు:- ప్రభూ! ఏమి సెలవు!
సింహా:- అగ్రజా! (వద్దని సైగ చేయును)
వీర:- ఇదియే మీకుఁజెప్పు కడపటి వాక్యము.
ఉ॥ ఎక్కుముమీఁదఁ గుక్కుటము శీవిగనొప్ప గుహుండు తేజిపై
నెక్కి శరప్రకాండము లహీనముగా గురిపింప దిక్కులన్
బిక్కటిలంగ నీ బలము పీనుఁగులై పడువేళ సంధికై
యుక్కటి మ్రొక్కి మొత్తుకొన నొక్కరు నీ పలుకాలకింతురే.
[పద్మాసురుఁడు సైగ చేయ బంధించుటకు భటు రాఁబోవ వీరబాహువు గ్రహించును]
వీర:- సర్వశక్తిసంపన్నుఁడైన సర్వేశ్వరుఁడు నా వెన్నునఁగాచికొని యుండెనేని నే నిటనుఁడి వెళ్ళువఱకు ఈ భటు లట్లే నిలచి యుందురుగాక! (అడుగువేయుచు లోనికిఁజూచి) సారథీ! రథముఁ ద్రిప్పుము. (నిష్క్రమణము)
నార:- చూచితివా ఆ మహాభక్తుని మహిమ!
శా॥ ఆలుంబిడ్డలతోడ బంధువులతో నాహ్లాదముంబొందు నీ
వేలా ఘోర లయంబుఁ దెచ్చికొనెదో యీ సంధి పాటింపకే
చాలుంజాలిఁకఁ బోయివచ్చెద రణోత్సాహంబు దీపింపఁగాఁ
దాలుంగట్టియుఁ దేలిపోవు విధివ్రాఁతల్ దాఁటగాఁవచ్చునే?
[గానలోలుఁడై నిష్క్రమించుచున్నాఁడు]
ధర్మ:- మహారాజులు సర్వసైన్యాధిపతి నీ సభాస్థలమందే నిర్ణయింపఁదగు. (పూలదండఁదెచ్చి పద్మాసురున కిచ్చును)
పద్మా:-(మాలతో తారకుని సమీపించి)
చ॥ హరినదలించి మించిన బలాఢ్యుఁడవై దిశలేలు నాయకుల్
శరణని వేడఁ జేసిన ప్రచండ గదాధర! యిట్టియుద్ధమం
దరిజయ సైన్యనాయకుఁడవై మన పూర్వుల కీర్తినిల్పి సం
గరమున వైరులల్ జిదిమి క్రమ్మఱ నీ విటరమ్ము తమ్ముఁడా!
[తారకుని మెడలోఁ బూలమాల వేయును. కరతాళధ్వనులు]
సేవ:- (రక్తసిక్తాంగుడై సంభ్రమముతోఁ బ్రవేశించి) సార్వభౌమా? సార్వభౌమా!

పద్మా:-ఏమది?

సేవ:- ఆపద...గొప్ప ఆపద. కుమారస్వామి భక్తుఁడు శాస్త్ర మీ సోదరి భుజమునరకెను.

పద్మా:-ఆఁ! ఆఁ! (కనులెఱ్ఱఁజేయును)

సేవ:- మీ మేనల్లురగు వాతాపి ఇల్వల అగస్త్యుఁడు చంపెనట. కసిదీర్చుకొనఁబోయిన మాకీవిధముగ శాస్తిజరిగినది.

(నమస్కరించి నిష్క్రమించును)

పద్మా:-వింటిరిగదా కుమారికృత్యము. ఇఁకసత్వరముగ మీరందఱు యుద్ధసన్నద్ధులై రండు.

[సింహవక్త్రుఁడుతప్ప తక్కినవారు నిష్క్రమింతురు]

సింహ:-శుభమస్తనఁగనే రక్తదర్శనము. సమయమును గమనించి వర్తించునేర్పు మాయన్న యెడనున్న. వలదని తొలఁగితినా అగ్రజాపకారినని స్వామిద్రోహినని కులమెల్లరోయును మాట మాయును. ఇంతకు నారదుఁడు చెప్పినట్లు విధి అలంఘ్యము.

ఉ॥ వచ్చెడువాఁడు స్కందుఁడట వానికి దక్షిణబాహువట్లుగా
వచ్చెడువాఁడు వీరుడఁట వహ్నికి వాయువుతోడు సూపిన
ట్లిచ్చకొలంది రేఁగఁల రేరికి సాధ్యము వారిఁదాఁక మా
పుచ్చల నూడదీయుటకె పుట్టిన దీపెడబుద్ధి; మాఱునే.

(నిష్క్రమించుచున్నాఁడు)

[తెర]

ఓమ్

కుమారవిజయము

(కుమారస్వామి యుద్ధము)

సప్తమాంకము

ప్రథమరంగము

స్థలము – యుద్ధభూమి

[కుమార వీరబాహువులు సాయుధహస్తులై ప్రవేశించుచున్నారు]

కుమార:-

మ॥ కరవాలంబును జేతఁబట్టి ఘన సంగ్రామస్థలిందూఁకి భీ
కర నృత్యంబులు సల్పి వైరిశిరముల్ ఖండించి తత్కాయముల్
ధరపై వ్రాలఁగ వానిపై నరుగుచుం దచ్ఛీర్షముల్ బంతుల
ట్లరయన్ ఖేచరలీలఁగ్రాల ననిలో నత్యుగ్రతం జూపెదన్.

వీరబాహూ! నీ శౌర్య ధైర్యసాహసములు మెచ్చుకొనఁదగినవి. పద్మాసురుని పుత్రులందఱు వధింపఁబడిరా?

వీర:- లేదుప్రభూ! ఇరువురుమాత్రము మిగిలియుండిరి. పెద్దవాఁడగు భానుకోపుడు మరల రణమునకుఁ దారక క్రౌంచులతో వచ్చుచున్నాఁడు.

కుమా:-మంచిది. తారకునే రానిమ్ము.

చ॥ అలిగిన తారకున్ బలిమి నాహవభూమినిబట్టి దిట్టమా
నలుగులుగ్రుచ్చి వ్రచ్చి వెస నంపెదఁ బ్రేతపురంము సేర నే
వలిగిన భానుకోపుఁడిఁక నంబులధారకు వీఁక నిల్చినన్
నలుగు మహాస్త్ర శస్త్రముల నా ఘనదోర్బల విక్రమంబునన్.

నీవా దెసకేగి మనసేనలకుత్సాహము గలిగింపుము.

వీర:- చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు)

[ఈ క్రింది పద్యము జదువుచుఁ దారకుఁడు ప్రవేశించుచున్నాఁడు]

తార:-ఓరీ నిర్జరపక్షపాతీ!

ఉ॥ చిక్కితి వెందుఁబోఁగలవు చెచ్చెఱ వచ్చుచునుంటి నెత్తురుం
గ్రక్కఁగఁ దన్ని నీశిరముఖండనచేసి మదీయ శౌర్యమున్
బెక్కుగఁ జాటువాఁడనిదె భీకరమౌ గదఁ జూచినాఁడవే?
నిక్కెదవేల నిర్జరులు నిన్నిలఁబెద్దగఁజేసి పంపినన్.

కుమా:-నిర్జరులుగాదురా ధర్మదేవత పెద్దగఁజేసిపంపినది.

చ॥ బవరము చేసి నాకులను బాధలఁబెట్టితివంచు మించి యీ
భువనము లెల్లఁ దల్లడిలఁ బొంగకు మీ క్షణమిందె భంగమౌ
దివి భువి నీదుచావునకు దేవుని బ్రార్థనచేసినంత నీ
శివతనయుండు నిన్నిపుడు చీల్పఁగఁ జవ్వకువచ్చె నిల్వుమా!

తార:-(వికటముగ నవ్వి) పిట్టకొంచెము. కూఁతఘనము.

ఉ॥ నిల్చెద సంగరస్థలిని నిర్జరకోటులు బెగ్గడిల్లఁగాఁ
బిల్చెద నాదుసైనికుల భీకర యుద్ధకళాకలాపులన్
గెల్చెద నీదు యోధులను గేలియొనర్చెద పిల్కుమార్చెదన్
జీల్చెద నీదువక్షమును నేదయుఁదీరఁగఁబీల్తు రక్తమున్.

రమ్ము జయమ్మెవరిసొమ్మో తేలఁగలదు.

[కుమార తారకులు యుద్ధముసేయుచుండ క్రౌంచుఁడువచ్చి కుమారునితోఁ దలపడును. తారక క్రౌంచులు వెనుకంజవేయుచు లోనికేగుదురు]

కుమా:-(పరికించి) ఓహో! ఎంత మోసము. కామరూపులగు వీరెంత మాయాస్పదులు! తారక క్రౌంచులు వీరబాహుని మోసగింపఁదలఁచి క్రౌంచుఁడీ పర్వతరూపము దాల్చియుండ తారకుఁడద్దాని గుహాంప్రవేశింప నా మిత్రుఁడు వాని వెంట నేగె. అంధకారబంధురమగు గుహామధ్యమున వీరునిబంధించి వధించుటకై యీ పన్నగడఁ బన్నినారు. ఈ క్షణంబ వీరి మాయలన్నియుఁ బ్రళయవాయు సన్నిధి శరన్మేఘము వలె

వమ్మె పోవుఁగాక! తొలుత బర్వతరూపధారియగు క్రౌంచా
సురుని పనిబట్టెద.

[నిష్క్రమించి మరలఁబ్రవేశింపఁగా బర్వతము, దానిగుహ కనఁబడును. పర్వతమును బల్లెముతోఁబొడువఁ బెద్దమ్రోఁతతోఁ బగులును. క్రౌంచుఁడు నిజరూపముదాల్చి క్రిందఁబడి చనిపోవును]

(రక్తసిక్తాఁగుఁడై తారకుఁడు ప్రవేశించుచున్నాఁడు)

తార:- మదీయ... ఖడ్గ... ఘా... తంబున..... నీ శిరంబు...
వ్రయ్యలు చేసెద...చూడుము.

[కుమార తారకుల యుద్ధము. తారకుఁడు నేలఁగూలును]

కుమా:-అబ్బా! ఇప్పటికి శూరపద్మునకుఁ గుడిభుజము పోయినట్లే.

తెఱలో స్వామీ! సింహవక్త్రుఁడు మనసేనలచించి చెండాడు
చున్నాఁడు.

కుమా:-భయమువలదు. ఆదెసకే వచ్చుచుంటి. (నిష్క్రమణ)

సింహ:-(ప్రవేశించుచు)

శా॥ ఘోరాస్త్రంబును జేతఁబట్టి జగముల్ ఘూర్ణిల్లఁ గ్రోధైక సం
చారప్రక్రియఁ జాటినాఁడననుచున్ సంతోషముంబొందకే
నా రాకన్ మదినెంచుమా అరయుమా! నానాస్త్రవిధ్వంసినై
సారాచార విచార ధీరసరణిన్ సాధింతు మిమ్మెల్లరన్.

కుమా:-(ప్రవేశించి) ఓయీ సింహవక్త్రా! ఏల యజ్ఞానాంధకార
మగ్నమానసుండవై నాతో సమరముసేయ సాహసింతువు?
తొలఁగిపొమ్ము.

సింహ:-అలముచేయ ప్రాలుమాలి యీ నేలందొలంగిపోవుటకు బేల
ననుకొంటివా? వాలు బట్టితినేని కాల కాలునైన రణకేళిం
దూలింపఁగల బలశాలినని యెఱుంగుము. పట్టినపట్టుపీడక నీ
దండును గుట్టలుగుట్టలుగా మట్టువెట్టఁగలజెట్టిని నేనే.

కుమా:-నీవు జ్ఞానవంతుడవేని నా మాటలలోని సత్యమును గమ
నింపుము. ఇప్పటికైన నామాటను బాటించి సంధికిసమ్మతించిన
పద్మాసురునకు మేలగు. ఒక్కక్షణము కన్నులుమూసుకొనుము
నా విశ్వరూపము గనిపించఁగలదు.

సింహా:-(నిమీలిత నేత్రుడై) స్వామీ! మీ మహిమ గ్రహించితిని. నేనొక్కండ నేమిసేయుదు? నాయన్న నా మాట వినఁడు. మాకు మీచేత చావుసిద్ధము. కానఁ గదనములు సాఁగించి నాకుఁ గైలాస మొసంగుఁడు.

కుమా:-మంచిది. అట్లేయొసంగెద.

[యుద్ధము సేయ సింహవక్త్రుఁడు పడిపోవును]

[తెఱ]

(మఱలఁదెఱ నెత్తఁగా క్రిందిపద్యముజదువుచుఁ బ్రవేశించుచున్నాఁడుపద్మాసురుఁడు)

పద్మా:-గీ॥ అమరులకుఁ బూర్వ సౌఖ్యములందఁజేయ
నీదురతమాన నే నింక నిలిచియుండ
గదను చేఁబూని వచ్చితిఁ గదనమునకు
నిలిచిపోరుము నా తోడ నీచ చరిత.

కుమా:-(తెఱలోనుండి) ఓరీ సురారీ!

ఉ॥ వచ్చెద వాఁగఁబోకు తులువా! పరిపక్వము చెందెఁ పాపముల్
చచ్చెదవింక నీ పొగరు సాఁగదు శూలితనూజు చెంగటన్
బొచ్చెము లేదు రమ్ము తినఁబోవుచునే గొచి నెంచనేల? ఓ
తుచ్ఛ! త్వదీయరక్తమును దోసిల నర్ఘ్యమునిత్తుఁ గాళికిన్.

నీ వనుభవింపవలసిన పాప ఫలము మహా మేరువువోలెఁ బెఱిగియున్నది. నీ వెంత శూరశిఖామణివైనను దైవ సహాయంబు లేని నీ దౌర్జన్యము పనిసేయునా? నా జనకుని కరుణచే నింతటి మహోన్నతపదవినంది మన్ను మిన్ను గానక లోకంబులను చూడఁజాలని బాధలఁజిక్కఁజేయుటచే వారిపై నక్కటికంబున ముక్కంటియే మీ వధకై నన్నుసృజించె. అందులకు నిదర్శనంబుగ నీ మహాయుద్ధంబున మా దివ్యవాహినులు మీ సైన్యంబుల మృత్యుప్రవాహమున ముంచె. నీ సోదరు లింతకు ముందే యమ దంష్ట్రికలంజిక్కినారు. కొమ్ములు తెగిన మ్రానువోలె నీ వొక్కండవు మిగిలియుంటివి. మంచిని యోచించి నాతో వైరము వాటింపకుము.

పద్మా:-అటులైన రెండుపల్కులకుఁ బ్రత్యుత్తర మొసంగెదవా?

కుమా:-నిస్సంశయముగ.

పద్మా:-దేవదానవులు సోదరులేగదా!

కుమా:-అవును కశ్యపసంబంధమున.

పద్మా:-అందు జ్యేష్ఠభార్యకు జనించిన దైత్యులకు రాజ్యాధికారము లేకుండఁజేసిన దుర్మార్గులెవరు?

కుమా:-తొలుత రాజ్యాధికారము దైత్యులదే. ఐనను వారు క్రూర కృత్యంబులవలన బదభ్రష్టులైరి. పిదప నింద్రుడు నూఱు యజ్ఞములు చేసి యమర సింహాసనాధికారము పొందెను.

పద్మా:-నూఱు కాదు. వేయి యజ్ఞములు చేసినను జ్యేష్ఠాధికారము కనిష్ఠునకే కలుగునా? పెద్దవాడుకు పెత్తనము వెన్నలోఁ గలిసి నట్లేనా? ఇఁక నీవెన్ని చెప్పినను నమ్మను. మా అన్నదమ్ముల తగవులలో నిష్కారణముగ జోక్యము కలుగఁజేసికొని అందొక పక్షముఁజేరుట మీకుఁ బరిపాటియైనది. ఐనను—

సీ॥ బాల్యచాపల్య సంబద్ధుఁడవై మించి
బంధింప ముదుసలి బ్రహ్మ కాఁడు
నీ వేషమునకుబ్బి నీవె దైవంబని
భక్తిగొల్వఁగ వీరబాహు కాఁడు
నీ పిచ్చిమాటలు నిజమని మది నమ్మి
శరణువేడఁగ సురేశ్వరుఁడు కాఁడు
ప్రాణభీతిని జెంది ప్రభునితో బాటు నీ
జయముగోరఁగ బృహస్పతియు గాఁడు

గీ॥ ఘోర దుర్వార సంగర క్రోధజనిత
రోష కాలాగ్ని కీలల భీషణాతి
యక్ష గంధర్వ కిన్నర శిక్షకుండు
శూర మత్తేభ సింహంబు శూరుఁడితఁడె!

కుమా:-ఓహో! శ్రుతిమించి రాగము. నీ నెత్తుట జొత్తిల్లిన నా కత్తి గాంగజలంబులతోఁ గడిగి కైలాసంబున కరిగెద.

ఉ॥ క్రొవ్వునఁ జివ్వకుం గదిసి కో! యని దూఁకిన వైరిశీర్షముల్
గవ్వలగుత్తులట్లుపడఁ గాండ పరంపరలీలఁజూపు న
న్నివ్విధి డాసినన్ మిడుత లింగలముంబడురీతి కాదొకో!
అవ్వలతో వసంతమని యాగితి నింతకు సంశయించుచున్.

పద్మా:-అవ్వలో అవ్వాయిచువ్వలో అయిదు నిమిషములలోఁ దేలఁగలదు ఇదిగో! సకలలోకభయంకరమగు పాశుపతాస్త్రంబు వదలుచున్నాను (వెనుకకుఁబోయి వదలును)

కుమా:-ఔరా! ఏమిదీనిమహిమ! అసాధ్యమగు నీ పాశుపతాస్త్రము నుండి తప్పించుకొనుటెట్లు? విల్లుగూడ విరిగినదే! సర్వలోకములు దహించువిధమున నగ్నిజ్వాలలు భయంకరముగ నష్టదిక్కులఁ గ్రమ్ముచున్నవే. తాపము... తాపము .. మానసమా! దుర్బలత్వమును జెందుచుంటివా? మఱవకు..... నేనిప్పుడెచటనుంటిని? కైలాసమా? .. అగ్నికుండమా?... కాదు ఇది యుద్ధభూమి. భవానీ! పాహిమామ్.

దండకము

శ్రీమన్మహాదేవి చాడేశ్వరీ శాంకరీ లోకమాతా జయోపేత నేతా భవానీ మృడానీ సదా భక్తగణ్యా కళాధీన దీనావనా పాపసంహార ధీరా శుభాకార వందారు బృందార కానంద సంధాన మందార నీ దివ్యపాదార విందంబులన్ నాదు డెందంబునన్ భక్తితో నిల్పి సేవించువాఁడన్ గటాక్షంబు నాపైఁ బ్రసాదింపవే శక్తినిప్పింపవే నీదు పుత్రుండనౌ నన్నుఁగావంగ రావే పరాశక్తి రుద్రాణి శర్వాణి కాత్యాయనీ గౌరి బ్రహ్మాండమున్ సృష్టిగావింపఁ బోషింప నాశంబు గావింప నీవేగదా శక్తిసంపన్నవో నిత్యకళ్యాణి దుర్గా నమస్తే నమస్తే నమః.

[పైనుండి ఖడ్గము శక్తి వచ్చుచుండును]

త్రైలో:-నీ తండ్రిసంబంధమగు నయ్యస్త్రమునకు నమస్కరించుమా. అది శాంతించును. రాక్షసునిపై నీ శక్తిని బ్రయో

కుమా:-(శక్తిని గ్రహించి) కృతార్థుఁడను. జననీ! మహాకాళీ!

మ॥ అధికారంబును గల్గి యుంటిమని ధర్మాధర్మముల్ చూడకే
మదమెక్కన్ గను గానలేక కడు దుర్మార్గమ్మునంజొచ్చి యీ
ప్రధనంబున్ సమకూర్చె వీని విడునన్ భావ్యంబె నీ వి క నా
బుధవైరిం గని మాయచేయు నెటకుం బోనీక బంధింపుమా.

(నిష్క్రమించును)

[గదాహస్తుఁడై రక్తసిక్తాంగుఁడై పద్మాసురుఁడు ప్రవేశము]

పద్మా:-ధర్మయుద్ధంబున వీనినిజయించుట యసాధ్యము. నా తల్లివలనఁ బొందిన మాయాస్వరూప దృగ్గోచర విద్యచే వీనికన్నులకుఁ గనపడకుండ జంపవలయు (పోఁబోవ శూలముతో తీవ్ర దృష్టితో శంకరుఁడు ప్రవేశము) ఔరా! చిత్రము... విచిత్రము...మృత్యుంజయుఁడా! ఈశానుఁడా!... ఆఁ! అదిగో అగ్ని నేత్రము... పినాకము... త్రిశూలము... నాకు వర ప్రదాతయే నా ప్రాణఘాతమునకుఁ బ్రయత్నించునా? ఛీ! యేమి యీ యశుభవాక్కు. మఱియొక దెసకేగెద.

[పోఁబోవ కరాళవదనము తెఱచి యఱచుచు కాళికాశక్తి యడ్డుపడును]

కాళీ! మరల వచ్చితివా?... పుత్రప్రేమ... కానిమ్ము... నిన్నెదుర్కొనవలసిన యవసరము నాకు లేదు పొమ్ము.

[వేఱొకదిక్కునకుఁ బోఁబోవ చక్రధరుఁడై విష్ణువు ప్రవేశించుచున్నాఁడు]

అరెరే! విష్ణు! నాతమ్ముని బారికి నిలువఁజాలక చీకాకైన విష్ణు! ఇప్పుడు వీరాధివీరుఁడై యడ్డగించినాఁడు... ఆహా! కాల మహిమ. నాడు వక్రంబైన చక్రము సక్రమంబుగఁ గన్పట్టు చున్నదే! మాయకాఁడా! సమయము తప్పినది. మఱియొక సారి నీ పనిపట్టెద.

[ఇంకొకదెసకుఁ బోఁబోవ బ్రహ్మ ప్రవేశించుచున్నాఁడు]

ఓహో! తాతగారు...తలయు గడ్డము పండిన తాతగారు... బ్రహ్మ. ఆచార్యులవారుపదేశించిన జాలవిద్య ఇప్పుడక్కఱకు వచ్చునట్లు లేదే! చూచెద.

[మఱియొకదెసకుఁ బోఁబోవ వజ్రాయుధమును మెఱపించుచు నింద్రుఁడు ప్రవేశించుచున్నాఁడు]

ఆఁ! ఆఁ! గౌతముని పంచకోడి!... వేయికన్నులుగల వీరుఁడు ...పలుమారులు మా వంగడమునకోడి డాగిన వీరుఁడు .. ఛీ! నీ మొగము చూడరాదు... తొలఁగుము... ఆఁ! వజ్రాయుధమును ఝుళిపించుచుంటివా!... కాలము మాఱినప్పుడు కట్ట గొఱ్ఱెయై కఱచును (అడుగిడఁబోయితూలి) ఆఁ! ఏమిది? నాశక్తియంతయు నే మహాశక్తిచేతనో హరింపఁబడుచున్నది. నా యంతరాత్మ యేదియో జ్ఞానోపదేశము చేయుచున్నది. నేనుచేసిన ఘోరకృత్యము లన్నియు నన్నీరూపమునఁ జుట్టుముట్టుచున్నవా? (దిక్కులఁ జూచి) ఇదియంతయు కుమారుని జాల విద్యయా... తెలిసికొంటిని... దురాత్ముఁడగు వాఁడెక్కడ? పట్టి చీల్చెద... నెత్తురుపీల్చెద ప్రేవులు తాల్చెద...

[తెఱలో]

కుమా:-ఓరీ! క్రూరా! (ఈ క్రింది పద్యాంతముతోఁ బ్రవేశము)

శా॥ భక్తిన్ మజ్జననిన్ భజింపఁదగఁ బ్రాప్తంబై సురానీక మా
సక్తింగాం చెడిదై త్వదీయబల భాస్వద్ఘోర సైన్యాళులన్
ముక్తప్రాణులఁ జేసి నీ కొఱకునై పొల్పొందుఁ బెనశక్తి ఈ
శక్తిన్ నీయసురుల్ హరించి ఘన దోశ్శక్తిం బ్రదర్శించెదన్.

[ఇరువురు యుద్ధముచేయుదురు. పద్మాసురుని ఱొమ్ముపై కుమారుఁడు కూర్చుండి శక్తితోఁబొడువఁబోవ నొకప్రక్కనుండి శంకరుఁడు వేఱొకప్రక్కనుండి నారదుఁడు ప్రవేశించుచున్నారు]

పద్మా:-(హీనస్వరమున) స్వామీ! నీ శక్తి గ్రహించితి. నన్ననుగ్రహించి నీ వాహనముగఁ జేసికొమ్ము.

శంక:- కుమారా! ఆగుము. నీవలె నితఁడును గారణజన్ముఁడు. కాని, క్రూరత్వము వీరత్వమునకుఁ గళంకముఁగూర్చినది. సింహావలోకనమున పశ్చాత్తప్తుఁడై కన్నీటితో కళంకము కడిగికొని, తన చరిత్రకు శాశ్వతత్వముఁ గల్పించుకొన నిన్నీకోరిక కోరినాఁడు. అంగీకరింపుము. నెమిలివాహనముగనుండి నిరంతరము సేవించుచుండును.

కుమా:-చిత్తము (పద్మాసురుని బొమ్మపై నుండి లేచును)
పద్మా:-మహాప్రసాదము. (నమస్కరించును)

(క్షణములో పద్మాసురుఁడు నెమలిగామాఱును)

శంక:- కుమారా! మహావిజయసూచకంబుగా ఇప్పుడే మాయూర వాహనుండవుకమ్ము.(నెమలిపై నెక్కి కుమారుఁడు శంకరునకు నమస్కరించుచుండ ఇంద్రుడు కుమారుని పుష్పమాలాలంకృతునిగా జేయును)

నార:- ధన్యులము.

చ॥ జయము జయంబు మా కొమరుసామికి దిగ్విజయంబు సత్కళా
శ్రియులగు దేవతాళికిఁ బ్రశాంతశుభంబగు లోకపాళికిన్
నయవినయాది సద్గుణగణంబుల రాజిలు భక్తకోటికిన్
జయమగు సర్వజీవులకు సంతసమందుచు సౌఖ్యమందగా.

శంక:- తథాస్తు.

మంగళం మహత్.

తెఱ

గద్యము

ఇది శ్రీమద్గౌరీశంకర వరప్రసాద లబ్ధ సహజ
చతుర్విధ కవితా కలా విలాస సాహితీ రసవికాస
సంస్కృతాంధ్రాది బహుభాషా గభీరమనోహర
భావ బంధురమహోల్లాసభాస బంధ్ల పిచ్చమ్మా
పిచ్చయామాత్య పౌత్ర యాదమ్మా
వేంకట సుబ్బయార్య జ్యేష్ఠపుత్ర
యన్నపూర్ణా సావిత్రీ కళత్ర
సుహృజ్జన సువిధేయ
సుబ్రహ్మణ్యనామధేయప్రణీతమైన
కుమారవిజయము

సంపూర్ణము.